అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

మంగళవారం 01-01-2019
సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 5 సంచిక : 4 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 6.50

రాజ్యసభ రబ్బరు స్టాంపు కాదు

ట్రిపుల్ తలాక్ బిల్లుపై ఏకమైన ప్రతిపక్షాలు

- సెలెక్ట్ కమిటీకి పంపించాల్సిందేనని డిమాండ్
- ఓటింగ్ జరపాలని 11 పార్టీల తీర్మానం
- ఒప్పుకోని సర్కారు... వాయిదా పడిన సభ





వివరాలు 2లో

సిడ్నీలో నూతన సంవత్సర వేడుకలు



నూతన సంవత్సర శుభాకాంక్షలు

పాఠకులకూ,
ప్రకటనకర్తలకూ,
శ్రేయోభిలాషులకూ
నూతన సంవత్సర
శుభాకాంక్షలు

- చీఫ్ జనరల్ మేనేజర్, నవతెలంగాణ





సోషల్ మీడియా స్కాన్

నిందితులను గుర్తించటానికి ఫొటో డీఎన్ఏ వాడండి: సీబీఐ

- కోట్లమంది వ్యక్తిగత గోప్యతకు భంగకరం: న్యాయ నిపుణులు
- ఈయూ దేశాల్లో ఫోటో డీఎన్ఏపై నిషేధం

న్యూఢిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థలకు వ్యక్తిగత కంప్యూటర్లపై నిఘా వేసే అధికారాన్ని మోడీ సర్కారు కట్టబెట్టడంతో పౌరుల గోప్యత హక్కుపై, నిఘా వేసే అధికారాలపై దేశంలో ప్రస్తుతం చర్చ వేడిగా జరుగుతున్నది. ఈ తరుణంలో సీబీఐ మరో బాంబు పేల్చింది. పలు నేరాల్లో అనుమానితుల్ని గుర్తించేందుకు ఫోటో డీఎన్ఏను వినియోగించాల్సిందిగా సోషల్ మీడియా సంస్థలను సీబీఐ కోరడం వివాదాస్పదంగా మారింది. దీని వాడకంపై పలు న్యాయపరమైన చిక్కులున్నట్టు నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ ఐటీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ రూపొందించిన ఫోటో డీఎన్ఏ సాఫ్ట్‌వేర్ వాడకంపై అంతర్జాతీయంగానూ ఆంక్షలున్నాయి. ఈ సాఫ్ట్‌వేర్‌ను తయారు చేసిన మైక్రోసాఫ్ట్ కూడా చిన్నారుల పట్ల అసభ్యంగా వ్యవహరించే నేరస్తుల విషయంలో మినహాయించి మిగతా అంశాల్లో దీనిని వినియోగించొద్దంటూ షరతు విధించింది. చిన్నారుల విషయంలో ఉచితంగానే వినియోగించుకునేందుకు మైక్రోసాఫ్ట్ అవకాశం కల్పించింది. అసభ్యతతో కూడిన ఫోటోలను నెట్ నుంచి తొలగించడం, నేరాలకు పాల్పడినవారిని ...9లో





ఇక..రెండు హైకోర్టులు

ఏపీలో కొద్ది సమయం విధులు నిర్వహించిన జడ్జిలు

- అమరావతికి వెళ్లిన ఏపీ లాయర్లు, ఉద్యోగులు





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉమ్మడి హైకోర్టు విభజనకు చివరి అంకం కూడా ముగిసింది. సోమవారం ఉదయం కొద్ది సమయం ఉమ్మడి హైకోర్టులోని న్యాయమూర్తులు తమ విధులు నిర్వహించారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తులందరూ కలిసి ప్రధాన భవనం వద్దకు చేరుకున్నారు. ఏపీ హైకోర్టుకు కేటాయించిన 14 మంది న్యాయమూర్తులకు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు వీడ్కోలు పలికారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, ఇతర తెలంగాణ న్యాయమూర్తులు ఏపీకి వెళుతున్న న్యాయమూర్తులకు ...9లో

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బ్రహ్మాండం..

ఐదేండ్లలో రూ.10 లక్షల కోట్లకుపైగా ఖర్చు :సీఎం కేసీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బ్రహ్మాండంగా ఉందని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. గత నాలుగేండ్లలో సగటున 17.17 శాతం వృద్ధిరేటును సాధించామని తెలిపారు. సోమవారం ప్రగతి భవన్‌లో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ 29.97 శాతం వృద్ధిరేటు ఉందని చెప్పారు. జీఎస్‌డీపీలో ప్రథమ స్థానంలో ఉన్నామని తెలిపారు. వచ్చే ఐదేండ్లలో రూ.10 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేయబోతున్నామని వివరించారు. అందుకే మూస పద్ధతిలో ఆలోచించకుండా నూతన ఒరవడికి సిద్ధం కావాలని సీఎం అన్నారు. సమీక్షలో జరిగిన చర్చల ప్రాతిపదికన ఆలోచనలు పంచుకుని ఏ విధంగా ముందుకు పోవాలనే విషయాన్ని నిర్ణయించాలని ఆదేశించారు.

వలసలకు తలుపులు బంద్

ఐరోపాదేశాల నిర్ణయం



హవానా: ఇతర దేశాల నుంచి వలసవస్తున్న పేదలను నడి సంద్రంలోనే అడ్డుకుంటున్న ఐరోపా దేశాలు 2019లో మరింత కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించాయి. వలసలకు తలుపులు మూయాలని ఇటలీ, మాల్టా వంటి దేశాలు ఇప్పటికే నిర్ణయించాయి. మరి కొన్ని యూరపు దేశాలు కూడా అదే మార్గాన్ని అనుసరిస్తున్నాయి. మధ్యధరా సముద్రంలో 33 మంది వలసవాసులను రక్షించిన ఒక స్వచ్ఛంద సంస్థ సీవాచ్‌కు చెందిన నౌకలను తమ రేవుల్లోకి రానీయకుండా ఇటలీ ఇటీవల అడ్డుకోవడంతో వలసల అంశం మరోసారి చర్చనీయాంశమైంది. సముద్రం మధ్యలో చిక్కుకున్న వారిని రక్షించి తీరానికి తీసుకొస్తే వారిని ఓడరేవు వద్దే అడ్డుకోవడం అమానుషమని డాక్టర్స్ వితవుట్ బోర్డర్స్, ఎస్ఓఎస్ మెడిటెర్రీనీ వంటి స్వచ్ఛంద సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఏ దేశమూ అనుమతించకపోతే వారు ఏం కావాలి? మానవతా విలువలను మంటగలుపుతున్నవారిని ఏమనాలి? అని ఈ సంస్థలు నిలదీస్తున్నాయి. సహాయక శిబిరాలలో వున్న వలసవాసులు కూడా వసతుల లేమితో నానా అగచాట్లు పడుతున్నారు. 2016లో మధ్యధరా సముద్రంలో ప్రమాదంలో చిక్కుకున్న దాదాపు 30 వేల మంది అక్రమ వలసవాసులను కాపాడిన అక్వారిస్ నౌకకు ఐరోపా ప్రభుత్వాల నుంచి అనుమతి లభించకపోవటంతో తన కార్యకలాపాలను నిలిపివేసింది.

అంతర్జాతీయ వలస వ్యవహారాల సంస్థ (ఐఓఎం) లెక్కల ప్రకారం 2018లో ఇప్పటివరకు 2,100 ...9లో



నేడు మహిళాహారం

కేరళలో 55 లక్షల మందితో 620 కిలోమీటర్లు

- రాజకీయ సామాజిక సంఘాల నుంచి విశేష మద్దతు

వివరాలు 2లో



బంగ్లా ఎన్నికల్లో హసీనా గెలుపు

288 పార్లమెంట్ స్థానాల్లో అధికార అవామీలీగ్ కూటమి జయకేతనం

- హసీనాకు 2,29,539ఓట్లు... సమీప ప్రత్యర్థికి 123 ఓట్లు

వివరాలు 7లో



నో జీన్స్...

ఇంద్రకీలాద్రిలో డ్రెస్ కోడ్



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ పుణ్యక్షేత్రమైన విజయవాడ కనకదుర్గ గుడిలో జనవరి 1వ తేదీ నుంచి భక్తులకు డ్రెస్ కోడ్ అమలులోకి రానున్నది. ప్రతీ భక్తుడు, భక్తురాలు తప్పనిసరిగా డ్రెస్ కోడ్ పాటించాలని, అలా పాటించని వారికి అమ్మవారి దర్శనానికి అనుమతించబోమని ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కోటేశ్వరమ్మ సోమవారం తెలిపారు. 'భక్తులందరూ డ్రెస్ కోడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ప్రత్యేకంగా మహిళా భక్తులు చీరలు, లంగా ఓణీ, లేదా సాంప్రదాయక వస్త్రాలను ధరించాలి. జీన్స్, పొట్టి టీషర్ట్స్, మిడ్డీలు, స్లీవ్‌లెస్ టాప్స్‌ను వేసుకొని వస్తే ఆలయంలోకి అనుమతించేదిలేదు. కొత్త విధానం తెలియక ఆలయానికి వచ్చిన మహిళా భక్తులకు రూ. 100తో అమ్మవారి చీరను అందచేయడం జరుగుతుందని ఈఓ తెలిపారు. దుస్తులు మార్చుకునేందుకు వీలుగా గదులను కూడా ఏర్పాటు చేస్తున్నట్టు ఆమె వివరించారు. మరోవైపు దేశంలోని కొన్ని దేవాలయాల్లో ఇప్పటికే డ్రెస్ కోడ్ అమలులో వున్న విషయం తెలిసిందే. కర్నాటకలోని మహాబలేశ్వరం ఆలయం రెండు నెలల క్రితమే డ్రెస్ కోడ్ విధించింది. 'ఇక్కడ పురుషులకు కూడా డ్రెస్ కోడ్ ఉంది. వారు కేవలం ధోతీలు ధరించి మాత్రమే ఆలయంలోకి రావాలి. షర్ట్స్, టీ షర్ట్స్‌లను ...9లో



మోసాల్లో బ్యాంకింగ్

2017-18లో 72 శాతం మేర పెరుగుదల

23,933 కోట్ల నుంచి 41,168 కోట్లకు జంప్


నాలుగేండ్లలో నాలుగు రెట్లు..

- 93 శాతం కేసులు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనే : ఆర్బీఐ
- మోడీ హయాంలో ఎక్కువైన ఎగవేతదారులు

న్యూఢిల్లీ: దేశ బ్యాంకింగ్ రంగంలో మోసాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. ఈ తరహా మోసాలను నియంత్రించేందుకు తాము పలు చర్యలు చేపడుతున్నట్టు కేంద్రంలోని మోడీ సర్కారు గొప్పలు చెబుతున్నప్పటికీ వాస్తవానికి క్షేత్ర స్థాయిలో ఇందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగేండ్లలో ఈ మోసాల విలువ ఏకంగా నాలుగు రెట్లు పెరగడమే ఇందుకు నిదర్శనం. భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) వెల్లడించిన నివేదిక ప్రకారం మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరంలో (2017-18లో) బ్యాంకింగ్ రంగంలో రూ.41,167.7 కోట్ల విలువ చేసే మోసాలు చోటు చేసుకున్నాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరపు రూ.23,933 కోట్ల ...9లో



సీపీఐ(ఎం) నేత సైమన్ బ్రిట్టో కన్నుమూత




న్యూఢిల్లీ: సీపీఐ(ఎం) నాయకుడు, రచయిత సైమన్ బ్రిట్టో(64) సోమవారం కన్నుమూశారు. తీవ్ర గుండెపోటుతో త్రిసూర్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య సీనా భాస్కర్, కూతురు కయీనిలా ఉన్నారు. 1954, మార్చి 27న ఎర్నాకుళం జిల్లాలోని పొంగిక్కరలో జన్మించారు. ఆయన తండ్రి నికోలస్ రోడ్రిగ్యేజ్, తల్లి ఇరిన్ రొడ్రిగ్యేజ్. ఆయన విద్యాభ్యాసం ఎర్నాకుళంలోని సెయింట్ ఆల్బర్ట్స్ కాలేజీలో, బీహార్‌లోని మిథిలా యూనివర్సిటీలో, ఎర్నాకుళంలోని న్యాయ కళాశాల, తిరువనంతపురంలోని న్యాయ అకాడెమీలలో సాగింది. క్యాంపస్ రాజకీయాల్లో ఆయన చురుకుగా పాల్గొనేవారు. ఆయన 1984లో కేరళ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ) వైస్‌ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు ప్రత్యర్థులు ఆయనపై కత్తితో దాడి చేశారు. ఆ సమయంలో బ్రిట్టో శరీరం పక్షవాతానికి గురైంది.

2006-11 మధ్య కేరళలో వామపక్ష కూటమి అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర అసెంబ్లీకి ఆంగ్లో-ఇండియన్ సభ్యుడిగా ఆయన నామినేట్ అయ్యారు. ఆయన మూడు నవలలతో పాటు అనేక ఆర్టికల్స్ కూడా రాశారు. ఆయన మొదటి నవల 'అగ్రగామి' కేరళ సాహిత్య అకాడెమీ అవార్డును గెలుపొందింది. కేరళ గ్రంథాలయ కౌన్సిల్ సభ్యుడిగానూ బ్రిట్టో ఉన్నారు.

సమాచార కమిషనర్‌గా సుధీర్ భార్గవ

- నలుగురు కమిషనర్లనూ నియమించిన ప్రభుత్వం



న్యూఢిల్లీ: కేంద్ర సమాచార కమిషన్‌కు సారథిగా సుధీర్ భార్గవ నియామకమయ్యారు. ప్రధాన సమాచార కమిషనర్ సహా నలుగురు కమిషనర్లనూ ప్రభుత్వం నియమించింది. ఇది వరకు సమాచార కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన సుధీర్ భార్గవను ప్రధాన సమాచార కమిషనర్‌గా ఎంపికచేసింది. కాగా, ఇన్ఫర్మేషన్ కమిషనర్లుగా మాజీ ఐఎఫ్ఎస్ అధికారి యశ్వర్ధన్ కుమార్ సిన్హా, మాజీ ఐఆర్ఎస్ అధికారి వనజ ఎన్ సర్నా, మాజీ ఐఏఎస్ నీరజ్ కుమార్ గుప్తా, మాజీ న్యాయ కార్యదర్శి సురేశ్ చంద్రల నియామకానికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదం తెలిపారు. సీఐసీకి ఆమోదించిన సిబ్బంది మొత్తం 11 మంది. అయితే ప్రస్తుతం విధుల్లో ఉన్నవారు మాత్రం ముగ్గురే. చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ ఆర్ కె మాథూర్, ఇన్ఫర్మేషన్ కమిషనర్లు యశోవర్ధన్ ఆజాద్, శ్రీధర్ ఆచార్యులు, అమితవ భట్టాచార్యలు ఇటీవలే పదవీ విరమణ పొందిన సంగతి తెలిసిందే. దీంతో కేంద్ర సమాచార కమిషన్‌లోని ఖాళీలపై కార్యకర్తలు సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది.

మంత్రాల నెపంతో వృద్ధుడి హత్య

- త్రిపురలో ఘటన

అగర్తల: సమాజం ఆధునిక టెక్నాలజీతో కొత్త పుంతలు తొక్కుతున్నప్పటికీ ప్రజల్లో మాత్రం మూఢనమ్మకాలు ఇంకా తగ్గడం లేదు. మంత్రాల నెపంతో ఒక వృద్ధుడిపై కొందరు దాడి చేసి హత్య చేయడమే ఇందుకు నిదర్శనం. ఈ అమానవీయ ఘటన త్రిపురలోని ఖోవాయ్‌జిల్లాలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమారి పారా గ్రామంలో బాధితుడు లఖాన్‌జోయ్ రీంగ్ ఇంటి పక్కన హన్స్‌మాన్ రీంగ్ నివాసం ఉండేవారు. కొన్ని రోజుల క్రితం హన్స్‌మాన్ భార్య దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ చనిపోయింది. అయితే లఖాన్‌జోయ్ చేతబడి చేయడంతోనే తన భార్య చనిపోయిందని హన్స్‌మాన్ ఆరోపించారు. ఈ విషయంపై గ్రామంలో పంచాయతీ పెట్టించాడు. పంచాయతీ పెద్దలు లఖాన్‌జోయ్‌ను నిందితుడిగా తేల్చారు. అనంతరం గ్రామస్థులు ఆగ్రహంతో నిందితుడిపై దాడికి తీవ్రంగా దాడి చేశారు. దీంతో తీవ్ర గాయాలపాలయ్యిన లఖాన్‌జోయ్ ఆదివారం మరణించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆరుగురు నిందితుల్లో.. హన్స్‌మాన్‌తో సహా మరో ఇద్దరిని అరెస్టు చేశారు.

సరైన వైద్యం అందిస్తే అమ్మ బతికేది

- జయ మృతిపై తమిళనాడు మంత్రి

చెన్నై: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత మృతిపై ఆ రాష్ట్ర న్యాయశాఖ మంత్రి సీవీ షణ్ముగం సంచలన ఆరోపణలు చేశారు. జయలలితకు తగిన వైద్యం అందించి ఉంటే ఆమె తప్పక బతికి ఉండేదని మంత్రి అన్నారు. విదేశాల్లో అమ్మకు వైద్యం అందించాలన్న ప్రతిపాదనను కూడా అమలుపరచలేదని చెప్పారు. అమ్మ మరణం వెనుక కుట్రదాగి ఉన్నదని ఆయన ఆరోపించారు. జయలలితకు యాంజియోగ్రాంనకు వ్యతిరేకంగా నిర్ణయం ఎవరు తీసుకున్నారని ప్రశ్నించారు. జయ మృతిపై అపోలో ఆస్పత్రి, వికె శశికళ, ఆరోగ్యశాఖ సెక్రెటరీల కుట్రలపై ఆధారాలున్నాయని అరుముగస్వామి కమిషన్ న్యాయవాది ఇటీవల పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

రూ. 1,146 కోట్ల 'గజ' సాయం

- తమిళనాడుకు కేటాయిస్తూ కేంద్రం ఆమోదం

న్యూఢిల్లీ: ఇటీవల గజ తుఫానుతో నష్టపోయిన తమిళనాడుకు కేంద్రం అదనపు సహాయాన్ని ప్రకటించింది. రూ. 1146.12 కోట్లను కేటాయిస్తూ కేంద్రం సోమవారం ఆమోదం తెలిపింది. సహాయశిబిరాలు, పునరావాస కేంద్రాల ఏర్పాటుకోసం కేంద్రం ఇప్పటికే రూ. 353.70 కోట్లను తమిళనాడుకు కేటాయించిన విషయం తెలిసిందే. కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటి సోమవారం సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ, వ్యవసాయశాఖ మంత్రి రాధామోహన్‌సింగ్, నీటి అయోగ్ వైస్ చైర్మెన్ రాజీవ్‌కుమార్ హాజరయ్యారు. అనంతరం తమిళనాడుకు అందించే అదనపు సాయంపై కమిటీ ఆమోదం తెలిపింది. కాగా, పునరావసం, సహాయశిబిరాలు వంటి ఏర్పాట్ల కోసం తమిళనాడు ప్రభుత్వం గతనెలలో రూ. 14,910 కోట్లను కేటాయించాలని కేంద్రాన్ని కోరింది. 'గజ' తుఫాన్ ధాటికి తమిళనాడులోని 10 జిల్లాలు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొనగా, దాదాపు 46 మంది దాకా చనిపోయిన విషయం తెలిసిందే.

'భారత్ బంద్' కేసులు ఉపసంహరించుకోకపోతే...

- మధ్యప్రదేశ్, రాజస్థాన్ కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఎస్పీ అల్టిమేటం

లక్నో : కాంగ్రెస్‌కు బీఎస్పీ అల్టిమెటం జారీ చేసింది. భారత్ బంద్ సందర్భంగా ఏప్రిల్‌లో దళితులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని.. లేదంటే రెండు రాష్ట్రాల్లో అధికార పార్టీకి మద్దతుపై పునరాలోచించుకోవాల్సి వస్తుందని హెచ్చరించింది. ఎస్సీ, ఎస్టీ చట్టంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఏప్రిల్ దేశవ్యాప్తంగా దళితులు బంద్‌తోపాటు, నిరసన కార్యక్రమాలకు దిగారు. ఈ సందర్భంగా ఘర్షణలు చెలరేగగా అనేక మంది దళితులపై రెండు రాష్ట్రాల్లో అప్పటి బీజేపీ ప్రభుత్వం కేసులు బనాయించింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో బీఎస్పీ మద్దతుతో కాంగ్రెస్ ఇటీవల అధికారాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. 'రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వం వెంటనే దళితులపై కేసులను ఎత్తివేయాలి. లేదంటే ప్రభుత్వానికి బయటి నుంచి ఇస్తున్న మద్దతుపై మేం పునరాలోచిస్తాం' అని బీఎస్పీ తెలిపింది.

విషాహారం తిని చిన్నారులకు అస్వస్థత

బెంగళూరు: బాలమందిరం సంరక్షణ కేంద్రంలో విషాహారం తిని పిల్లలు అస్వస్థకు గురయ్యారు. దీంతో వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన బెంగుళూరులో ఆదివారం చోటు చేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...బాలమందిరం సంరక్షణ కేంద్రంలో 103 మంది పిల్లలు ఉన్నారు. ఆదివారం రాత్రి భోజనం చేసిన తర్వాత ముగ్గురు పిల్లలు కడుపునొప్పిగా ఉందని వార్డెన్‌కు తెలిపారు. దీంతో ముగ్గురిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. విషాహారం తినడం వల్ల ఇలా జరిగిందని వైద్యులు తెలిపారు. దీంతో ముందు జాగ్రత్త చర్య కింద సంరక్షణ కేంద్రంలోని పిల్లలందరినీ ఆస్పత్రికి తరలించారు.

నేడు మహిళాహారం



కేరళలో 55 లక్షల మందితో 620 కిలోమీటర్లు

- రాజకీయ, సామాజిక సంఘాల నుంచి విశేష మద్దతు

తిరువనంతపురం: కేరళ మహిళలు మరో ప్రస్థానానికి నాంది పలుకనున్నారు. కొత్త సంవత్సరానికి హక్కుల పోరాటంతో స్వాగతం పలకనున్నారు. సామాజిక పొరల్లో అణువణువూ నిక్షిప్తమై వున్న నేటి పురాతన పితృస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, మహిళలకు సమానహక్కుల కోసం రాష్ట్రంలో మంగళవారం మహిళాహారాన్ని నిర్వహించనున్నారు. తిరువనంతపురంలోని కాసర్‌గఢ్ నుంచి వెల్లయంబలం వరకు దాదాపు 620 కిలో మీటర్ల మేర నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో 55 లక్షలమంది మహిళలు పాల్గొంటారని అంచనా. మంగళవారం 3.45 గంటల నుంచి 4.15 వరకూ జరిగే ఈ కార్యక్రమం జరుగనున్నది. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి కెకె శైలజ కాసర్‌గఢ్‌లో, సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ తిరువనంతపురంలో పాల్గొననున్నారు. మహిళలకు మద్దతుగా ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో పాటు మరికొందరు మంత్రులు కూడా ఇందులో పాల్గొననున్నారు. కాగా, కార్యక్రమానికి అవసరమయ్యే ఏర్పాట్లను ప్రభుత్వం ఇప్పటికే పూర్తి చేసింది. ర్యాలీకి సంబంధించి సీఎం సోమవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ర్యాలీలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా 25 వేల మంది పోలీసులను నియమించారు. మహిళా సందర్భంగా 'మహిళల పునరుజ్జీవన' (ఉమెన్ రినైసెన్స్)పై ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించనున్నట్టు రాష్ట్రమంత్రి కడకంపల్లి సురేంద్రన్ తెలిపారు. వివిధ కేంద్రాల్లో రాజకీయ, సాంస్కృతిక రంగానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా అనేక సామాజిక సంస్థల నుంచి విశేష మద్దతు లభిస్తున్నది. సామాజిక, రాజకీయ రంగాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 174 సంఘాలు మద్దతు ప్రకటించాయి. పలు స్వచ్ఛంద సంస్థలతో పాటు దాదాపు పదివేల మంది విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి కార్యక్రమంలో పాల్గొనే మహిళలకు సహకరిస్తామని ప్రకటించాయి. శబరిమలలో అన్ని వయస్కుల మహిళలను అనుమతించాలని గతేడాది సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. తీర్పును వ్యతిరేకిస్తూ బీజేపీ, పలు హిందూత్వ సంఘాలు కలిసి మహిళలను శబరిమలకు రాకుండా అడ్డుకుంటున్నాయి. ఈ నిరసనలకు కాంగ్రెస్‌కూడా వత్తాసుపలికింది. ఈ నేపథ్యంలో మహిళలకు సమానత్వ హక్కులు కల్పించడమే గాక, వారిని అందకారంలో పడవేసే చర్యలకు వ్యతిరేకంగా మానవహారం చేపట్టాలని కేరళ ప్రభుత్వం గత నెలలో ఈ నిర్ణయం తీసుకుంది. 30 లక్షల మంది మహిళలతో కలిసి 2019, జనవరి 1న మానవహారం నిర్వహిస్తామని ముఖ్యమంత్రి పినరయి విజయన్ గతంలో ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని బీజేపీతో పాటు పలు సంఘాలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో మానవహారానికి ప్రత్యేకత సంతరించుకుంది. చారిత్రాత్మక ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా ప్రసారం చేయడానికి జాతీయ, అంతర్జాతీయ మీడియా కేరళకు చేరుకున్నది.

రాజ్యసభ రబ్బరు స్టాంపు కాదు

ట్రిపుల్ తలాక్ బిల్లుపై ఏకమైన ప్రతిపక్షాలు

- సెలెక్ట్ కమిటీకి పంపించాల్సిందేనని డిమాండ్
- ఓటింగ్ జరపాలని 11 పార్టీల తీర్మానం
- ఒప్పుకోని సర్కారు... వాయిదా పడిన సభ

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

పెద్దల సభలో ప్రతిపక్షాలు ఒక్కటయ్యాయి. ట్రిపుల్ తలాక్ బిల్లుపై పాలక పార్టీ కుటిల రాజకీయం చేస్తున్నదని మండిపడ్డాయి. రాజ్యసభ అంటే రబ్బరు స్టాంపు కాదని ముక్తకంఠంతో నినదించాయి. లోక్‌సభలో ఆమోదం పొందిన ట్రిపుల్ తలాక్ బిల్లును మోడీ సర్కార్ సోమవారం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. బిల్లును చట్టబద్ధంగా పరీక్షించకుండా సమ్మతించలేమని... లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందినంత మాత్రాన ఇక్కడ ఆమోదించలేమని కాంగ్రెస్ పక్ష ఉపనేత ఆనంద్ శర్మ తెలిపారు. అయితే, బిల్లును ఎవరూ వ్యతిరేకించటం లేదని, ముమ్మారు తలాక్ సున్నితమైన అంశం అయినందున లోతుగా అధ్యయనం చేయాల్సి ఉన్నదని ఆయన సూచించారు. బిల్లుపై ప్రభుత్వం రాజకీయం చేయడం ఏంటని నిలదీశారు.

సర్కారు వైఖరితో సభలో గందరగోళం

ట్రిపుల్ తలాక్ బిల్లుపై చర్చ సందర్భంగా ప్రభుత్వ వైఖరి రాజ్యసభలో గందరగోళానికి దారితీసింది. సోమవారం రాజ్యసభ ప్రారంభం కాగానే ఆందోళనలు మొదలయ్యాయి. బిల్లుపై ప్రతిపక్షాలు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశాయి. ట్రిపుల్ తలాక్‌పై విస్తృత చర్చ అవసరమని, బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని పట్టుబట్టాయి. అందుకు కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోకపోవడంతో బీజేపీ, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తమ డిమాండ్‌కు ప్రభుత్వం ఒప్పుకోవాలని 14 ప్రతిపక్ష పార్టీలు సభలో ఆందోళన చేపట్టాయి. ప్రస్తుత బిల్లును అనుమతించేందుకు సీపీఐ(ఎం),కాంగ్రెస్, టీఎంసీ, బీజేడీ, ఎస్పీ, ఎన్సీపీ, బీఎస్పీ, సీపీఐ, అన్నాడీఎంకే, డీఎంకే, టీడీపీ, వైసీపీ, ఆప్, ఆర్జేడి తదితర పార్టీలు నిరాకరించాయి. బిల్లును పార్లమెంటరీ కమిటీకి పంపించాల్సిందిగా ఆయా పార్టీల నేతలు డిమాండ్ చేశారు. సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లి పెద్ద ఎత్తున నినాదాలతో హోరెత్తించారు."వి వాంట్ జస్టిస్" అంటూ బిగ్గరగా నినాదాలు చేయడంతో ఎవరి మాట ఎవరికీ అర్థంకాని పరిస్థితి నెలకొంది. దీంతో సభా కార్యకలాపాలు పట్టుమని పావుగంట కూడా నడవలేదు. రాజ్యసభను మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేస్తున్నట్టు డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ నారాయణ సింగ్ ప్రకటించారు. అనంతరం ప్రారంభమైన సభలో అన్నాడీఎంకే సభ్యులు తమ ఆందోళన కొనసాగించారు. దీంతో పలుమార్లు సభ వాయిదా పడింది. ఈ సమయంలో అధికార, ప్రతిపక్ష సభ్యులతో డిప్యూటీ ఛైర్మన్ చర్చలు జరిపారు. అయినా లాభం లేకుండా పోయింది. వరుస వాయిదాల అనంతరం రాజ్యసభను బుధవారానికి వాయిదా వేసినట్టు డిప్యూటీ స్పీకర్ ప్రకటించారు. కాగా, "ఇది చాలా ప్రాముఖ్యమైన బిల్లు. కొన్ని కోట్ల మంది ప్రజల జీవితాలపై ఈ బిల్లు అనుకూల...ప్రతికూల ప్రభావం చూపుతోంది. అటువంటి ముఖ్యమైన బిల్లును సెలెక్ట్ కమిటీ పరిశీలించకుండా ఆమోదింపజేయాలని చూడటం తగదు" అని కాంగ్రెస్ నేత గులాం నబీ ఆజాద్ అభిప్రాయపడ్డారు.



తలాక్ బిల్లుపై ప్రతిపక్షాల తీర్మానం

పార్లమెంట్ ప్రారంభం కాకమునుపే కాంగ్రెస్ నేత గులాం నబీ ఆజాద్ కార్యాలయంలో ప్రతిపక్షాలు సమావేశం అయ్యాయి. తలాక్‌ను అడ్డుకుంటామని, బిల్లును పార్లమెంట్ సెలక్ట్ కమిటీకి పంపే విధంగా సర్కారుపై ఒత్తిడి తేవాలని నిర్ణయించాయి. ఈ నేపథ్యంలో సంబంధిత తీర్మానంపై 11 పార్టీలు సంతకం చేశాయి. చర్చకు ముందు తీర్మానంపై ఓటింగ్ జరగాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఆ మత అల్లర్లపై నివేదికల్లేవు

సీఐసీకి కేంద్రం నిర్లక్ష్యపు సమాధానం

న్యూఢిల్లీ: దేశంలోని మత అల్లర్లపై సమాచారహక్కు చట్టం కింద దాఖలైన ఓ ప్రశ్నకు కేంద్రం బాధ్యతారాహిత్యమైన సమాధానమిచ్చింది. దీంతో కేంద్రం తీరుపై కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశంలో 1961-2003 మధ్య జరిగిన 13 మత అల్లర్లపై దర్యాప్తు నివేదికల వివరాలు కోరుతూ అంజలీ భరద్వాజ్ ఆర్‌టీఐ కింద దరఖాస్తు దాఖలు చేసింది. అయితే దీనికి స్పందించిన కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఆ 13 దర్యాప్తు నివేదికల వివరాలు తమవద్ద లేవని పిటిషన్ విచారణ సందర్భంగా తెలిపింది. కేంద్రం స్పందనపై సమాచార కమిషనర్ బిమాల్ జుల్కా ఆగ్రహం వ్యక్తం చేశారు. నివేదికలు ఎందుకు అందుబాటులో లేవని ప్రశ్నించారు. హోంమంత్రిత్వశాఖ.. సమాచారాన్ని అందించడం లేదా సంబంధిత కార్యాలయానికి పిటిషన్‌ను బదిలీ చేయాలని బిమాల్ అన్నారు. హోంమంత్రిత్వశాఖ తీరు ఆమోదయోగ్యంగా లేదన్నారు. ఆ 13 నివేదికల స్థితిగతులను పరిశీలించడానికి ఒక సీనియర్ అధికారిని నియమించాలని కేంద్ర హోంశాక సెక్రెటరీ రాజీవ్ గౌబాను సీఐసీ ఆదేశించింది. దీనిపై హోంశాఖ 15 రోజుల్లో సమగ్ర నివేదికను తప్పక అందించాల్సి ఉంటుంది.

'మరణించిన ఏడాదికి నిర్దోషిగా..'

నాసిక్: దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నకిలీ స్టాంపు పేపర్ల కేసులో ప్రధాన నిందితుడు అబ్దుల్ కరీం తెల్గీతో పాటు మరో ఏడుగురు నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ నాసిక్ సెషన్ కోర్టు తీర్పు వెల్లడించింది. ఈ కేసులో తెల్గీతో సహా మరికొందరిపై నాసిక్ కోర్టులో సీబీఐ2004లో చార్జ్‌షీట్ దాఖలు చేసింది. తెల్గీకి 30 ఏండ్ల జైలు శిక్షను కోర్టు విధించింది. కాగా జైలు శిక్షను అనుభవిస్తున్న తెల్గీ అనారోగ్యంతో బెంగుళూరులోని ఒక ఆస్పత్రిలో చేరాడు. అక్కడ చికిత్స పొందుతూ గతేడాది అక్టోబర్‌లో మరణించిన విషయం తెలిసిందే. ఈ కేసులో సుమారు 50 మంది వాంగ్మూలాలను కోర్టు విన్నది. బలమైన సాక్ష్యాధారాలు లేకపోవడం వల్ల నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ నాసిక్ ఫస్ట్‌క్లాస్ జడ్జి పీఆర్ దేశ్ ముఖ్ తీర్పునిచ్చారు.

ముస్లింలలో భయం.. భయం..

ఘటనతో సంబంధం లేని వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు

- బులంద్‌షహర్ ఘటనపై ఎన్‌సీహెచ్ఆర్‌వో నివేదిక



లక్నో: ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల సంచలనం సృష్టించిన బులంద్‌షహర్ ఘటన ముస్లింలలో భయాన్ని పెంచేలా ఉందంటూ జాతీయ మానవ హక్కుల సమాఖ్య సంఘం (ఎన్‌సీహెచ్ఆర్‌వో) ఆందోళన వ్యక్తం చేసింది. ఇది జాతీయ మానవ హక్కుల సంస్థకు అనుబంధ సంస్థగా పనిచేస్తోంది. కాగా, ఈ ఘటనను 'ప్రణాళిక ప్రకారం చేసిన కుట్ర' (ప్లాన్డ్ ఇన్సిడెంట్)గా అభివర్ణించింది. లక్నోలో ఈ సంస్థ మీడియా సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఎన్‌సీహెచ్ఆర్‌వో నిజ నిర్ధారణ కమిటీ సభ్యుడు మన్‌జీత్ సింగ్ మాట్లాడుతూ.. శాంతియుతంగా ఉన్న బులంద్‌షహర్‌లో డిసెంబర్ 3 నాటి హింస ఇక్కడి ముస్లింలలో భయాన్ని పెంచేలా ఉందని తెలిపారు. చిన్న గొడవగా ప్రారంభమై.. తదనంతరం హింసకు దారి తీసినందుకు బీజేపీ యువమోర్చా, మరికొన్ని హిందూ అతివాద సంఘాల సభ్యులే కారణమని అన్నారు. బులంద్‌షహర్‌కు సమీపాన ఉన్న మహా గ్రామంలో గోహత్యలు ఏమీ జరగకపోయినా ఉద్దేశపూర్వకంగానే ఇక్కడ మూకదాడి జరిగిందని చెప్పారు. ఘర్షణల అనంతరం పోలీసులు ఇద్దరు యువకులను అనుమానితులుగా భావిస్తూ వారిని అరెస్టు చేశారు. కానీ, హింసకు ప్రధాన కారకుడిగా భావిస్తున్న భజరంగ్ దళ్ సభ్యుడు యోగేశ్ రాజ్ మాత్రం యథేచ్ఛగా బయట తిరుగుతున్నాడు. దీనిపై మన్‌జీత్ మాట్లాడుతూ.. నిందితులను కాపాడటంలో రాజకీయ నాయకుల హస్తం ఉన్నదని ఆరోపించారు.

ఈ తరహా హింసాత్మక ఘటనలను అరికట్టడానికి ప్రత్యేకమైన చట్టం రూపొందించాలని ఎన్‌సీహెచ్ఆర్‌వో కేంద్రాన్ని కోరింది. మూకదాడులకు పాల్పడుతున్న ఇలాంటి సంస్థలపై నిషేధం విధించాలని డిమాండ్ చేసింది. దీనిపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నిత్యం సమీక్షలు జరిపి దేశంలో ఈ తరహా ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. కాగా, ఈ ఘటనతో సంబంధం లేనివారిని కూడా పోలీసులు అరెస్టు చేస్తున్నారని మరో సభ్యుడు అన్సర్ ఇండోరి అన్నారు. బులంద్‌షహర్‌కు సమీపంలో ఉన్న నయాబన్‌లో మసీదుల కమిటీ అధ్యక్షుడిగా ఉన్న సర్ఫుద్దీన్‌ను ఏ తప్పు చేయకున్నా పోలీసులు అరెస్టు చేశారని అన్నారు. సర్ఫుద్దీన్‌తో పాటు మరో ఏడుగురిపైనా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. గతనెల 3న జరిగిన ఈ హింసలో సుభోద్ కుమార్ అనే పోలీసుతో పాటు మరో యువకుడు మరణించిన సంగతి తెలిసిందే.

కలెక్టర్ కాళ్లపై పడ్డ రైతన్న

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం..

- కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకోని అధికారులు



భోపాల్: 'దేశానికి వెన్నెముక వ్యవసాయమే' అని ప్రసంగాలు చెప్పే నేతలు.. సాగు చేసే రైతులకు సమస్యలు ఎదురైతే మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో, చేసేదేమీ లేక తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలీక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తన పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేయాలని ఆరు నెలలుగా ప్రభుత్వాధికారులను కోరుతున్నా వాళు పట్టించుకోకపోవడంతో.. కలెక్టర్ కాళ్లపై పడి తన సమస్యను తీర్చాలని గోడు వెల్లబోసుకున్నాడో రైతన్న. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లో మూడు రోజుల క్రితం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. శివపురి జిల్లా రనౌద్ గ్రామానికి చెందిన రైతు అజిత్, తన పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయాలని గత ఆరునెలలుగా ప్రభుత్వాధికారుల వెంట తిరుగుతున్నాడు.

దీనికోసం రూ. 40 వేలు కూడా చెల్లించాడు. కానీ, అధికారులు మాత్రం ఆ రైతును పట్టించుకోలేదు. దీంతో, ఈ నెల 28న జిల్లాకు నూతనంగా నియమితురాలైన కలెక్టర్ అనురాగ్ దగ్గరికి వెళ్లి ఆమె కాళ్లపై పడ్డాడు. కానీ, ఆమె మాత్రం దీనిని పట్టించుకోకుండా కారులో వెళ్లి కూర్చున్నారు. కానీ, రైతు కన్నీటి పర్యంతం అవ్వడం చూసి చలించిన కలెక్టర్.. ఆ రైతును పిలిపించుకుని సమస్యపై ఆరా తీశారు. ట్రాన్స్‌పార్మర్ లేకపోవడంతో తన పంట ఎండిపోతోందని.. చేతికొచ్చే దశలో పంటంతా నాశనమవుతుందని రైతు తెలిపాడు. తాను అధికారులతో మాట్లాడతానని కలెక్టర్ ఆ రైతుకు హామీ ఇచ్చారు. దీనికి సంబంధించిన వీడియో ఒకటి సోషల్‌మీడియాలో వైరలవ్వడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. కలెక్టర్ హామీ ఇచ్చినట్టుగానే రెండు రోజుల తర్వాత ఆ రైతు పొలంలో అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేశారు. మధ్యప్రదేశ్‌లో పదిహేనేండ్ల బీజేపీ పాలన తర్వాత ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి కమల్‌నాథ్ రైతు రుణమాఫీ ఫైల్ మీద తొలిసంతకం చేసినా.. రైతుల ఆత్మహత్యలు మాత్రం ఆగడం లేదు.

రైతులకు ఎన్నికల తాయిలాలు !

'నెలవారీ నగదు' పథకానికి కేంద్రం సన్నాహాలు

న్యూఢిల్లీ : వచ్చే ఏడాది జరగనున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రధాని మోడీ రైతులకు నెలవారీ నగదు' పథకంపై అధ్యయనం చేస్తున్నట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. వ్యవసాయ సంక్షోభానికి కొంతమేరకు ఉపశమనం కలిగించి రైతాంగ మద్దతును కూడగట్టే యత్నాల్లో భాగంగా కేంద్రప్రభుత్వం రైతులకు ప్రయోజనం కలిగించే మూడు అంశాలపై అధ్యయనం చేస్తున్నట్టు ఆ వర్గాలు తెలిపాయి. రైతులకు నెలసరి ఆదాయ పథకంతో పాటు వాస్తవ విక్రయధరకు, ప్రభుత్వం ప్రకటించిన సేకరణ ధరకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని నగదు రూపంలో ఇవ్వడం, పంట బీమా పథకాన్ని పునరుద్ధరించడం అనే మూడు అంశాలపై మోడీ ప్రభుత్వం అధ్యయనం చేస్తోందని సంబంధిత అధికారులు వెల్లడించారు. ఈ మూడు అంశాలను కలిపి ఒక పథకంగా తీసుకు రావడమా లేక వీటిల్లో ఒకదానిని అమలు చేయడమా అనేది ఖరారు కావలసి ఉన్నదని వారు తెలిపారు. ఇటీవల కొన్ని రాష్ట్రాలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ ఓడి పోవడంతో, రానున్న సాధారణ ఎన్నికలకు ముందుగానే దిద్దుబాటు చర్యలు చేపట్టి రైతులను తమ పక్షాన తిప్పుకునేందుకు మోడీ ప్రభుత్వం సిద్ధమయ్యింది. అందులో భాగంగానే రైతులకు నగదు పథకానికి రూపకల్పన చేసింది. కొంత మొత్తాన్ని రైతుల ఆదాయానికి మద్దతుగా నెలవారీ చెల్లించే పథకాన్ని చేపట్టనున్నది. దీనివల్ల 150 మిలియన్ రైతు కుటుంబాలు లబ్ది పొందుతాయని అంచనా.

నాగాలాండ్‌లో మరో ఆరు నెలలు

ఏఎఫ్ఎస్‌పీఏ పొడిగింపు

న్యూఢిల్లీ : యావత్తు నాగాలాండ్‌ను కల్లోలిత ప్రాంతంగా ప్రకటిస్తూ, ఆ రాష్ట్రంలో సైనిక దళాలకు విశేష అధికారాలు కల్పించే ప్రత్యేక చట్టాన్ని (ఎఎఫ్ఎస్‌పీఎ) మరో ఆరు నెలలు పొడిగించారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది.

డిసెంబరు 30 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తోందని తెలిపింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తన నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఎఎఫ్ఎస్‌పీఏతో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఎవ్వరినైనా అరెస్టు చేసే అధికారం సైన్యానికి ఉంటున్నదన్న సంగతి తెలిసిందే. నాగాలాండ్‌లో కొన్ని దశాబ్దాల నుంచి ఎఎఫ్ఎస్‌పిఎ అమల్లో ఉంది. కనీసం 2015 ఆగష్టు 3న ప్రధాని మోడీ సమక్షంలో నాగాలాండ్ ప్రభుత్వం-నాగాలాండ్ తిరుగుబాటుదారులకు మధ్య జరిగిన ఒప్పందం తరువాత కూడా ఎఎఫ్ఎస్‌పిఎను ఉపసంహరించుకోలేదు.

ఉచిత విద్యకు ఫిబ్రవరి 19న చలో పార్లమెంట్

విద్యా కమిషన్‌ను నియమించాలి : ఎస్‌టీఎఫ్‌ఐ నేత సీ.ఎన్.భార్తి

- ఉత్సాహంగా కొనసాగుతున్న రాష్ట్ర యూటీఎఫ్ మహాసభలు
- నేడు ముగింపు సభ, నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-ఖమ్మంప్రతినిధి

దేశంలోని పిల్లలందరికీ ఉచిత, నాణ్యమైన సమాన విద్య కోసం దేశవ్యాప్తంగా అన్ని స్థాయిల్లో విద్యారంగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయ, అధ్యాపక, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19న ఢిల్లీలో మహా ప్రదర్శన, చలో పార్లమెంట్ నిర్వహించనున్నామని జాతీయ పాఠశాలల ఉపాధ్యాయ సమాఖ్య (ఎస్‌టీఎఫ్‌ఐ) ప్రధాన కార్యదర్శి సీ.ఎన్.భార్తి తెలిపారు. టీఎస్‌యూటీఎఫ్ తృతీయ రాష్ట్ర మహాసభల సందర్భంగా రెండో రోజైన సోమవారం ఖమ్మం నగరంలోని వీ.ఎల్.నర్సింహారావు ప్రాంగణం (రాజ్‌పథ్ ఫంక్షన్‌హాలు)లో నిర్వహించిన ప్రతినిధుల సభలో ఆయన ప్రసంగించారు. విద్యారంగంపై వివిధ కమిషన్లు చేసిన ప్రతిపాదనలు డెబ్బై ఏండ్లు గడిచినా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీడీపీలో కనీసం 6శాతం విద్యారంగానికి కేటాయించాలన్న ప్రతిపాదన ఉండగా కనీసం ఒక శాతం కూడా మించడం లేదన్నారు. మరోవైపు విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రయివేటు విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తూ ప్రోత్సహిస్తోందన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో అన్ని పార్టీలు తమ తమ ఎజెండాల్లో ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ర్యాలీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉచిత విద్యాహక్కు చట్టాన్ని కేజీ టు పీజీ వరకు విస్తరింపచేయాలనీ, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలనీ, జీడీపీలో విద్యారంగానికి పది శాతం నిధులు కేటాయించాలనీ, శాస్త్రీయ-రాజ్యాంగ విలువలతో కూడిన నూతన విద్యా పాలసీని ప్రకటించాలనీ, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలనీ, విద్యారంగంలో కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలనీ తదితర డిమాండ్లతో నిర్వహిస్తున్న చలో పార్లమెంటు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. అందులో భాగంగా జనవరిలో అన్ని రాష్ట్రాల్లో సదస్సులు-ప్రదర్శనలు నిర్వహించాలని కోరారు. మోడీ ప్రజావ్యతిరేక విధానాల వల్ల సార్వత్రిక సమ్మెలో పాల్గొనే వారి సంఖ్య 2014 తర్వాత ప్రతీయేటా పెరుగుతోందన్నారు. 'సేవ్ ఎడ్యుకేషన్-సేవ్ క్యాంపస్-సేవ్ నేషన్' నినాదంతో ప్రతీ ఒక్కరూ ముందుకు కదలాలని పిలుపునిచ్చారు.

టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొండల్‌రెడ్డి మాట్లాడుతూ ఐక్య ఉద్యమాలతోనే ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రయివేటీకరణ విధానాల వల్ల ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యమవుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు మంజూరు చేయాల్సిన నిధుల్లో కోత విధించారన్నారు. రాష్ట్రంలో టీఎస్‌యూటీఎఫ్-టీపీటీఎఫ్-డీటీఎఫ్ చొరవ వల్లే ఉమ్మడి పోరాట వేదికలు నిర్మితమయ్యాయనీ, ఈ వేదికల్ని బలోపేతం చేసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేద్దామనీ కోరారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.రాములు మాట్లాడుతూ గడిచిన రెండేండ్లలో ఐక్య ఉద్యమాల ద్వారా విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి టీఎస్‌యూటీఎఫ్ పోరాటాలు నిర్వహించిందనీ, భవిష్యత్‌లోనూ ఈ పోరాటాల్ని ఉధృతం చేయనున్నామనీ తెలిపారు. అనంతరం పలు తీర్మానాలను ప్రతిపాదించగా ప్రతినిధులు చర్చించి ఆమోదించారు.

విద్యారంగ తీర్మానాలు

- గురుకులాలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి.
- ఎయిడెడ్ విద్యా సంస్థలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి.
- అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మంచినీరు, టాయిలెట్ల సౌకర్యం కల్పించాలి. స్వీపర్, అటెండర్, వాచ్‌మెన్ పోస్టులు మంజూరు చేయాలి.
- మధ్యాహ్న భోజన పథకాన్ని మెరుగుపరచాలి. విద్యార్థికి రూ.15 చొప్పున కేటాయించాలి. సిబ్బంది వేతనం నెలకు రూ. 5వేల చొప్పున చెల్లించాలి.
- విద్యార్థుల సంఖ్య ప్రకారం పాఠశాలలకు నిధులు మంజూరు చేయాలి.
- ఉపాధ్యాయ నియామకాల కోసం మరో నోటిఫికేషన్ విడుదల చేయాలి.

సర్వీసు సమస్యలపై తీర్మానాలు

- ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్‌ను రూపొందించి, ప్రమోషన్లు కల్పించాలి. పర్యవేక్షణా వ్యవస్థను పటిష్టం చేయాలి.
- పండిట్, పీఈటీ అప్‌గ్రేడ్ పోస్టులకు పదోన్నతులు ఇవ్వాలి.
- స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి.
- ఎయిడెడ్ చట్టం 37/2005 ప్రకారం హైకోర్టు తీర్పును అమలు చేయాలి
- గిరిజన, సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి
- కేజీబీవీ టీచర్లను రెగ్యులరైజ్ చేయాలి.
- మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి
- మహిళా ఉపాధ్యాయులకు రెండు సంవత్సరాలు చైల్డ్‌కేర్ లీవులు మంజూరు చేయాలి.

వాటితో పాటు ప్రతినిధుల సభ 35 రకాల తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. రాబోయే రెండేండ్ల కాలంలో పై డిమాండ్ల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించి, అమలు చేస్తామని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్. రాములు, చావా రవి ప్రకటించారు.

నేడు మహాసభల ముగింపు..

ఖమ్మంలో మూడ్రోజులుగా జరుగుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు నేటితో ముగియనున్నాయి. మంగళవారం ఉదయం 9 గంటలకు ప్రతినిధుల సభ, మధ్యాహ్నం 2గంటలకు రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక జరగనుంది. టీఎస్‌యూటీఎఫ్ సీనియర్ నాయకులు ఎంఏకే దత్ ఎన్నికల నిర్వహణాధికారిగా వ్యవహరించనున్నారు. సాయంత్రం 4గంటలకు ముగింపు సమావేశం ఉంటుందని యూటీఎఫ్ నేతలు తెలిపారు.

పంతంగి టోల్‌గేట్ వద్ద దౌర్జన్యం

తాటిచెట్లను కూల్చేసిన జీఎమ్ఆర్

- రోడ్డున పడ్డ 20 గీత కార్మిక కుటుంబాలు
- రైతులకు నోటీసులు ఇవ్వకుండానే చకచకా పనులు
- సంక్రాంతి దాకా ఆపుతామన్న అధికారుల హామీ బుట్టదాఖలు

పార్ట్ 2


ఫైల్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నోటీసులు ఇవ్వకుండా...రైతులకు, గీతకార్మికులకు సమాచారం లేకుండా పంతంగి టోల్‌గేట్ వద్ద జీఎమ్ఆర్ సంస్థ తాటిచెట్లను కూల్చేసింది. 20 గీతకార్మిక కుటుంబాల పొట్టగొట్టింది. బాధిత రైతులు, గీతకార్మికులు కలెక్టర్, ఆర్డీఓ, అబ్కారీ శాఖలకు వినతు లివ్వగా..సంక్రాంతి పండగ దాకా జీఎమ్ఆర్ సంస్థ చెట్లను కూల్చకుండా, పనులు చేపట్టకుండా అడ్డుకుంటామని హామీనిచ్చింది. అయితే, అధికారుల హామీ నేడు బుట్టదాఖలైంది. రైతులకు ఎలాంటి నోటీసులు లేకుండా చకచకా పనులు జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం చోద్యంగా చూస్తున్నారు.

జీఎమ్ఆర్ సంస్థ పంతంగి టోల్‌గేట్ వద్ద అదనపు అవసరాల పేరిట 554, 611 సర్వేనెంబర్లలోని 11 మంది రైతుల నుంచి అక్రమంగా ఆరు ఎకరాలను లాక్కున్నది. ఈ భూమి తీసుకున్నట్టు సర్కారు నుంచి ఎలాంటి నోటీసులు కూడా సంబంధిత రైతులకు అందలేదు. ఇంకా ఆ భూములు రైతుల పేరిటనే ఉన్నాయి. వాళ్లకు రైతుబంధు చెక్కులు కూడా వచ్చినట్టు రికార్డుల్లో ఉన్నాయి. రైతులకు చెందిన ఆ భూముల్లో జీఎమ్ఆర్ సంస్థ యథేచ్ఛగా పనులను కొనసాగిస్తున్నది. ప్రశ్నిస్తున్న రైతులను పోలీసుల చేత బెదిరిస్తున్నది. తాజాగా, 544, 611 సర్వే నెంబర్లలోని 20కిపైగా తాటిచెట్లను ఐదారు జేసీబీలను పెట్టించి కూల్చేసింది. రైతులు, గీతకార్మికులు అక్కడకు వెళ్లే సరికి చెట్లన్నీ నేలకూలాయి. ఇదేంటి? చెట్లు కూల్చే అధికారం మీకు ఎక్కడిది? ఇదేం అన్యాయం? అని రైతులు ప్రశ్నించగా 'కలెక్టర్ నుంచి అను మతి తెచ్చుకున్నాం. దిక్కున్నచోట చెప్పుకోండి' అని జీఎంఆర్ టోల్‌గేట్ సిబ్బంది బెదిరిస్తున్న పరిస్థితి అక్కడ నెలకొంది. వాస్తవానికి ఆ భూములు మావని, అక్కడ పనులు చేపట్టవద్దని పలుమార్లు కలెక్టర్, ఆబ్కారీ, రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. కొద్దిరోజుల కింద చెట్లను కూల్చేందుకు టోల్‌గేట్ సిబ్బంది యత్నించగా రైతులు, గీతకార్మికులు అడ్డుకున్నారు. దీంతో తాత్కాలికంగా కూల్చివేత పనులు ఆగాయి. దీనిపై ప్రత్యేకంగా ఆబ్కారీ అధికారులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా...సంక్రాంతి వరకు అక్కడ తాటిచెట్లను కూల్చకుండా చూస్తామని హామీనిచ్చారు. ఆ తర్వాత ఏమైందో ఏమోగానీ జీఎమ్ఆర్‌కు చెందిన టోల్‌గేట్ సిబ్బంది ఉన్నఫలంగా రైతులు, గీతకార్మికులు లేని సమయంలో జేసీబీలతో కూల్చివేశారు. దీంతో ఆ చెట్లపై ఆధారపడి జీవిస్తున్న 20 మంది దాకా గీతకార్మికులకు ఉపాధి కరువైంది. జీఎమ్ఆర్ దాష్టీకాన్ని అధికారులకు ఫిర్యాదు చేయగా పెద్దగా స్పందన కన్పించలేదు. రైతులకు నోటీసులు ఇవ్వకుండా భూములను లాక్కున్నవైనంపై నవతెలంగాణలో ప్రచురితమైంది. పనులు జరుగుతున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. జీఎమ్ఆర్ సిబ్బంది బెదిరిస్తూ పనులు చేస్తున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

అంతా ఒక్కటై ఆడుకుంటున్నరు : బాతరాజు శంకర్, బాధిత రైతు



పోలీసులు, అధికారులు, జీఎమ్ఆర్ సంస్థ వాళ్లు అంతా ఒక్కటై రైతులతో ఆడుకుంటున్నారు. అవసరమంటే 16 ఎకరాలు ఇచ్చాం. మళ్లీ ఆరెకరాలు ఎందుకో అర్థం కావట్లేదు. తాటిచెట్ల కూల్చివేతపైన మాకు కనీస సమాచారం లేదు. దొంగలుపడ్డట్టు ఎవ్వరూ లేని సమయంలో కూల్చేశారు. ఇదేం అన్యాయం. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఉన్న ఎకరంలోకి కూడా పోకుండా ఫెన్సింగ్ వేయించారు. ఉన్న భూమిని కూడా గుంజుకునే కుట్ర జరుగుతున్నది. మాకు జరుగుతున్న అన్యాయంపై ముఖ్యమంత్రికి కూడా ఫిర్యాదు చేస్తాం.

ములుగులో గిరిజన యూనివర్సిటీకి కసరత్తు



నవతెలంగాణ-వరంగల్

జయశంకర్‌జిల్లా ములుగులో గిరిజన యూనివర్శిటీ ఏర్పాటు కోసం కసరత్తు ముమ్మరం అవుతున్నది. అందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ కార్యదర్శి రెడ్డి సుబ్రమణ్యం, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఉపకులపతి అప్పారావు, కేంద్ర ప్రజా పనుల విభాగం చీఫ్ ఇంజనీర్ సాంబశివరావు, రాష్ట్ర గిరిజన అభివృద్ధి శాఖ కమిషనర్ క్రిష్టిన చొంగ్తు సోమవారం వరంగల్ ఆర్ఈసీ అతిథి గృహానికి వచ్చి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారిని మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి కలిశారు. కేంద్ర గిరిజన యూనివర్సిటీ దేశంలో ఇతర రాష్ట్రాల్లో నెలకొల్పిన యూనివర్సిటీలకు దీటుగా ఏర్పాటు చేయాలని సూచించారు. గిరిజన ప్రాంత, గిరిజన యువత అభివృద్ధికి ఉపయోగపడేలా ఉపాధికి మార్గం చూపి ప్రత్యేక కోర్సులు మంజూరు చేయాలని కోరారు. యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రతిపాదించిన 500 ఎకరాల్లో ఇప్పటికే 170 ఎకరాలు ఐటీడీఏకు అప్పగించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె.పాటిల్, రూర ల్ జిల్లా కలెక్టర్ హరిత, ఎన్ఐటీ డైరెక్టర్ రమణారావు, ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ చక్రధర్‌రావు, డీటీడీఓ పోచన్న పాల్గొన్నారు.

బీసీలకు పెద్దపీట వేస్తాం

టీఆర్ఎస్ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

రానున్న రోజుల్లో బీసీలకు పెద్దపీట వేస్తామని... ప్రస్తుతం న్యాయస్థానం ఆదేశం మేరకే తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పంచాయతీ ఎన్నికలకు నిర్వహించేందుకు సమాయత్తమయ్యారని ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ చెప్పారు. బీసీలకు టీఆర్ఎస్ అన్యాయం చేసిందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి వ్యాఖ్యానించడం సరికాదన్నారు. సోమవారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. ఉత్తమ్‌కుమార్ రెడ్డి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. బీసీలకు కేసీఆర్ మొదటి నుంచి పెద్దపీట వేస్తున్నారని గుర్తు చేశారు. బడుగు బలహీనవర్గాలకు ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామని వెల్లడించారు. గొల్ల కురుమలకు సబ్సిడీతో గొర్రెలు పంపిణీ చేశామన్నారు. గీత, నేత కార్మికులకు కూడా టీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా కేసీఆర్‌కు ప్రజలు నీరాజనం పలికారని చెప్పారు. అందువల్లే చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకున్నదన్నారు. తెలంగాణ 2019 లోక్‌సభ ఎన్నికల్లో తెరాస 16 స్థానాలను గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ గత పదేండ్ల కాలంలో బీసీలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపణలు మాని, ఇప్పటికైనా ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు.

నీలో నువ్వు ప్రశాంతతను కలిగి ఉండలేకపోతే మరెక్కడా దానిని పొందలేవు. - చె గువేరా


సంపాదకీయం

వెండితెర సూరీడు..

భారతీయులకు తన అపురూప కళాఖండాలనే గాక ఈ కొత్త సంవత్సరాన్ని కూడా కానుకగా ఇచ్చి పాత సంవత్సరంతోపాటే వెళ్లిపోయారు మృణాల్‌సేన్. తొమ్మిది పదులు దాటిన ఈ సృజనకారుడు తన ఐదు పదుల సినీ ప్రస్థానంలో అందించిన సినిమాలు కేవలం రెండు పదులకు పైనే కావొచ్చు.. అయితేనేం ప్రపంచ చిత్ర యవనికపై భారతీయ సినిమాకు చిరునామాగా నిలిచాడు. సినీ వినీలాకాశంలో భారత పతాకమై ఎగిసాడు. సినిమాను కెమెరా కన్నుతో కాకుండా మార్క్సిస్టు జ్ఞాన నేత్రంతో సృజించిన దార్శనికుడాయన. ఇండియన్ సినిమా దశ దిశ నిర్దేశించిన అగ్రశ్రేణి దిగ్గజాల్లో ఒకరైన మృణాల్‌సేన్... బెంగాల్ చిత్రసీమకే కాదు, భారతీయ సినీపరిశ్రమకే ఒక విశ్వవిద్యాలయం.

పాలకవర్గాల దుర్నీతిని వెండితెరపై ఎండగట్టడమే కాదు పీడిత తాడిత ప్రజల గుండె చప్పుడూ వినిపించిన సామ్యవాద స్వాప్నికుడు మృణాల్‌సేన్. వెండితెరపై అరుణోదయాల్ని ఆవిష్కరించిన అవిశ్రాంత యోధుడు. సంవత్సరాంతంలో ఆయన అస్తమయం విషాదమే అయినా, ఆయన అజేయ స్ఫూర్తితో కొత్త సంవత్సరాన్ని ఆరంభిద్దాం.

నాటి అవిభాజ్య భారత్‌లోని ఫరిదాపూర్‌లో 1923 మే 14న జన్మించిన మృణాల్‌సేన్ ఉన్నత చదువుల కోసం కలకత్తాకు చేరుకొంది మొదలు అదే ఆయన కార్యక్షేత్రమైంది. ఆ నగరంతో ఆయనది ఎంతగా పెనవేసుకున్న బంధమంటే... ఆ గాలి పీల్చకుండా, ఆ ధూళి తాకకుండా గడపటమంటే ఆయనకు క్షణమొక యుగంగా ఉండేదట! ఆ మహానగరంలోని ప్రసిద్ధ స్కాటిష్ చర్చి కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకుని, కలకత్తా విశ్వవిద్యాలయంలో పీజీ పట్టభద్రుడైన కాలంలోనే ఆయన వామపక్ష భావజాలానికి ఆకర్షితులయ్యారు. ఆ భావజాలమే తన దృష్టికోణాన్ని విస్తృతం చేసిందంటారాయన. ఈ ప్రపంచాన్ని దర్శించగలిగిన నిజమైన చూపునిచ్చిందంటారు. వామపక్ష విద్యార్థి ఉద్యమంలో చురుకైన కార్యకర్తగా పనిచేసిన అనుభవం, వామపక్ష సాంస్కృతికరంగమైన "ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్" (ఇప్టా)తో ఏర్పడిన అనుబంధం తననో సృజనకారుడిగా తీర్చిదిద్దాయంటారు మృణాల్‌సేన్. నిజమే... అందుకే ఆయన మట్టినీ మనుషుల్నీ సెల్యులాయిడ్‌పైకి నడిపించగలిగారు!



చదువు పూర్తయిన తొలినాళ్లలో భౌతికశాస్త్రం చదివిన విద్యార్థిగా మెడికల్ రిప్రజెంటేటివ్‌గా కొనసాగిన ఆయన "ఇప్టా" స్ఫూర్తితో కళారంగంవైపు అడుగులేసారు. కలకత్తాలోని ఓ స్టూడియోలో ఆడియో టెక్నీషియన్‌గా చేరారన్న మాటేగానీ... దాన్ని ఒక అవకాశంగా తీసుకుని మొత్తం 'ఫిల్మ్ మేకింగ్'పైనే విస్తృత అధ్యయనం సాగించారు. తను ఇష్టంగా చదివిన భౌతికశాస్త్ర విజ్ఞానాన్ని, మార్క్సిజం అందించిన భౌతికవాద దృక్పథాన్ని మేళవించి ప్రజల కష్టాలను కన్నీళ్లనే కథావస్తువులుగా సినిమాను కొత్తమార్గం పట్టించేందుకు నడుం బిగించారు. సినిమాను ప్రజాచైతన్య సాధనంగా తీర్చిదిద్దేందుకు సంకల్పించారు. కనుకనే ఆయన చినుకు తాకిడికి మురిసిన మట్టి వాసననూ, వేడి సెగలనూ వెండితెరపై పండించగలిగారు. 1955లో "రాత్ భోర్"తో ప్రారంభమైన ఆయన సినీ ప్రయాణం 2002 "అమార్ భువన్" వరకూ అలుపెరగక సాగింది. ఈ ప్రయాణంలో ఆయన సృష్టించిన ప్రతి సినిమా ఈ సమాజానికి దర్పణమే. ప్రతి ఫ్రేమ్ ఒక దృశ్య కావ్యమే. 1958లో "నీల్ ఆకాశర్ నీచే" 1960లో "బైసే శ్రావణ"తో ఆయనకు తొలిసారిగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. అది మొదలు "పునశ్చ", "అవశేషే", "ఆకాశ్ కుసుమ్", "మాటిర మానిష", "భువన్ శోమ్" చిత్రాలతో 80వ దశకం వరకు ఆ పరంపర కొనసాగింది. ఆయన "భువన్‌శోమ్" సినిమా దేశంలోనే కాదు అంతర్జాతీయంగానూ ఓ సంచలనం. ఇప్పుడు సమాంతర సినిమాగా వ్యవహరిస్తున్న ఆర్ట్ సినిమాకు లేదా న్యూవేవ్ సినిమాకు నాంది ఈ చిత్రమే. మన రోజువారీ జీవితంలో తారసపడే మనుషులే పాత్రలుగా, నిజజీవితాల్లోని సంఘటనలే దృశ్యాలుగా సినిమా రూపొందించి, ఆ సినిమాను కేవలం అవార్డులకు, విమర్శకుల ప్రశంసలకే పరిమితం చేయకుండా మాస్, క్లాస్ అనే తేడా లేకుండా ప్రేక్షకుల నీరాజనాలు కూడా అందుకోవచ్చని నిరూపించిన సినిమా "భువన్ శోమ్". సంఖ్య రీత్యా 27 సినిమాలనే తీయగలిగిన మృణాల్‌సేన్.. తాను అందుకున్న జాతీయ అంతర్జాతీయ పురస్కారాలు మాత్రం అసంఖ్యాకం! పద్మభూషణ్, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డులు కూడా ఆయనను వరించి వాటి ప్రతిష్టను ఇనుమడింపజేసుకున్నాయి. "ఒక ఊరి కథ"తో మృణాల్ మన తెలుగు తెరపైనా తళుక్కుమన్నారు. అది ఉత్తమ తెలుగుచిత్రంగా జాతీయ అవార్డు గెలుచుకుంది. నేటి వెండితెర దిగ్గజాలు అమితాబ్ బచ్చన్, మిథున్‌చక్రవర్తి లాంటి అనేకులను ఆయన పరిశ్రమకు అందించారు.

ఆధునిక భారతీయ సినిమాకు అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన దర్శకత్రయంలో ఆయనొకరు. మన సమాంతర సినిమాని విశ్వవ్యాపితం చేసిన దర్శకత్రయం సత్యజిత్‌రే, రిత్విక్‌ఘటక్, మృణాల్‌సేన్. వీరు తమ సినిమాలతో ఈ దేశాన్నే కాదు ప్రపంచాన్నే తట్టి లేపిన దర్శక దిగ్గజాలు. అంతర్జాతీయ వేదికలపై భారతీయ సినిమా ప్రతినిధులుగా వెలుగొందిన ధృవతారలు. ఇప్పుడు మృణాల్ మరణంతో ఆ శకం ముగిసింది. ఈ దేశం ఒక అద్భుత భారతీయ సినిమా నిపుణుడిని కోల్పోయింది. ఆయనొక కళాశిఖరం. భువన్‌శోమ్ నుంచి కలకత్తా ట్రయాలజీ వరకు అజరామర కళాఖండాలను ఆవిష్కరించిన మన కాలపు చరిత్రకారుడు. అన్నిటికీ మించి పాలకవర్గాల దుర్నీతిని వెండితెరపై ఎండగట్టడమే కాదు పీడిత తాడిత ప్రజల గుండె చప్పుడూ వినిపించిన సామ్యవాద స్వాప్నికుడు. వెండితెరపై అరుణోదయాల్ని ఆవిష్కరించిన అవిశ్రాంత యోధుడు. సంవత్సరాంతంలో ఆయన అస్తమయం విషాదమే అయినా, ఆయన అజేయ స్ఫూర్తితో కొత్త సంవత్సరాన్ని ఆరంభిద్దాం.

నోట్లరద్దుపై విమర్శల తీరుతెన్నులు



ప్రభాత్ పట్నాయక్

నవంబర్ 8, 2016 భారత ప్రభుత్వం చేసిన నోట్లరద్దు చర్యను ఇటీవల కాలంలో రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ బహిరంగంగా వ్యతిరేకించారు. రాజన్ ఒక ప్రముఖ ఆర్థికవేత్త, ఆయన దేశంలో ఒక ముఖ్యమైన విధాన నిర్ణేత అయినందున నోట్లరద్దుపై ఆయన చేసిన విమర్శను స్వాగతించాలి. మోడీ ప్రభుత్వం తీసుకున్న ఈ నియంతృత్వ చర్యపై వచ్చిన విమర్శకు రాజన్ విమర్శ తోడవటంతో అది మరింతగా బలోపేతం అయింది. అయితే అదే సమయంలో ఒక ముఖ్యమైన తేడాను ఎత్తిచూపవలసిన సందర్భాన్ని అది కల్పించింది. సైద్ధాంతిక విషయాలలో అవకాశవాదం గానీ, ఎత్తుగడల ఐక్యసంఘటన గానీ ఉండే అవకాశం లేనందున (ఉదాహరణకు లెనిన్ జేఏ హబ్సన్ భావాలను సృజనాత్మకంగా, విశాల దృక్పథంతో ఉపయోగించటం దీనికి భిన్నం) ఒక

కాబట్టి మోడీ ప్రభుత్వం చేసిన నోట్లరద్దుకు వ్యతిరేకంగా వచ్చిన విమర్శలన్నింటినీ ఆహ్వానించి తీరాలి. అయితే నోట్లరద్దుతో వస్తువుల రాశుల పరిమాణం వృద్ధిపై ప్రతిబంధకాలు ఏర్పడ్డాయనే నయాఉదారవాద విమర్శకు, దానితో దోపిడీ తీవ్రమౌతుందనే వామపక్ష విమర్శకు మధ్యగల తేడాను ఎన్నడూ విస్మరించ కూడదు.

నిరంకుశ చర్యను వ్యతిరేకించటంలో ఒకేవైపు ఉన్నప్పటికీ తేడాలను ఎత్తిచూపటం సైద్ధాంతిక స్పష్టతకు అవసరం.

నోట్లరద్దు చర్యకు వ్యతిరేకంగా చేసిన విమర్శలో రెండు వేరువేరు పాయలున్నాయి. ఈ చర్యతో రైతాంగానికి, చిన్న ఉత్పత్తిదారులకు, కార్మికులకు క్లుప్తంగా చెప్పాలంటే అశేష శ్రామిక జనావళికి వినాశకర పర్యవసానాలున్నాయని వామపక్ష విమర్శ ఎత్తిచూపింది. మరోవైపు నయాఉదారవాద చట్రంలోపల నుంచి ఆలోచించే మన్‌మోహన్ సింగ్‌తోపాటు అనేకమంది నోట్లరద్దుతో స్థూల జాతీయోత్పత్తి వృద్ధిరేటుపై హానికరమైన ప్రభావం పడుతుందని విమర్శించారు. అంటే నోట్లరద్దుతో వృద్ధి రేటుపై హానికరమైన ప్రభావం ఉంటుందనే విషయం వామపక్షానికి తెలియనిది కాదు. ఎందుకంటే మనలాంటి ఆర్థిక వ్యవస్థలో అత్యంత ప్రాధాన్యతగల చిన్న ఉత్పత్తి రంగంపై దాడి జరిగితే వృద్ధి రేటు ప్రతికూలంగా ప్రభావితమవుతుందని వేరే చెప్పనక్కరలేదు. అలాగే నోట్లరద్దుతో శ్రామికజనం కష్టనష్టాలకు గురవుతారని నయాఉదారవాద చట్రంలో నుంచి విమర్శిస్తున్నవారికి తెలియదని, దాన్ని వారు పట్టించుకోవటంలేదని అంటే అమర్యాద అవుతుంది. అయినప్పటికీ దృష్టిని కేంద్రీకరించటంలోను, వక్కాణింపులోను ఈ రెండు విమర్శనా ధోరణులమధ్య తేడాలున్నాయి. ఒకటి ప్రజలపై ప్రత్యక్ష ప్రభావం ఉంటుందనే వాస్తవాన్ని ఎత్తిచూపుతుంటే, మరొకటి స్థూల జాతీయోత్పత్తి వృద్ధిపై ప్రతికూల ప్రభావం ఉంటుందని చెబుతుంది. ఒకటి ప్రజల స్థితిగతులపై దృష్టి కేంద్రీకరిస్తుంటే మరొకటి వస్తు రాశుల పరిమాణం తగ్గుతుందని వాపోతుంది.

రాజన్ విమర్శ స్పష్టంగా రెండవ భావాభి వర్గానికి చెందుతుంది. ఒకవైపు ప్రపంచ ఆర్థికవ్యవస్థలో వృద్ధిరేటు పెరుగుతూవుంటే నయాఉదారవాద వ్యవస్థలో దానితో అనుసంధానమైన భారత వృద్ధి రేటు పెరగటానికి బదులుగా మందగించిందనే వాస్తవాన్ని రాజన్ ఎత్తిచూపుతున్నాడు. ఇలా జరగటానికి నోట్లరద్దు, వస్తువుల, సేవల పన్ను(జీఎస్‌టీ)ను ప్రవేశపెట్టటాన్ని కారణాలుగా ఆయన చెబుతున్నాడు. ఉద్యోగితపట్ల తనకున్న ఆందోళనవల్ల ఆయన వృద్ధిరేటు గురించి ఆందోళన పడుతున్నాడు. అంటే ప్రజల గురించి ఆందోళన చెందుతున్నాడు. భారతదేశం తాను ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యను తగ్గించుకోవాలంటే వార్షికంగా 7శాతం కంటే ఎక్కువగా వృద్ధి సాధించాలి. అయితే నోట్లరద్దు, జీఎస్‌టీల కారణంగా వృద్ధిరేటు అంతకంటే తక్కువగా నమోదయింది.

కానీ స్థూల జాతీయోత్పత్తి వృద్ధిపై తమ దృష్టి కేంద్రీకరించటానికి కారణంగా నయాఉదారవాదులు ఉద్యోగితను చూపటం అంతగా చెల్లదు. నయాఉదారవాదం భారతదేశంలో ప్రవేశించటానికి ముందటి సంవత్సరాలలో స్థూల జాతీయోత్పత్తి వృద్ధిరేటు వార్షికంగా 3.5 నుంచి 4శాతంగా ఉండేది. అలా ఉన్నప్పుడు ఉపాధి వృద్ధిరేటు వార్షికంగా 2శాతం ఉంది. అదే నయాఉదారవాద పాలనలో స్థూల జాతీయోత్పత్తి వృద్ధిరేటు 7శాతాన్ని మించి రెండు రెట్లు అయినా ఉపాధి వృద్ధిరేటు 1శాతంగా నమోదైంది. అంటే అంతకుముందున్న వృద్ధిరేటులో సగమైందనే వాస్తవాన్ని ఈ వాదన గుర్తించటం లేదు. వేరే మాటల్లో చెప్పాలంటే స్థూల జాతీయోత్పత్తి వృద్ధిరేటు పడిపోవటంపై ఆందోళన చెందటం ప్రజల కోసమేనని చెబుతున్నప్పటికీ వాస్తవంలో అది కేవలం దాని వృద్ధిరేటు అంటే వస్తువుల రాశి పరిమాణం గురించి ఆందోళన చెందటంగానే ఈ వాదన ఉంది.

స్థూల జాతీయోత్పత్తి వృద్ధిని మాత్రమే పట్టించుకోవటమనేది నయాఉదారవాద భావజాలంలో ఒక అంతర్భాగం. ఇది బడా బూర్జువా వర్గ ప్రయోజనాలకు చాలా అనుకూలంగా ఉంటుంది. ఒకవేళ స్థూల జాతీయోత్పత్తి వృద్ధి జాతి ప్రధాన లక్ష్యమైతే అటువంటి లక్ష్యాన్ని ముందుకు తీసుకుపోయేవాడే నిజమైన దేశభక్తుడు. దాన్ని వ్యతిరేకించేవారు 'జాతి వ్యతిరేకులు'గా మారతారు. ఒక బూర్జువా సమాజంలో స్థూల జాతీయోత్పత్తి వృద్ధికి కావలసిన మూలధన సంచయం (క్యాపిటల్ ఎక్యుమ్యులేషన్) బాధ్యతను చేపట్టే బూర్జువావర్గం ముఖ్యంగా బడా బూర్జువావర్గం జాతీయవాదానికి వాస్తవంలో మూల విరాట్టు అవుతుంది. మరోవైపు తమ జీవన ప్రమాణాలను కాపాడుకోవడానికి ఎక్కువ వేతనాల కోసం సమ్మెలకు దిగే, ఎక్కువ ధాన్య సేకరణ ధరల కోసం నిరసన ప్రదర్శనలు చేసే శ్రామిక జనం ఆర్థిక వ్యవస్థకు 'అంతరాయం' కలిగిస్తూ స్థూల జాతీయోత్పత్తి వృద్ధిరేటును దెబ్బతీసేవారిలా కనిపిస్తారు. కాబట్టి వారు 'జాతి వ్యతిరేక' చర్యలకు పాల్పడుతున్నట్టుగా కనిపిస్తారు.

కాబట్టి హాస్యాస్పదమైన విషయం ఏమంటే ఉద్యోగావకాశాలను పెద్దఎత్తున సృష్టించటం ద్వారా ప్రజా ప్రయోజనాలను ముందుకు తీసుకుపోతున్నామన్న పేరుతో స్థూల జాతీయోత్పత్తి వృద్ధిపైనే దృష్టిని కేంద్రీకరిస్తూ ప్రజాపోరాటాలన్నింటినీ ఆమోదయోగ్యం కానివిగాను, అందుకు బదులుగా పరిశ్రమల స్థాపనకు పెట్టుబడికి ఇచ్చే అన్నిరకాల రాయితీలను ఆమోదయోగ్యమైనవిగాను చూపటం జరుగుతుంది. అలా కార్పొరేట్ ప్రయోజనాలను బహిరంగంగా ముందుకు తీసుకుపోవటం నాయబద్ధమైనవిగాను ప్రజాపోరాటాలన్నీ న్యాయవిరుద్ధమైనవిగాను కనపడతాయి! విదేశీ పెట్టుబడులకు ఇచ్చే రాయితీలు కూడా 'జాతీయ ప్రాజెక్టు', 'జాతి నిర్మాణం'లో భాగమై న్యాయబద్ధం అవుతాయి!

దీనిని మనం 'జీడీపీ జాతీయవాదం' అనవచ్చనుకుంటా. నయాఉదారవాద శకంలో కీర్తించబడే జీడీపీని సంక్షుభిత కాలంలో మరింతగా బలోపేతం చేయటానికి హిందుత్వ మతతత్వంతో అనుసంధానం చేయటం జరిగింది. ఈ జీడీపీ



జాతీయవాదానికి సుదీర్ఘ గతం ఉంది. ఐరోపాలో 17వ శతాబ్దంలో ఆవిర్భవించిన, 18వ శతాబ్దంలో పైకి ఎగిసిన బూర్జువా 'జాతీయవాదం'లో ఇది అంతర్భాగంగా ఉంది. వాణిజ్యశీలురే(మెర్కెంటలిస్టులు) కాకుండా సంప్రదాయ రాజకీయ అర్థశాస్త్రానికి వ్యతిరేకులు (వీరిలో అనేకులకు బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీతో సంబంధాలున్నాయి) కూడా అయిన రచయితలకు జీడీపీని పెంపొందించటంపై విభిన్న ఆలోచనలు ఉన్నప్పటికీ వీరు దాని బాధితులయ్యారు.

ద వెల్త్ ఆఫ్ నేషన్స్ గ్రంథం రచించటంలో ఆడమ్ స్మిత్ లక్ష్యం సంపద పెంపొందించటం ఎలా అనే మర్మాన్ని ఛేదించటమే. అలా పెంపొందించబడిన సంపద 'జాతీయ' లక్ష్యానికి అనుగుణంగా ఉంటుందని ఆయన భావించాడు. అయితే జాతి సంపద పరిమాణాన్ని పెంచినంత మాత్రాన దానితో శ్రమజీవుల పరిస్థితి మెరుగవుతుందనే గ్యారంటీ ఏమీలేదని ఆయన విశ్లేషణ చెబుతోంది. ఈ విషయం గురించి స్మిత్ చెప్పిందే డేవిడ్ రికార్డో కూడా చెప్పాడు. వేరే మాటల్లో చెప్పాలంటే సంపద పెరగటం వాంఛనీయమే. సరిగ్గా దీనినే నేటి 'జీడీపీ జాతీయవాదం' సమర్థవంతంగా ప్రచారం చేస్తున్నది. ఇందుకోసం అది ఒక ప్రత్యేకమైన వర్గ వ్యూహాన్ని సమర్థిస్తున్నది. కార్మికులపై దాడి చేయటం, అంతర్జాతీయ పెట్టుబడితో అనుసంధానించబడిన కార్పొరేట్-ఫైనాన్షియల్ వర్గాన్ని సంతృప్తి పరచటంగా ఈ వ్యూహం ఉన్నది.

ఇలా చెప్పటమంటే అర్థం ఈ 'జీడీపీ జాతీయవాదం' పాలకవర్గాల కుట్ర అనిగానీ లేక ఈ ఆలోచనను సమర్థించేవారంతా ఈ కుట్రలో పాలుపంచుకుంటున్నారని అన్నట్టు కాదు. ప్రజల మధ్య సంబంధాలపై కాకుండా వస్తువులపై దృష్టిని సారించేలా చేసే పరిస్థితిని వాస్తవంలో బూర్జువా సమాజం సృష్టిస్తుంది. వస్తువులకు మార్మికంగా మానవాతీత శక్తులు వస్తాయి. ఆ విధంగా ఉత్పత్తి సాధనాలకే మిగులును ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉన్నట్టు కనపడుతుంది. కాబట్టి లాభాలు ఉత్పత్తి సాధనాలలోనే నిక్షిప్తమై వున్నట్టు అనిపిస్తుంది. దీనినే ఈనాటికీ బూర్జువా అర్థశాస్త్రం మనకు బోధిస్తుంది.

అంటే ఏ ప్రత్యేకమైన సామాజిక పరిస్థితుల, సామాజిక సంబంధాల నేపథ్యంలో ఉత్పత్తి జరుగుతుందో, జీడీపీ వృద్ధి చెందుతుందో పట్టించుకోకుండా కేవలం వస్తువులు రాశులు పడటం, అవి రాశులుగా పడే రేటు(జీడీపీ వృద్ధి రేటును కొలవటం అంటే ఇదే)కు నిరుద్యోగం, పేదరికం వంటి అన్ని సామాజిక సమస్యలను అధిగమించగల మార్మిక సామర్థ్యం ఉంటుందనే భావన కలగటంలో ఆశ్చర్యమేమీ లేదు. మార్క్సిస్టు సారస్వతంలో 'వస్తువీకరణ(రెయిఫికేషన్)'గా పిలవబడుతున్న ఈ దృగ్విషయం ఒక స్థితి తీరుతెన్నుగాను, సాధారణీకరింపబడిన సరుకుల ఉత్పత్తిగల ఆర్థిక వ్యవస్థ స్వభావంగాను ఉండటమే కాకుండా అది ఒక ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. వస్తువుల మధ్యవర్తిత్వం కారణంగా వ్యక్తుల మధ్యగల వాస్తవ సంబంధాలలో అస్పష్టత ఏర్పడుతుంది. అటువంటి అస్పష్టత కారణంగా సమాజంలోని వ్యక్తుల మధ్య ఉండే వాస్తవ సంబంధాలు మరుగున పడతాయి. ఆ విధంగా వస్తువీకరణ దోపిడీని సమర్థించే భావజాలాన్ని అందిస్తుంది. పెట్టుబడిదారుల లాభాలు ఉత్పత్తి క్రమంలో కార్మికుల శ్రమశక్తిని ఉపయోగించటం ద్వారా ఏర్పడిన మిగులు విలువను స్వాహా చేయటం వల్ల వస్తాయని కాకుండా ఉత్పత్తి సాధనాల అంతర్గత లక్షణాల కారణంగా వస్తున్నట్టు కనపడుతుంది. సరిగ్గా ఇదేవిధంగా వస్తువులకు మార్మికశక్తులను ఆపాదించే 'జీడీపీ జాతీయవాదం' సమాజాన్ని బడా బూర్జువా వర్గానికి అత్యంత అనుకూలంగా మార్చటానికి కావలసిన భావజాలపరమైన సమర్థనను అందిస్తుంది.

కాబట్టి మోడీ ప్రభుత్వం చేసిన నోట్లరద్దుకు వ్యతిరేకంగా వచ్చిన విమర్శలన్నింటినీ ఆహ్వానించి తీరాలి. అయితే నోట్లరద్దుతో వస్తువుల రాశుల పరిమాణం వృద్ధిపై ప్రతిబంధకాలు ఏర్పడ్డాయనే నయాఉదారవాద విమర్శకు, దానితో దోపిడీ తీవ్రమౌతుందనే వామపక్ష విమర్శకు మధ్యగల తేడాను ఎన్నడూ విస్మరించ కూడదు.

అనువాదం: నెల్లూరు నరసింహారావు,
సెల్: 8886396999

ఆ ఫైల్ ఏమైంది..!?

జి. వరకుమార్

సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా ఎక్కడాలేని చోద్యం చూపిస్తూ వింత పోకడలను అవలంభిస్తున్న ఏకైక శాఖ మన తెలుగు రాష్ట్రాలలో ఏదైనా ఉందీ అంటే అది ఎక్సైజ్ శాఖ మాత్రమే..! ఇందుకు అరవై సంవత్సరాలుగా జరుగుతున్న ప్రమోషన్ల దోపిడే నిలువెత్తు సాక్ష్యం. ఏ శాఖలోనైనా ప్రమోషన్లను అదే శాఖలో పనిచేస్తున్నవారికి ఇవ్వడం ఆనవాయితీ. కానీ ఎక్సైజ్ శాఖలో మాత్రం ఎటువంటి సంబంధం లేని మినిస్ట్రీయల్ స్టాఫ్‌లో పనిచేసే జూనియర్ అసిస్టెంట్లను తీసుకొచ్చి డైరెక్ట్‌గా ఎస్ఐ స్థాయి అధికారిగా ప్రమోషన్ ఇవ్వడం ఏమిటి..!? మరి దశాబ్దాలుగా ఈ శాఖలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వారికి ప్రమోషన్లు ఎప్పుడొస్తాయి.!? ఎలా వస్తాయి.? నెలల తరబడి యూనిఫారమ్ సర్వీస్‌లో ట్రైనింగులు చేసొచ్చిన కానిస్టేబుళ్లను వదిలి ఏ ట్రైనింగూ లేని, అసలు యూనిఫారమ్ సర్వీస్‌తో సంబంధమే లేని ఉద్యోగులను తీసుకొచ్చి ఏకంగా ఎస్ఐ స్థాయిలో కూర్చోబెట్టడం చట్టవిరుద్ధం కాదా? దీనికి ఉద్యోగ రూల్స్ ఎలా అనుమతినిస్తున్నాయి.? రాష్ట్ర ఆదాయ రాబడిలో రెండవ స్థానం అబ్కారీశాఖది. ఇందులో అహోరాత్రులు చెట్టు-పుట్ట, వాగు-వంక, గల్లీగల్లికి తిరిగి ఉద్యోగం చేసేది కానిస్టేబుల్స్. వీరికి కాకుండా ఏసి రూంలలో కూర్చొని రాసుకునేటోళ్లకు సంబంధం లేని శాఖలో ప్రమోషన్ పేరిట ఆఫీసర్‌గా ఉద్యోగాలు ఇవ్వడం న్యాయమా?

ఈశాఖలో దశాబ్దాలుగా పనిచేస్తే హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషన్ వస్తుంది. ఈహెడ్ కానిస్టేబుల్‌గా మరికొన్ని దశాబ్దాలు పనిచేస్తే ఎస్ఐ స్థాయి అధికారిగా ప్రమోషన్ వస్తుంది. అసలు తిరకాసంతా ఇక్కడే వుంది. ఎస్ఐగా ప్రమోషన్ పొందాల్సిన హెడ్ కానిస్టేబుళ్లను వదిలి డిపార్టమెంట్‌తో ఎటువంటి సంబంధం లేని మినిస్ట్రీయల్ స్టాఫ్‌లోని జూనియర్ అసిస్టెంట్లను తీసుకొచ్చి డైరెక్ట్‌గా ప్రమోట్ చేయడం వలన ఈ శాఖలో కానిస్టేబుల్స్‌గా రిక్రూటయి కానిస్టేబుల్‌గానే రిటైర్ కావాల్సి వస్తుంది. ఇది అన్యాయం. దీనిపై ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలి. 2005లో నాటి ప్రభుత్వంలో సీఎంగా ఉన్నటువంటి డా॥వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎక్సైజ్‌లో అమలవుతున్న ఈ విరుద్ధ ప్రమోషన్లపై వివరణ కోరుతూ శాఖవారికి ఒక మెమోను జారిచేశారు. ఆ ఫైల్ ఇంతవరకు ఆచూకీ లేకపోవడం గమనార్హం! అసలు ఆ ఫైల్ ఏమైందని ఆరా తీసిన నాథుడే లేడు. ఇప్పటివరకు పట్టించుకున్న ప్రభుత్వాలు లేవు. ఆ ఫైల్ మాయమైపోవడానికి ప్రధాన కారణం అందులో వివరణ అడిగిన ప్రధానాంశం మినిస్ట్రీయల్ స్టాఫ్‌లో పనిచేసే జూనియర్ అసిస్టెంట్లకు సంబంధంలేని యూనిఫారమ్ సర్వీస్ అయిన ఎక్సైజ్ శాఖలో డైరెక్ట్‌గా ఎలా అధికారిగా ప్రమోషన్లు ఇస్తున్నారు? అన్నదే. ఈ ఫైల్ ముఖ్యమంత్రి ఆఫీస్ నుండి సంబంధిత శాఖకు అందాలంటే ముందుగా ఈ శాఖలో పనిచేస్తున్న మినిస్ట్రీయల్ స్టాఫ్ వారికే చేరుతుంది. ఈ ఫైల్ వీరికి అనుకూలంగా ఉన్న ప్రమోషన్లకు విరుద్ధంగా ఉంది. అందుకే కాబోలు ఏకంగా ఫైల్‌కు ఫైలే మాయమైపోయింది.


దీనిపై ఇంతవరకు శాఖపరమైన చర్యలు లేకపోవడమే విచారకరం. 1961 సంవత్సరంలో వందకు డెబ్బై ఐదు శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా జరిగిన భర్తీలో మిగతా ఇరవైదు శాతంలో హెడ్‌కానిస్టేబుల్స్‌కు, జూనియర్ అసిస్టెంట్లకు సమంగా అవకాశం కల్పించారు. 1969వ సంవత్సరానికి వచ్చేసరికి ఆరు పోస్టులకుగాను నలుగురు డైరెక్ట్‌గా ఎంపిక కాబడితే మిగతా ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లను భర్తీచేసి హెడ్ కానిస్టేబుళ్లకు మొండి చెయ్యి చూపారు. ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్‌గా రిక్రూటై డీఎస్పీగా రిటైర్ అయిన ఒకే ఒక వ్యక్తి సినీనటుడు కొణిదల చిరంజీవి తండ్రి మాత్రమే! మళ్లీ 1996-97లో ఇరవైరెండుమందికి గాను డైరెక్ట్ రిక్రూట్మెంట్ తరపున 13మంది కాగ డిపార్ట్మెంట్ యూనిఫారమ్ సర్వీస్‌కు సంబంధంలేని జూనియర్ అసిస్టెంట్లకు ఆరుగురికి ప్రమోషన్ ఇచ్చి సంబంధిత శాఖలో ముగ్గురిని మాత్రమే ప్రమోట్ చేసుకున్నారు. దీంతో యూనిఫారమ్ సర్వీస్ వారు 1997లో నలభై దినాలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీని ఫలితంగా జీవోఎంఎస్ నంబర్ 452 ప్రకారం 50శాతం డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా మిగతా 50శాతాన్ని ఇరువురికి సమానంగా 25శాతం చొప్పున చేశారు. ఇది అంతకు ముందు 1986లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్ 880ని తీసుకొచ్చి 60శాతం డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా మిగతా 40శాతంలో 20 శాతాన్ని యూనిఫారమ్ సర్వీస్‌కు సంబంధంలేని జూనియర్ అసిస్టెంట్లకు కేటాయించి మిగతా శాతాన్ని హెడ్-కానిస్టేబుళ్లకు కేటాయించిన విధానానికి తాత్కలికంగా మార్పులు చేశారంతే. దీనిపై మళ్లీ 1998లో జీవోఎంఎస్ నంబర్ 950ని తీసుకొచ్చి 50శాతాన్ని డైరెక్ట్‌గా మిగతా 50శాతాన్ని 25 చొప్పున ఇరువురికి కేటాయించింది. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఈ పరిస్థితిని పసిగట్టిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1998 నాటి జీవోను సవరిస్తూ జీవోఎంఎస్ నంబర్ 33ని 2017లో తీసుకొచ్చింది. రాజ్యాంగంలో ప్రొవైజో (జూతీశీజఱంశీ) ఆర్టికల్ 390ప్రకారం డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా 35 శాతాన్ని, 40శాతం ఎక్సైజ్ పోలీసులకు, యూనిఫారమ్‌తో సంబంధంలేని జూనియర్ అసిస్టెంట్లకు 25శాతం ప్రమోషన్స్ ఇవ్వాలని జీవోను తీసుకొచ్చింది. కానీ తెలంగాణ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో సంబంధిత శాఖలో పనిచేస్తున్న అనేకమంది కానిస్టేబుల్స్, హెడ్ కానిస్టేబుల్స్ నిరాశ నిస్పహల్లో ఉద్యోగాలు నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితులపై తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించి వేలాదిమంది ఎక్సైజ్ పోలీసులకు భరోసాగా నిలవాల్సిన అవసరం ఉంది. అలాగే మాయమైపోయిన ఫైల్‌పై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాల్సిన బాధ్యత మన రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలది.

నిటిఆయోగ్ వ్యూహపత్రం సంపన్నుల పక్షమే

ఎస్. భాస్కరరావు

రానున్న ఐదేండ్లలో సుసంపన్న భారత్ లక్ష్య నినాదంతో నిటి ఆయోగ్ తాజాగా వ్యూహ పత్రాన్ని సిద్ధం చేసింది. మౌలికరంగాల్లో అనుసరించబోయే విధానాలను చూస్తుంటే సంపన్నుల సంపద మరింత సుసంపన్నమయ్యేలా వ్యూహపత్రం దిశానిర్దేశం చేస్తున్నట్టుంది. ప్రపంచీకరణ యుగంలో నయా ఉదారవాద విధానాలు దేశంలో వేగవంతంగా అమలవుతున్న సమయంలో వాటిని కొనసాగించే విధంగానే వ్యూహపత్రంలోని అంశాలున్నాయి. ప్రజల ముందు అభివృద్ధి నినాదాన్ని వినిపిస్తూనే ఆ అభివృద్ధిని కార్పొరేట్ శక్తులకు చేర్చేలా పథక రచన ఉంది. డాలరు ముందు రూపాయి చిన్నబోతున్న పరిస్థితుల్లో విదేశీ మారకద్రవ్య నిల్వలు కనిష్ట స్థాయిలో కరిగిపోయిన దుస్థితిలో పడి దేశ ఆర్థిక వ్యవస్థ చితికిపోయింది. దేశాభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించిన బ్యాంకింగ్ రంగం మూలధనం కోసం ఎదురు చూసే దుస్థితిని నయా ఉదారవాద విధానాలు తీసుకొచ్చాయి. కార్పొరేట్ సంస్థల మొండి బకాయిలు రూ.12 లక్షల కోట్లకు చేరాయి. బ్యాంకుల ముందు నిరర్థక ఆస్తులు వెక్కిరిస్తున్నాయి. ప్రజల జీవన ప్రమాణాలు పడిపోతున్న సమయంలో స్థూల జాతీయోత్పత్తి పెరుగుదలను ప్రభుత్వాలు చూపిస్తున్నాయి. ఉత్పత్తి ఫలాలు సామాన్య ప్రజల దరిచేరడం లేదు. ఆ సంపద కొద్దిమంది చేతుల్లో పోగు పడుతోంది. ప్రభుత్వాలు అందిస్తున్న గణాంకాలే ఈ వాస్తవాలను చెప్తున్నాయి. సరళీకరణ విధానాలను సంస్కరించకుండా ఆర్థిక వ్యవస్థను ఒడ్డుకు చేర్చడం అసాధ్యం. ప్రభుత్వాలు అందుకు సిద్ధంగా లేవు. ప్రస్తుతమున్న దేశ ఆర్థిక వ్యవస్థను రూ.195 లక్షల కోట్ల నుంచి 2022-23 నాటికి రూ.288 లక్షల కోట్లకు చేరుకుంటుందని నిటి ఆయోగ్ చెప్తోంది. ఆ అభివృద్ధిలో కార్పొరేట్ సంస్థలకు పెద్దపీట వేయాలన్నది నిటి ఆయోగ్ లక్ష్యంగా ఉంది. అందువల్లే ప్రస్తుతమున్న 29శాతం పెట్టుబడులు 2022 నాటికి జీడీపీలో 36శాతానికి పెరగాలని నిటిఆయోగ్ నిర్దేశించింది. అదేరీతిలో ప్రజలపై పన్నుల భారం జీడీపీలో సగటున 22శాతం పెరగాల్సి ఉందని స్పష్టం చేసింది. కొద్దిమంది వద్ద పోగుపడిన సంపదతో కలిపి ప్రజల తలసరి ఆదాయాన్ని ప్రభుత్వం లెక్కగట్టడం అశాస్త్రీయం. ప్రభుత్వ లెక్కల ప్రకారం దేశంలో తలసరి ఆదాయం రూ.1.39 లక్షలు ఉంది. ఇది ఐదేండ్లలో రూ.2.12 లక్షలకు పెరగాలన్నది నిటిఆయోగ్ నిర్ణయం. పన్నుల భారాన్ని పెంచాలని చెప్పిన నిటిఆయోగ్ ధరల నియంత్రణను గాలికొదిలేసింది.

భారత్ స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగం గరిష్ట పాత్ర పోషిస్తోంది. ఈ రంగాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించే చర్యల్లేకుండా సుసంపన్న భారత్‌ను చూడలేం. రైతులను వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని నిటి ఆయోగ్ చెప్తోంది. తద్వారా కంపెనీ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని వ్యూహపత్రం సారాంశాన్ని వెల్లడించింది. అమల్లోకొస్తే వ్యవసాయ సాగు కంపెనీ యజమానులు పారిశ్రామికవేత్తలుగానూ, సామాన్య రైతులు తమ పొలాల్లో కూలీలుగానూ మారతారు. వ్యవసాయోత్పత్తుల మార్కెట్ కమిటీల స్థానంలో పశుసంపదను జత చేసి, కొత్త చట్టాన్ని తీసుకురావాలని నిటి ఆయోగ్ చెప్తోంది. తద్వారా పెట్టుబడులు ఉండవని అబద్దాలు చెప్తున్న ప్రకృతి వ్యవసాయానికి తలుపులు బార్లా తెరిచినట్ట వుతుంది. తద్వారా రైతుకు లాభించేదేమీ ఉండదు. దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం జీఎస్‌టీ మాదిరిగానే వ్యవసాయ పంటలకు ఏకీకృత జాతీయ మార్కెట్ ఏర్పాటు చేయాలని, స్వేచ్ఛా ఎగుమతుల వ్యవస్థను తీసుకురావాలని నిటి ఆయోగ్ చెప్తోంది. ఈ రెండూ మార్కెట్ శక్తులకే లాభిస్తాయి. రైతు తన పంటను తెగనమ్ముకోవాల్సి వస్తుంది. వ్యవసాయోత్పత్తుల ధరలు పడిపోకుండా ఉండేందుకు అవసరమైతే ఎగుమతులు, దిగుమతులపై ఆంక్షలు విధించేందుకు వీల్లేకుండా చేస్తుంది. నిత్యావసర ధరలను అదుపు చేసే పరిస్థితి ఉండదు. అంతేకాదు! నిత్యావసర ధరల చట్టం రద్దు చేయడం తప్పనిసరి అని నిటిఆయోగ్ స్పష్టం చేస్తోంది. వ్యవసాయ రంగ సంక్షోభానికి రుణమాఫీ పరిష్కారం కాదని స్పష్టం చేస్తోంది. రుణమాఫీ వల్ల 15శాతం మంది రైతులే లబ్ది పొందుతున్నారని, 25శాతం రైతులు సంస్థాగతంగా రుణం పొందడం లేదని లెక్కచెప్తోంది.



వ్యవసాయంలో పెట్టుబడులకు అనుగుణంగా ప్రోత్సాహం, మద్దతు ధరలు కల్పించాలన్న స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల గురించి నిటి ఆయోగ్‌కు పట్టలేదు. రాజకీయ లబ్ధి కోసం నేడు బీజేపీ కూడా రుణమాఫీ నినాదం అందుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. వ్యవసాయ సంక్షోభం నివారణ లక్ష్యం మాత్రం అజెండాలో లేదు. రైతుల ఆత్మహత్యల వివరాలు తమ వద్ద లేవని ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ప్రభుత్వం వెల్లడించింది. ఇది రైతుల పట్ల, వ్యవసాయ రంగం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. సరళీకరణ విధానాలతో నూతన వ్యవసాయ విధానం వచ్చిన తర్వాత 1995-96 నుంచి నేటి వరకు మూడు లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ప్రభుత్వ గణాంకాలే చెప్తున్నాయి. పోటాపోటీగా సేద్య రుణాలు రద్దు చేసుకుంటూపోతే ఆ భారం రూ.2.7 లక్షల కోట్లకు చేరుకుంటుందని ఆర్థిక సర్వే గతేడాది వెల్లడించింది. నరేంద్ర మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగున్నరేండ్లలోనే పారిశ్రామిక వేత్తలకు రూ.2.41 లక్షల కోట్ల రుణాన్ని రద్దు చేయడం చూశాం. పారిశ్రామికరంగం ప్రస్తావనలో ఈ అంశాన్ని నిటిఆయోగ్ ఉద్దేశపూర్వకంగానే విస్మరించింది. నిటిఆయోగ్ సిఫార్సులన్నీ వ్యవసాయాన్ని, రైతులను మార్కెట్ శక్తుల చేతుల్లో పెట్టేవిగా ఉన్నాయి. పారిశ్రామికరంగం అభివృద్ధి పేరుతో కార్మికవర్గంపై పలురకాల దాడులకు సిఫార్సు చేసింది. సంస్కరణల రూపంలో కార్మిక చట్టాలపై ఇప్పటికే దాడులు మొదలయ్యాయి. సాధించుకున్న హక్కులను ఒక్కొక్కటిగా ప్రభుత్వాలు వెనక్కి తీసుకుంటున్నాయి. ఇప్పటికే కార్మిక వర్గానికి రక్షణగా ఉన్న 150కి పైగా చట్టాలను రద్దు చేస్తున్నాయి. ఉన్న కార్మిక చట్టాలను క్రోడీకరించి కార్మిక సంస్కరణలను వేగవంతంగా పూర్తి చేయాలని నిటిఆయోగ్ చెప్తోంది. కార్మికుల వివాదాల వ్యవస్థను ప్రక్షాళన చేయాలని చెప్పింది. అంటే, ప్రశ్నించే హక్కును తొలగించాలని చెప్తోంది. కనీస వేతనం అమలు చేయాలన్నది కాగితాలకే పరిమితం అవుతుంది. నిర్బంధ చట్టం తేవాలని చెప్పదు. గ్రామాల్లో మహిళా కార్మికుల భాగస్వామ్యాన్ని ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయి.

మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామని చెప్తున్న ప్రభుత్వం, మహిళల ఉపాధి గురించి పట్టించుకోవడం లేదు. 2004-05లో దేశంలో మహిళా కార్మికుల భాగస్వామ్యం 49.75శాతం ఉండగా, 2015-16 నాటికి 26.7శాతానికి పడిపోయింది. సగభాగంగా ఉన్న మహిళల ఉపాధి అవకాశాలు క్షీణిస్తుండగా, సుసంపన్న భారత్‌ను చూడాలన్న లక్ష్యం నెరవేరే ఆస్కారమే లేదు. రెండో పాలనా సంస్కరణల సిఫార్సులను కచ్చితంగా అమలు చేయాల్సిందేనని నిటిఆయోగ్ చెప్తోంది. అంటే ఈ వైరుధ్యం కొనసాగుతూనే ఉంటుంది.

దేశాభివృద్ధిలో ఆహార భద్రత అతి ముఖ్యమైంది. చట్టం వచ్చి ఏండ్లు గడిచినా దారిద్ర్యానికి తోడు ఆకలి చావులు వెంటాడుతూనే ఉన్నాయి. చట్టం వచ్చినా రాష్ట్రాల్లో ఆహార కమిషన్లు పని చేయని వైనాన్ని చూస్తున్నాం. నిటిఆయోగ్ ఈ మౌలిక అంశాన్ని విస్మరించింది. గృహ నిర్మాణాలకు సంబంధించిన రుణాల మంజూరును ప్రాధాన్యతా రంగాల్లో చేర్చాలని నిటిఆయోగ్ పేర్కొంది తప్ప, దారిద్ర్యరేఖకు దిగువనున్న వారి ఇండ్ల నిర్మాణానికి ఎలాంటి ప్రాధాన్యతా చూపలేదు. ఇండ్ల నిర్మాణానికి సంబంధించి భూస్వాములు, బడా పారిశ్రామిక వేత్తల చేతుల్లో ఉన్న భూములను వదిలిపెట్టి ప్రభుత్వరంగ సంస్థల భూములను ఇవ్వాలని పేర్కొంది. అందుకు వృథాగా పడి ఉన్న భూములని నామకరణం చేసింది. భారతీయ రైల్వే అభివృద్ధిని ప్రస్తావిస్తూ... ఛార్జీల స్వరూపాన్ని, రాయితీలను హేతుబద్ధీకరించాలని పేర్కొంది. అంటే భారాలు వేయాలని పరోక్షంగా చెప్పినట్టయింది. సంస్కరణల రూపంలో చేపట్టిన సరళీకరణ విధానాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ వెల్లడించారు. అనుభవంలో ప్రతికూల ఫలితాలు వచ్చాయి. సరళీకరణ ఆర్థిక వ్యవస్థలో దారిద్ర్యం తగ్గలేదు. సామాన్యుల జీవితాలు మెరుగుపడడంలేదు. నయా ఉదారవాద విధానాల అమ్ములపొది లోంచి తీసిన అస్త్రాలతోనే సుసంపన్న భారత్‌ను సాధించగలమని నిటి ఆయోగ్ చెప్తోంది. ఈ అస్త్రాలన్నీ ప్రజల బతులకుపై భారాలవుతున్నాయి. కార్పొరేట్ శక్తులకు రక్షణగా నిలుస్తున్నాయి. వినాశకర విధానాల అమ్ములపొదిని మార్చనంత కాలం సుసంపన్న భారత్ లక్ష్యసాధన బహుదూరమవుతూనే ఉంటుంది.

మానవి
నవతెలంగాణ
హైదరాబాద్ 5
manavi@navatelangana.com
మంగళవారం 1-1-2019





కొత్తకొత్తగా ఉన్నది..!

కొత్త సంవత్సరానికి ఫ్యాషన్‌గా స్వాగతం చెప్పాలంటే కాస్త డ్రెస్సింగ్ పట్ల శ్రద్ధ వహించాల్సిందేనంటున్నారు డిజైనర్లు. పార్టీ థీమ్‌ను బట్టి డ్రెస్ ఎంచుకోవడంతో పాటుగా ట్రెండ్‌ను కూడా అనుసరించాల్సి ఉంటుందంటున్నారు. ఇయర్ ఎండ్‌కు సొగసైన రీతిలో వీడ్కోలు పలకాలని కోరుకుంటున్నారు. పార్టీలో సెంట్రాఫ్ ఎట్రాక్షన్‌గా నిలవడానికి ప్రయత్నిస్తున్నారు. మనం హాజరుకాబోయే పార్టీ ఎలాంటిది..? అక్కడ డ్రెస్‌కోడ్ ఏంటనేది తెలుసుకుని అందుకు తగిన రీతిలో డ్రెస్సింగ్ చేసుకోవాలి. ట్రెడిషనల్ పార్టీ లేదంటే డీజే నైట్ ఏదైనా సరే వీలైనంత ఫ్యాషన్‌గా ఉండాలి. ఫ్యాషన్‌గా, సింపుల్‌గా ఉండాలనుకుంటే ఇండో-వెస్ట్రన్ డ్రెస్‌లను ట్రై చేయడం ఉత్తమం. పార్టీల్లో సెంట్రాఫ్ ఎట్రాక్షన్ కావాలంటే కలర్స్‌తో కనికట్టు చేయాలి. రెడ్, పర్పుల్, పింక్ షేడ్స్‌తో పాటుగా గ్రే, బ్లాక్, ఆలివ్‌గ్రీన్ ఈ సీజన్‌కు ఫర్‌ఫెక్ట్ లుక్ ఇస్తాయి. ఈ ఏడాది మల్టీకలర్ డ్రెస్‌లకు జై కొడుతున్నారు యువత.

తాతకు తగ్గ మనవరాలు..!

నేటి తరం అమ్మాయిలు ఏం చేసినా స్వేచ్ఛగా, కొత్తగా చేయాలని ఆలోచిస్తున్నారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా ఎదుర్కొని విజయతీరాలు చేరాలని కలలు కంటున్నారు. పెద్దల ఆలోచనలను పుణికిపుచ్చుకొని అనుకున్న లక్ష్యాన్ని చేరాలని ముందడుగు వేస్తున్నారు. అలాంటి కోవకు చెందిన అమ్మాయే అమదనాయర్.



వారసత్వంగా వచ్చిన హోటల్ వ్యాపార రంగంలో అడుగుపెట్టి కొత్త ప్రాజెక్టులతో అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది. ఆమె తాత కెప్టెన్ సి.పి. కృష్ణన్ నాయర్. 'ది లీలా గ్రూప్ ఆఫ్ హోటల్స్' వ్యవస్థాపకుడిగా చరిత్ర సష్టించగా, ఆయన వారసురాలిగా అమద సరికొత్త ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం ఆమె 'హోటల్స్ అండ్ రిసార్ట్స్' సంస్థకు జేఎండీగా, సీఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కుటుంబ వారసత్వంగా వస్తున్న హోటల్ వ్యాపార రంగంలోకి అడుగుపెట్టారు. ఒక్కో మెట్టు అధిగమిస్తూ సవాళ్లను ఎదుర్కొని అంతర్జాతీయ స్థాయికి చేరుకున్నది. కేరళ నుండి మొదలైన ఆమె వ్యాపార ప్రస్థానం ఖతర్ వరకు విస్తరించింది. ఆసియా, సౌదీ అరేబియాలోనూ హోటల్ బిజినెస్‌ను విస్తరించింది.

విదేశాల్లో చదివి...

అమృద నాయర్ నెదర్లాండ్స్‌లోని సీహెచ్ఎన్ విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్ పీజీ చేశాక న్యూయార్క్‌లోని కార్నెల్ స్కూల్ ఆఫ్ హెూటల్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్ డిగ్రీ, సింగపూర్‌లోని నన్యాంగ్ బిజినెస్ స్కూల్లోను చదవడం ద్వారా ఆసియా మార్కెట్‌లోని బిజినెస్ మెళకువలను నేర్చుకున్నారు. హోటల్స్ బిజినెస్‌లో తన కుటుంబానికి ఉన్న పేరు ప్రఖ్యాతలను మరింత వృద్ధిచేయలన్న సంకల్పంతో ఆమె కూడా అదే రంగంలో ఉన్నత విద్యను పూర్తి చేసింది. హోటల్ బిజినెస్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. న్యూయార్క్, సింగపూర్, ఇండోనేషియా, జపాన్, చైనా, థాయ్‌లాండ్‌లతో పాటు మన దేశంలో కూడా ఈ రంగం విస్తరణ, మార్కెటింగ్, పెట్టుబడుల సేకరణ వంటి విషయాల్లో మెళకువలు నేర్చుకున్నారు. కుటుంబ వారసత్వంతో పాటు అనేక అగ్రశ్రేణి హోటళ్లలో పనిచేసిన అనుభవంతో ఆమె ఇంతటి స్థాయికి చేరుకోగలిగారు. విదేశాల్లో ఉన్నత చదువులు పూర్తి చేసి స్వదేశానికి చేరుకున్న వెంటనే ఆమె తమ కుటుంబానికి చెందిన లీలా హోటల్స్‌కు నేతృత్వం వహించారు.

తల్లి చాటు బిడ్డనే...

"వృత్తిపరంగా ఎంత బిజీగా ఉన్నా, వ్యక్తిగత జీవితం కూడా సంతృప్తికరంగా ఉంటేనే మనసు ప్రశాంతంగా ఉంటుందని అమృత అంటారు. నేను ఎంత ఎదిగిన ఇప్పటికీ తల్లి చాటు బిడ్డనే. తీరిక వేళల్లో గాలిపటాలు ఎగురేయడం, ఉదయాన్నే వ్యాయామం చేయడం, పరుగెత్తడం అంటే చాలా ఇష్టం. అమ్మ ప్రోత్సాహం, బలమే నన్ను



ఈ స్థాయికి తెచ్చాయి. నాకు అతిపెద్ద స్ఫూర్తి అమ్మ. వ్యాపార రంగమనేది అవకాశమని నమ్ము తాను. అయితే సమయం, సామర్థ్యం రెండూ లేకుంటే అవకాశలెన్ని వచ్చినా ఉపయోగం ఉండదు. రిస్క్ తీసుకోగలిగితేనే మన పునాదుల గర్వంగా నిలబడగలుగుతాయి. ఈ విషయంలో నేను చాలా అదృష్టవంతురాలిని అని అమృద" అంటారు. ❄

జుట్టు తెల్లబడుతుందా...



ఇటీవల కాలంలో చిన్నా, పెద్దా అన్న తేడా లేకుండా చాలామందికి తొందరగా వెంట్రుకలు తెల్లబడుతున్నాయి. దాంతో నలుగురిలో తిరగడానికి మొహమాటపడుతుంటారు. ఈ సమస్యను అధిగమించడానికి కొన్ని చిట్కాలు పాటిస్తే సరిపోతుంది.

- ఉసిరి పొడి తీసుకుని అందులో కొద్దిగా నిమ్మరసం వేసి, పేస్టులా చేసి మాడు మీద రాయాలి. ఈ పేస్టును కొన్ని రోజుల పాటు తలకు రాసుకుంటే తెల్ల వెంట్రుకలు పోతాయి.
- ఉల్లిపాయ పేస్టు తెల్లవెంట్రుకల మీద బాగా పనిచేస్తుంది. కాకపోతే ఈ పేస్టును మాడుకు పట్టించి పూర్తిగా ఆరిపోయే వరకూ అలాగే ఉంచాలి. ఉల్లిపాయ పేస్టు వాసనపోయేలా షాంపుతో తలను బాగా రుద్దాలి.
- కొబ్బరినూనెలో కొద్దిగా నిమ్మరసం పిండి దాన్ని మాడుకు రాసుకుంటే మంచిది. తెల్ల వెంట్రుకల మీద ఇది మంచి ప్రభావం చూపిస్తుంది. శిరోజాలను అందంగా, కాంతివంతంగా కూడా చేస్తుంది.
- క్యారట్ జ్యూసు ఆరోగ్యానికి మంచిది. క్యారట్ డ్రింకు రుచిగా ఉంటుంది. తెల్ల వెంట్రుకలున్న వారు నిత్యం ఒక గ్లాసు క్యారట్ జ్యూసు తాగాలి.
- నువ్వులను మెత్తగా చేసి అందులో బాదం ఆయిల్ వేసి పేస్టులా చేయాలి. ఈ పేస్టును కొన్ని వారాల పాటు మాడుకు రాసుకోవాలి. ఇలా చేస్తే జుట్టు నల్లగా మారుతుంది.



నన్ను కిందకు లాగిన వారికి..
నా మంచితనాన్ని చెరిపేసిన వారికి..
నన్ను నాశనం చేయాలని చూసిన వారికి..
నా ధన్యవాదాలు. ఎందుకంటే వీటన్నింటి వల్ల
నాకు నా బలం ఏంటో తెలిసింది.
సమస్యలతో ఎలా పోరాడాలో తెలిసింది. అన్నింటికి మించి
నా కాళ్ల మీద నేను నిలబడేందుకు..
నా సమస్యలతో నేనే పోరాటం చేసేందుకు కావాల్సిన
ధైర్యాన్ని నేను కూడగట్టుకున్నాను. నేను బాధితురాలిని..
నా సమస్యలతో నేనే పోరాడుతున్నాను.

– పూజా భట్, బాలీవుడ్ నటి.

గర్భం దాల్చినప్పుడు...

గర్భం దాల్చకపోయినా, దాల్చినా డిప్రెషన్ అంతే సమానంగా కనిపిస్తుంది. ఇందుకు ఎన్నో కారణాలుం టాయి. అవేంటంటే.. అతి చిన్న వయసులోనే గర్భం దాల్చటం, ఒంటరిగా ఉండవలసి రావటం, కుటుంబం అండ లేకపోవటం, కుటుంబ కలహాలు, గర్భం దాల్చటం వల్ల కలిగే ఒత్తిడి. ఇలా డిప్రెషన్‌కు గురయిన గర్భిణులు వైద్యులు సూచించిన వైద్య సలహాలు పాటించకుండా, పోషణను అశ్రద్ధ చేస్తూ ఉంటారు. నిద్రకూ దూరమవుతూ ఉంటారు. గర్భం దాల్చటంతో కలిగే ఒత్తిడి డిప్రెషన్‌ను మరింత పెంచుతుంది. ఇదే స్థితి కొనసాగితే ప్రసవం తర్వాత డిప్రెషన్ మరింత తీవ్ర రూపం దాలుస్తుంది. కాబట్టి నిరాశకు లోనయినప్పుడు కుంగిపోకుండా కుటుంబ సభ్యుల తోడ్పాటు తీసుకోవాలి. ఆందోళన తగ్గించుకుని ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోవాలి. అన్ని పనులు చేసేసుకోవాలనే ఆత్రుత తగ్గించుకుని ఒకదాని తర్వాత ఒకటిగా పనులను నెమ్మదిగా చేసుకోవాలి. వీలైతే పనులను తగ్గించుకోవాలి. సాంత్వన కలిగించే పనులను ఎంచుకోవాలి. అప్పటికీ డిప్రెషన్ అదుపులోకి రాకపోతే అనుభవం ఉన్న వైద్యులను సంప్రదించాలి. తల్లిగా మారిన తర్వాత కొందరిని 'పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్' వేధిస్తుంది. ఈ సమస్యకు యాంటీ డిప్రెసెంట్స్‌తో చికిత్స చేయొచ్చు. ❄



రంగ వల్లులు

23 చుక్కలు,
1 వచ్చే వరకు





పి. నాగరత్నం
బోనకల్

మా చిరునామా
మానవి, నవతెలంగాణదినపత్రిక,
ఎం.హెచ్. భవన్, 21/1, అజామాబాద్,
హైదరాబాద్-20.ఇ-మెయిల్:
manavi@navatelangana.com



హిమాచల్ ప్రదేశ్‌లో ...

సర్కారు ఉద్యోగాలకు 7 నోటిఫికేషన్లు

- జారీ చేసిన ఏపీపీఎస్సీ

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ ఏడు నోటిఫికేషన్లు విడుదల చేసింది. 169 గ్రూప్-1, 446 గ్రూప్-2 ఉద్యోగాలతో పాటు మొత్తం 1,386 ఉద్యోగాల భర్తీకి సోమవారం ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లు జారీ చేసింది. గ్రూప్-1 పోస్టులకు జనవరి 7 నుంచి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. 446 గ్రూప్-2 పోస్టులకు జనవరి 10 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. మే 5న గ్రూప్-2 ప్రాథమిక పరీక్ష, జులై 18, 19 తేదీల్లో గ్రూప్-2 మెయిన్ పరీక్ష నిర్వహిస్తారు. 292 నాన్ ఎగ్జిక్యూటివ్, 154 ఎగ్జిక్యూటివ్ పోస్టులు, సాధారణ పరిపాలన శాఖలో 150 ఏఎస్‌వో పోస్టులు, సీనియర్ అకౌంటెంట్లు 20, ఎక్సైజ్ శాఖలో 50 ఎస్ఐ పోస్టులు, పంచాయతీరాజ్‌శాఖలో 40 ఎక్స్‌టెన్షన్ అధికారులు, డిప్యూటీ తహశీల్దార్లు 16, ఖజానాశాఖలో 13 సీనియర్ అకౌంటెంట్లు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 405 లెక్చరర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఫిబ్రవరి 6 నుంచి 27 వరకు లెక్చరర్ పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. మత్స్యశాఖలో 43 ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టులకు జనవరి 17 నుంచి ఫిబ్రవరి 8వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 308 లెక్చరర్ పోస్టులకు ఫిబ్రవరి 5 నుంచి 26 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఫిషరీస్ సబ్ సర్వీస్‌లో 10 అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిషరీస్ పోస్టులకు జనవరి 18 నుంచి ఫిబ్రవరి 8వరకు, ఇన్ఫర్మేషన్ సర్వీస్‌లో 5 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ పోస్టులకు జనవరి 22 నుంచి ఫిబ్రవరి 12వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఏపీపీఎస్సీ తెలిపింది.

గోవా టు హైదరాబాద్ డ్రగ్స్

- సరఫరా చేస్తున్న నిందితులు అరెస్ట్
- 89 గ్రాముల కొకైన్, మూడు సెల్‌ఫోన్ల స్వాధీనం



నవతెలంగాణ-సిటీబ్యూరో

గోవా టు హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠాను వెస్టుజోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. ఇద్దరి నుంచి 89 గ్రాముల కొకైన్, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు విషయమై నగర పోలీస్ కమిషనరేట్‌లో సీపీ అంజనీకుమార్ సోమవారం డీసీపీ రాధాకిషన్‌రావు, ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లుతో కలిసి వివరాలు వెల్లడించారు.

గోవాకు చెందిన లిబియో జోసఫ్ ఆల్మడియా అలియాజ్ పీయూస్(34) గోవాలో ట్రావెల్స్ వ్యాపారం చేస్తున్నాడు. నైజీరియన్లతో పరిచయం ఏర్పర్చుకుని డ్రగ్స్‌ను సరఫరా చేయడం మొదలు పెట్టాడు. బంజారాహిల్స్‌కు చెందిన యూ.శేఖర్ (41) వాల్ పేయింటర్‌గా పనిచేస్తున్నాడు. వెస్టుగోదావరి జిల్లాకు చెందిన శేఖర్ కుటుంబం ఉపాధి కోసం కొన్నేండ్ల క్రితం నగరానికి వలసొచ్చింది. వాల్ పేయింటర్‌గా పనిచేస్తున్న క్రమంలో అప్పుడప్పుడు గోవాకు వెళ్లొచ్చేవాడు. ఈ నేపథ్యంలో జోసఫ్‌తో పరిచయం ఏర్పడింది. నగరంలో కొకైన్ సరఫరా చేస్తే సులువుగా డబ్బులు సంపాదించొచ్చని జోసఫ్ చెప్పడంతో శేఖర్ డ్రగ్స్ సరఫరా ప్రారంభించాడు. గోవా నుంచి గ్రాముకు రూ.3 వేల చొప్పున కొకైన్ కొనుగోలు చేసి నగరంలో రూ.7 వేల నుంచి రూ.11 వేల వరకు విక్రయించసాగాడు. అంతర్జాతీయ మార్కెట్‌లో గ్రాము కొకైన్ వేలల్లో ఖరీదు చేస్తుంది. అయితే నగరంలో డ్రగ్స్ సరఫరా అవుతున్నట్టు సమాచారం రావడంతో ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసులు నిందితులను ఫిలింనగర్‌లో అరెస్టు చేశారు. పట్టుబడిన కొకైన్ దాదాపు రూ.10 లక్షల విలువ ఉంటుందని సీపీ తెలిపారు. ఈ కేసులో కీలక పాత్రపోషించిన కానిస్టేబుల్ లోకేశ్వరరావును సీపీ ప్రత్యేకంగా అభినందించారు.

2,3 రోజుల్లో జీపీ ఎన్నికల నోటిఫికేషన్

- రిజర్వేషన్ల నివేదిక ఎన్నికల సంఘానికి అందజేత
- ఎన్నికల నిర్వహణకు రూ.50 కోట్లను ప్రకటించిన సర్కార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రామపంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశమున్నది. ఇప్పటికే మండలాల్లోని గ్రామాల వారీగా సర్పంచ్, గ్రామాల్లో వార్డుల రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసి నివేదికను పంచాయతీరాజ్ శాఖ ఎన్నికల కమిషన్‌కు అప్పజెప్పింది. ఎన్నికల నిర్వహణకుగానూ రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లను ప్రకటించింది. దీంతో రెండు, మూడు రోజుల్లో ఎప్పుడైనా ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల కావొచ్చునని పంచాయతీరాజ్ శాఖ అధికారులు ధ్రువీకరించారు. ఆ తర్వాత 23 రోజుల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తిచేసేలా రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసింది. బ్యాలెట్ పేపర్లను, ఎన్నికలకు సంబంధించిన ఇత సామాగ్రిని జిల్లాలకు చేరవేసింది. మొత్తం స్థానాల్లో 5147 స్థానా లను ఓపెన్ కేటగిరి కింద కేటాయించారు. 50 శాతం కోటా కింద 6373 స్థానాలు పూర్తిగా మహిళలకు దక్కనున్నాయి. ఎస్టీలకు 1/70 యాక్టు ప్రకారం 1281, 100 శాతం జనాభా ప్రకారం 1177, రిజర్వే షన్ ప్రకారం 688, మొత్తంగా చూసుకుంటే 3146 సీట్లు దక్కను న్నాయి. ఎస్సీలకు 2113 స్థానాలను ఎన్నికల కమిషన్ కేటాయించింది. రిజర్వేషన్లు, ఓపెన్ కేటగిరిపోనూ బీసీలకు 2345 స్థానాలు మిగల నున్నాయి. అయితే, 12,751గ్రామ పంచాయతీలకు గానూ 12734 స్థానాల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్టు, మిగతా స్థానాల్లో తదితర కారణాల వల్ల ఎన్నికలను ఆపుతున్నట్టు విశ్వసనీయ సమాచారం.

నేడు హైకోర్టు తొలి సీజేగా రాధాకృష్ణన్ ప్రమాణస్వీకారం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ తొట్టతిల్ భాస్కరన్ నాయర్ (టిబిఎన్) రాధాకృష్ణన్ మంగళవారం ఉదయం 8.30 గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ప్రమాణస్వీకారం చేయిస్తారు. ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా రాధాకృష్ణన్ విధులు నిర్వహించారు. ఉమ్మడి హైకోర్టును విభజిస్తూ ఇటీవలే కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. రాధాకృష్ణన్‌ను తెలంగాణ హైకోర్టుకు తొలి ప్రధాన న్యాయమూర్తిగా కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఆయనతోపాటు జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ వి రామసుబ్రమణియన్‌లను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులుగా కేంద్రం ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా ప్రవీణ్‌కుమార్‌ను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నియమించారు. మంగళవారం నుంచి రెండు హైకోర్టులు వేర్వేరుగా కార్యకలాపాలు నిర్వహిస్తాయి.

గుండెల నిండా డబుల్ గూడు


- వేలల్లో అర్జీల వెల్లువ
- 'ఆన్‌లైన్'లోనేఅప్లయ్‌కి ఉన్నతాధికారుల సూచన
- 'మీ సేవ' కేంద్రాల్లో బీదల బారులు

నిరుద్యోగులెందరున్నారో అంతకంటే 'డబుల్' ఇండ్లు లేని బీదలున్నారు. రెండు పడక గదుల ఇంటి పథకానికి బ్రాండ్ అంబాసిడర్ అయిన టీఆర్ఎస్ సర్కారు రెన్యువల్ కావడంతో వారిలో ఆశలు అమాంతం రెట్టింపయ్యాయి. ఇందుకు నిదర్శనంగా ప్రతి సోమవారం ఫిర్యాదులు/ అర్జీల(ప్రజావాణి) దినాన కలెక్టరేట్లలోనూ, అనునిత్యం మీసేవ కేంద్రాల్లోనూ దరఖాస్తు పత్రాలతో పబ్లిక్ బారులు తీరుతున్నారు. అప్లయ్ చేసి, రశీదు చేతిన పడేదాకా ఓ పట్టాన కుదుటగా ఉండలేని ఆరాటం గరీబోళ్లది. రాజధాని హైదరాబాద్‌లోనే కాదు..తెలంగాణ అంతటా గుండెల నిండా డబుల్ బెడ్రూం ఆశలే 'గూడు' కట్టుకున్నాయి. ప్రభుత్వం మానవీయ కోణంలో మనసు పెట్టి చూడాల్సిన అత్యంత ప్రాముఖ్యాంశమైంది. కేసీఆర్, కేటీఆర్‌లపై నమ్మకముందని, ఇవాళ కాకుంటే రేపైనా తమకు ఇండ్లు దక్కుతాయంటూ జనం ఎంతో ఆత్రంగా ఉన్నారు.

ఇల్లెందుల దుర్గాప్రసాద్

'గ్రేటర్' ఏరియాలో ఇప్పటికే సుమారు 3 లక్షల దరఖాస్తులు పరిష్కారానికి వేచి చూస్తున్నాయి. అవి అట్లా ఉండగానే, ప్రతి రోజూ ఈ సేవా, మీ సేవా సెంటర్లలో వందలు, వేలల్లో అర్జీలు వెల్లువెత్తుతున్నాయి. పలువురైతే గతంలో అప్లికేషన్లు సమర్పించి, రెండోసారి అందజేసేందుకు మీ సేవా కేంద్రాల్లోనూ, కలెక్టరేట్లలోనూ క్యూ కడుతున్నారు. అప్లయ్ చేసినోళ్లు మళ్లీ మళ్లీ చేయకూడదనీ, అసలు ఆ అర్జీల పనిమీద కలెక్టరేట్లకు రావొద్దంటూ ఉన్నతాధికారులు పదే పదే విజ్ఞప్తి చేస్తున్నారు. ఎక్కడికక్కడ మీ సేవా కేంద్రాల్లో ఒకసారి మాత్రమే ఆన్‌లైన్‌లో అప్లయ్ చేయాలని సూచిస్తున్నారు. జిల్లా కలెక్టరేట్లలో జనం తాకిడి పెరగడంతో స్వయంగా కలెక్టర్లే స్పందిస్తున్నారు. హైదరాబాద్ కలెక్టర్ రఘునందన్‌రావు దీనిపై ఇటీవల ప్రకటన జారీ చేశారు. తహశీల్దారు, ఆర్‌డీవో, కలెక్టరేట్ల కార్యాలయాలకు ఇందుకోసం రానక్కర్లేదని తెలియజేశారు. ఒకే ఒకసారి మీ సేవా కేంద్రాల్లో అప్లయ్ చేస్తే సరిపోతుందని వెల్లడించారు. అట్లా





దాఖలైన అర్జీలను పరిశీలించి, సీరియల్ నంబరు కేటాయిస్తామని తెలిపారు. తదుపరి ప్రభుత్వ ఆదేశాలను అనుసరిస్తామని వివరించారు. అయినప్పటికీ, తమదాకా ఆ సంగతి చేరని వారు, నమ్మకం కుదరని వాళ్లూ అనేక మంది ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. మరో వంక మీ సేవా కేంద్రాల్లో పొద్దంతా వరుసలో నిలబడుతున్నారు. మహిళా అర్జీదారుల పాస్‌పోర్టు సైజు ఫొటో, రేషన్ సరుకుల జిరాక్సు పత్రం, ఆధార్ ఫొటో కాపీ, అడ్రస్ కోసం కరెంటు బిల్లు వంటి కాపీలను డబుల్ బెడ్రూం అర్జీల వెంట జత చేస్తున్నారు. మీ సేవా ఆపరేటర్లు వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, రశీదులు ఇస్తున్నారు. ఇందుకు నిజానికి రూ. 35 మాత్రమే రుసుం చెల్లించాలి. ఆ రశీదులపై ఈ విషయం స్పష్టంగా ముద్రించి ఉన్నది. కానీ, అనేక సెంటర్లలో డిమాండ్‌ను ఆసరా చేసుకొని ఎక్కువగానే గుంజుతున్నారు. రూ. 5 నుంచి రూ. 50, 70 దాకా అదనంగా వసూలు చేస్తున్నారు. ఇక దళారుల ఆగడాలకైతే అంతే లేదు. ఇండ్లు మంజూరు చేపిస్తామంటూ రూ. వేలల్లో పిండుతున్నారు. అయితే ఈ సంగతి బయటకి చెప్పేందుకు డబ్బులు ముట్టజెప్పిన వాళ్లు ఏమాత్రం ఇష్ట పడడంలేదు. అట్లా చెప్పేస్తే తమకు ఎక్కడ ఇల్లు రాకుండా పోతుందోనని గమ్మున ఉంటున్నారు. ఇట్లాంటి ఆర్థిక పరమైన బరువును మోస్తూనే, ఇంకోపక్క సర్వర్ మొరాయింపులను పంటి బిగువున అదిమిపట్టుకుంటూనే ఇల్లు దక్కితే చాలని నానా తంటాలు పడుతున్నారు. ఈ విధంగా రోజు రోజుకూ వేలల్లో కొత్త అర్జీలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. మహానగర పాలక సంస్థ పరిధిలో వాస్తవానికి 12 వేల ఇండ్ల నిర్మాణం తుది రూపుదాల్చుతున్నది. మరో 90 వేల మేరకు ఆయా దశల్లో ప్రగతిలో ఉన్నట్టు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. హైదరాబాద్ జిల్లాలో ప్రభుత్వ స్థలాల కొరత కారణంగా స్లమ్ ఏరియాల్లోనే అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు కట్టించి ఇవ్వనున్నారు. మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో శివారు ఏరియాల్లో ఇండ్లను కట్టిస్తారు. అయితే లక్షల్లో అర్జీలుండగా, వేలల్లోనే ఇండ్లు అందుబాటులోకి రానున్నాయి. వాటిని లాటరీ పద్ధతిన ఇస్తారా? లేక మరెట్లా కేటాయిస్తారనే విధివిధానాలపై ఇంకా స్పష్టత ప్రభుత్వ స్థాయిలోనే రావాల్సి ఉన్నది.

ప్రభుత్వమా మనసు పెట్టి చూడు!

ప్రభుత్వ పెద్దలపై నమ్మకముంది..



నా భార్య పాత విద్య పేరిట డబుల్ బెడ్రూం ఇంటి కోసం మీ సేవ సెంటర్‌లో అప్లయ్ చేశాను. నాకు సొంత ఇల్లు లేదు. ప్రస్తుతం అద్దె ఇంట్లో ఉంటున్నాను. సేల్స్‌మన్‌గా దినసరి కూలీపై పని చేసే నాకు వచ్చే నామమాత్రపు ఆదాయంలో 65 శాతం ఇంటి కిరాయికే పోతున్నది. అయితే కేసీఆర్, కేటీఆర్‌లపై మా కుటుంబానికి గట్టి నమ్మకమున్నది. డబుల్ బెడ్రూం ఇండ్లు మాలాంటి బీదల దాకా తప్పకుండా వస్తాయనే ఆశతో ఎదురుచూస్తున్నాం. మొన్నటి ఎన్నికల్లోనూ మా వరకైతే సర్కారు ఇల్లు వస్తుందన్న ఆపేక్షతోనే టీఆర్ఎస్‌కు ఓట్లేశాం.

-పాత కిషన్, పంచశీల్, అల్వాల్

పోలీసులకు ఇండ్లు

- ఎఆర్, మహిళా కానిస్టేబుళ్లకూ పదోన్నతులు: ఆత్మీయ సభలో సీఎం చంద్రబాబు



అమరావతి : పోలీసులకు త్వరలో ఇండ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో పోలీస్ కానిస్టేబుళ్లు ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ సివిల్ కానిస్టేబుళ్లలాగా ఎఆర్ కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్ల పదోన్నతికి అడ్డంకిగా ఉన్న జీవో 84ను అధిగమించి, వారికి కూడా పదోన్నతులు కల్పిస్తామన్నారు. పరిశ్రమలు, పెట్టుబడులు రావాలంటే శాంతిభద్రతలు సక్రమంగా ఉండాలని, అందుకు పోలీసుల సహకారం అవసరమని తెలిపారు. ఎప్పటికప్పుడు పోలీసుల ప్రతిష్ట పెంచే బాధ్యత తాను తీసుకుంటానని, అన్ని విధాలా గౌరవాన్ని పెంచుతామని అన్నారు. కానిస్టేబుళ్ల యూనిఫాంను నిక్కర్ నుంచి ఫ్యాంట్‌గా మార్చిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. పోలీసుల్లో వచ్చిన నూతన శక్తితో దేశంలోనే ఎపి పోలీస్ వ్యవస్థ పటిష్టంగా మారుతుందన్నారు. 189 డిఎస్పీ పోస్టులిన సూపర్ న్యూమరీ పోస్టులుగా మారుస్తున్నామన్నారు. అందరికంటే పోలీస్ ఉద్యోగం కష్టమని, పోలీసుల త్యాగాలవల్లే అందరూ ఆనందంగా ఉంటున్నారన్నారు. పోలీస్ కానిస్టేబుల్ కూడా ఐటీ ప్రొఫెషినల్ కావాలని, పోలీసుల్ని నిరంతరం పైకి తీసుకురావాల్సిన అవసరముందని చెప్పారు. పోలీసులకు ఎటువంటి సమస్యలొచ్చినా తన దృష్టికి తీసుకురావాలని డీజీపీకి సూచించారు. ఎస్పీ, డీఐజీ, ఐజీలు కూడా కింది స్థాయి ఉద్యోగులకు గౌరవమివ్వాలని, వారితో మమేకమై కుటుంబ సభ్యుల్లాగా మెలగాలన్నారు. హోం శాఖ మంత్రి చినరాజప్ప మాట్లాడుతూ కొత్తగా తీసుకునే కానిస్టేబుళ్లకు సాంకేతిక శిక్షణ ఇవ్వనున్నామన్నారు.డీజీపీ ఆర్‌పీ ఠాకూర్ మాట్లాడుతూ పోలీసుల్లో స్థాయీ భేదం స్టార్లలోనే ఉందని, అందరూ కుటుంబ సభ్యులేనని అన్నారు. అందరి సహకారంతో పోలీసులకు మరింత సంక్షేమాన్ని కల్పిస్తామన్నారు. ఎఆర్, మహిళా కానిస్టేబుళ్లకు కూడా పదోన్నతి కల్పిస్తే బాగుంటుందని సీఎంను కోరారు. కానిస్టేబుళ్లు సీఎంను గజమాలతో సత్కరించారు. పోలీస్ శాఖకు నూతనంగా కేటాయించిన 1580 వాహనాలను సీఎం ప్రారంభించారు. అంతకు ముందు మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో వంద అడుగుల జాతీయ జెండాను సీఎం ఆవిష్కరించారు. కార్యక్రమంలో హోం శాఖ ముఖ్య కార్యదర్శి ఎఆర్ అనురాధ, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, విజయవాడ నగర సిపి ద్వారకా తిరుమలరావు, ఇంటెలిజెన్స్ చీఫ్ ఎబి వెంకటేశ్వరరావు, పోలీస్ ఉన్నతాధికారులు రవి శంకర్, కిశోర్ కుమార్, సంజయ్, కుమార్ విశ్వజిత్, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, జడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్, మమతలకు ఫోన్

ముస్లిం వర్గాల్లో అభద్రత దేశ సమగ్రతకు మంచిది కాదని, త్రిపుల్ తలాక్ బిల్లును సెలక్ట్ కమిటీకి పంపించడంతో పాటు, సభలో లోతుగా చర్చించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఉండవల్లి గ్రీవెన్స్‌హాల్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలోని అందరికీ ఒకే చట్టం ఉండాలని, ఒక్కో వర్గానికి ఒక్కో చట్టం ఉండకూడదని అన్నారు. ముస్లిం వ్యతిరేక పోకడల్ని బీజేపీ అనుసరిస్తోందని, త్రిపుల్ తలాక్ చట్టానికి వ్యతిరేకంగా బీజేపీయేతర పార్టీలన్నీ ఏకం కావాలని ఇతర పార్టీలకు చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీతో ఈ విషయంపై ఫోన్లో మాట్లాడినట్లు ఆయన తెలిపారు.

కర్నూలుకు మొదటి విమానం



కర్నూలు జిల్లా ఓర్వకల్లు విమానాశ్రయంలో సోమవారం నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది. బేగంపేట విమానాశ్రయం నుంచి మొదటి విమానం ఓర్వకల్లుకు చేరుకుంది. విమానాశ్రయ పనులను ఇంధన, పెట్టుబడుల పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ పర్యవేక్షించారు. ఈ నెల 8న ముఖ్యమంత్రి చంద్రబాబు విమానాశ్రయాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

డెంగ్యూతో బాలుడు మృతి



నవతెలంగాణ-జోగిపేట

డెంగ్యూ బారిన పడి చికిత్స పొందుతున్న బాలుడు హైదరాబాద్ ఆస్పత్రిలో ఆదివారం రాత్రి మృతిచెందాడు. బాలుడి తండ్రి వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణానికి చెందిన బాబాఖాన్ కుమారుడు ఫర్హాన్ (11) నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. తల్లిదండ్రులు జోగిపేటలోని ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు. డాక్టర్లు డెంగ్యూ ఉన్నట్టు నిర్ధారించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే క్రాంతికిరణ్ పరామర్శించారు. ఇటీవల ఎమ్మెల్యే విజయోత్సవ ర్యాలీలో ఆ బాలుడు డ్యాన్స్ చేసిన వీడియో వాట్సాప్‌లో చూసిన స్థానికులు కంటతడి పెట్టుకున్నారు.

ప్రాణాలు తీసిన అతివేగం

- నలుగురు విద్యార్థులు మృతి
- ఒకరి పరిస్థితి విషమం
- ఇద్దరికి గాయాలు



గుంటూరు : షాపింగ్‌కు వెళ్తూ కారు అదుపుతప్పి డివైడర్ ను ఢీకొట్టడంతో నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. గుంటూరు సమీపంలోని లాల్‌పురం వద్ద కలకత్తా-చెన్నయ్ జాతీయరహదారిపై సోమవారం ఈ ఉదంతం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెదకూరపాడు మండలం, కంభంపాడుకు చెందిన చిరుమామిళ్ల సాయిరాం, మండల కేంద్రమైన శావల్యాపురానికి చెందిన గుంటూరు కోటేశ్వరరావు, సాదినేని ధనుష్ (గుంటూరులోని విద్యానగర్), ఎస్‌కె.గఫూర్ (పిడుగురాళ్ల మండలం పిల్లుట్ల), తారక్ హీరేంద్ర (తెనాలి సమీపంలోని వైకుంఠపురం), దొప్పలపూడి కౌశిక్ (ప్రకాశం జిల్లా ఒంగోలులోని ప్రగతినగర్), అల్లా శివాజి (ప్రకాశం జిల్లా మామిళ్లపల్లి) గుంటూరు సమీపంలోని చౌడవరం వద్ద ఆర్‌విఆర్ జెసి ఇంజినీరింగ్ కాలేజీలో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నారు. సోమ వారం కళాశాలకు వచ్చిన వీరు నూతన సంవత్సర వేడుకలు ఎక్కడ నిర్వహించుకోవాలనే దానిపై కొద్దిసేపు చర్చించుకున్నారు. అందులో భాగంగా తొలుత షాపింగ్ కోసమని కారులో గుంటూరు బయలుదేరారు. అయితే విజయవాడ అయితే బాగుంటుందని ఒకరు చెప్పగా సమయం సరిపోదని కొందరు, హైవేపై వేగంగా వెళ్తే సాయంత్రానికి రావొచ్చని వీరిలో ఒకరు చెప్పడంతో కారు వేగాన్ని పెంచారు. లాల్‌పురం వద్దకు రాగానే ముందున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తుండగా అదుపుతప్పిన కారు డివైడర్‌ను ఢీకొట్టింది. అనంతరం ముందుగా వెళ్తున్న గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ వ్యర్థాల వాహనాన్ని (కంపాక్టర్) ఢీకొట్టింది. దీంతో కంపాక్టర్ పల్టీ కొట్టి రోడ్డుపక్కకు పడిపోయింది. ఈ క్రమంలో కారులోని సాయిరాం, కోటేశ్వరరావు, ధనుష్ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానంతరం 20 నిమిషాలకు సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. గాయపడిన నలుగుర్ని గుంటూరు జిజిహెచ్‌కు తరలించగా చికిత్స పొందే క్రమంలో ఎస్‌కె.గఫూర్ మృతిచెందాడు.

తారక్ హీరేంద్రను వారి బంధువులు స్థానిక ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. కౌశిక్, శివాజి పరిస్థితి మెరుగ్గా ఉంది. ఘటనా స్థలిని అర్బన్ ఎస్‌పి విజయరావు పరిశీలించారు. ప్రమాద సందర్భంలో కారు వేగం 160 కిలోమీటర్లున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. బంధువుల రోదనలతో జిజిహెచ్ ప్రాంగణంలో విషాద వాతావరణం నెలకొంది. మృతదేహాలను పోస్టుమార్టం కోసం మార్చురీకి తరలించారు.

'అగస్టా' కుంభకోణంలో సోనియా, రాహుల్

- కాంగ్రెస్ అంటేనే కమీషన్.. కరప్షన్..కలెక్షన్ : లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ అంటేనే కమీషన్..కరప్షన్..కలెక్షన్ అని, సోనియాగాంధీ, మన్మోహన్, రాహుల్‌గాంధీ నేతృత్వంలో కొనసాగిన యూపీఏ ప్రభుత్వం మొత్తం కుంభకోణాల మయంలో కూరుకుపోయిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కె.లక్ష్మణ్ విమర్శించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి దేశ, ప్రజల రక్షణ పట్ల ఏమాత్రం బాధ్యతలేదన్నారు. పంచభూతాలనూ కుంభకోణాల మయంగా మార్చారని, వాళ్ల డీఎన్ఏ లోనే దోపిడి ఉందని ఆరోపించారు. ఇటీవల అగస్టా వెస్ట్ లాండ్ స్కామ్ నిందితున్ని భారత ప్రభుత్వం దేశానికి పట్టి తెచ్చిం దని, ఆయన వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ, సోనియా, రాహుల్ ఇతర నాయకులు బెంబేలెత్తిపోతున్నారని అన్నారు. వాళ్ల ఊచలు లెక్కించే రోజు దగ్గర్లోనే ఉందన్నారు. అగస్టా వెస్ట్‌లాండ్ వీవీఐపీ హెలికాప్టర్ల కొనుగోలులో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఇటలీ కోర్టు విచారణలో తేలిందని, కొంత మందిని అరెస్ట్ చేశారని గుర్తుచేశారు. విచారణ సందర్భంగా పలుమార్లు సోనియాగాంధీ పేరు చర్చకు వచ్చిందని, అగస్టా వెస్ట్ లాండ్ కుంభకోణ నిందితుడు క్రిస్టియన్ మిషల్ కూడా మిస్సెస్ గాంధీ పేరు ప్రస్తావించారని పాటియాలా కోర్టుకు ఈడీ తెలిపిన విషయాన్ని ప్రస్తావించారు. 30 - 32 ఏండ్లుగా దేశంలో జరిగిన కుంభకోణాల్లో అండర్సన్, ఖత్రోచి, క్రిస్టియన్ మిషల్‌లతోని గాంధీ కుటుంబం సబంధం కలిగి ఉన్నదని, దీనికి రాహుల్, సోనియా గాంధీలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీ చింతా సాంబమూర్తి, కార్యదర్శి శ్రీ ఎస్. కుమార్, అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్.ప్రకాష్‌రెడ్డి మీడియా కమిటీ కన్వీనర్ శ్రీ సుధాకర్ శర్మ, సుభాష్ చందర్‌జీ, బాక్రీ తదితరులు పాల్గొన్నారు.

కుట్రలకు, మోసాలకు కేరాఫ్ చంద్రబాబు

ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నవతెలంగాణ-క్లాక్‌టవర్

కుట్రలకు, మోసాలకు కేరాఫ్ ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అనీ, ఆయన దొంగ నాటకాలను దేశ ప్రజలంతా గమనిస్తున్నారనీ ఎంపీ, రైతు సమన్వయ సమితీ రాష్ట్ర చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని తన నివాసంలో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి సోమవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. చంద్రబాబు గురించి సీఎం కేసీఆర్ మాట్లాడే ప్రతిమాటా సరైనదన్నారు. మొన్నటి తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చంద్రబాబు డబ్బులివ్వలేదని తిరుపతి వెంకన్న స్వామిపై ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోడీని కేసీఆర్ కలిస్తే చంద్రబాబు అవహేళనగా మాట్లాడడం తగదన్నారు. హైకోర్టు విభజన చంద్రబాబుకు ఇష్టం లేదన్నారు. అందుకే ఇన్ని రోజులు అడ్డుకున్నారన్నారు. ఏపీ మంత్రులు తలాతోక లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. కులాలను అడ్డంపెట్టుకుని చంద్రబాబు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్, టీడీపీలు నాటకాలు ప్రారంభించాయన్నారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో 16 సీట్లు టీఆర్ఎస్ కైవసం చేసుకొని దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించనున్నట్టు జోస్యం చెప్పారు.

మహిళా గురుకుల డిగ్రీ లెక్చరర్ల భర్తీలో జాప్యం

- టీఎస్‌పీఎస్సీని ముట్టడించిన ఎంపికైన అభ్యర్థులు
- త్వరగా నియామకాలు చేపట్టాలని డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మహిళా గురుకుల డిగ్రీ లెక్చరర్ల భర్తీ ప్రక్రియలో జాప్యం జరుగుతోందని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యాలయాన్ని సోమవారం ఎంపికైన అభ్యర్థులు ముట్టడించారు. మానవతా దృక్పథంతో అర్థం చేసుకొని త్వరగా నియామకాలు చేపట్టాలని టీఎస్‌పీఎస్సీని పలువురు అభ్యర్థులు డిమాండ్ చేశారు. నియామక ఉత్తర్వుల కోసం ఎదురుచూస్తున్నామని అన్నారు. నియామకాల ప్రక్రియ ఆలస్యం అవుతుండడంతో మనోవేదన చెందుతున్నామని చెప్పారు. 2017 జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మహిళా గురుకుల డిగ్రీ లెక్చరర్ల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదలైందని అన్నారు. ప్రిలిమినరీ పరీక్ష 2017, సెప్టెంబర్ 10న నిర్వహించారనీ, 2018, జనవరిలో ఫలితాలు విడుదల చేశారనీ వివరించారు. మెయిన్స్ రాపరీక్షను 2018, మేలో నిర్వహించారనీ చెప్పారు. ఆగస్టులో ఫలితాలు విడుదల చేశారనీ, సెప్టెంబర్‌లో ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేశారనీ అన్నారు. నవంబర్‌లో 1:2 నిష్పత్తిలో మౌఖిక పరీక్షలు నిర్వహించారనీ చెప్పారు. ఇంటర్వ్యూలను నవంబర్ 8 నుంచి నవంబర్ 14వ తేదీ వరకు జరిగాయని వివరించారు. జోన్లవారీగా ఆయా సబ్జెక్టులకు తుది జాబితాను నవంబర్ 24న విడుదల చేశారనీ అన్నారు. నెలరోజులు దాటినా నియామక ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో ఆవేదన చెందుతున్నామని చెప్పారు. అనంతరం టీఎస్‌పీఎస్సీ అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా గురుకుల డిగ్రీ లెక్చరర్ల పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ అధికార ప్రతినిధిగా దాసోజు శ్రవణ్

- ఓయూ నుంచి ఢిల్లీదాకా రాజకీయ ప్రస్థానం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ముఖ్య అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ ఏఐసీసీ అధికార ప్రతినిధిగా నియమించారు. సోమవారం ఈమేరకు ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఉస్మానియా యూనిర్సిటీలో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభి ఢిల్లీ స్థాయికి ఎదిగారు. అనేక ప్రజా ఉద్యమాల్లోనూ, ప్రత్యేకంగా తెలంగాణ ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించారు. ఇటీవల ఆయన ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. బీసీ రిజర్వేషన్లు, గతంలో ప్రభుత్వం వెబ్‌సైట్ల మూసివేతపై కోర్టుకు వెళ్లి విజయం సాధించారు. నీటిపారుదల, భూనిర్వాసితులు, విద్యుత్ సమస్యలు, దళితులపై దాడులు తదితర అంశాలపై ఆయన లోతుగా అధ్యయనం చేసి ప్రజా చైతన్య కార్యక్రమాలు చేపట్టారు. ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీ, యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీతోపాటు ఇతర జాతీయ నాయకుల ప్రసంగాలను ఆయన అనువాదం చేసి జాతీయనేతల దృష్టిని ఆకర్షించారు. ప్రొఫెసర్‌గా, హిటాచీ కన్సల్టింగ్, సత్యం కంప్యూటర్స్‌లో హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్‌గా పని చేశారు. 'బెటర్ పాలిటిక్స్ ఫర్ బెటర్ సొసైటీ' కోసం ఆయన రాజకీయాల్లోకి వచ్చానని పలు సందర్భాల్లో చెప్పారు. ప్రజారాజ్యం పార్టీ, టీఆర్ఎస్ పార్టీల్లోనూ కీలకపాత్ర పోషించారు. టీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో విభేదించి ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. నీళ్లు, నిజాలు, విద్యుత్ సమస్యలు, కాగ్ నివేదిక, రైతు సమస్యలపై ఆయన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి, టీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా దాసోజు మాట్లాడుతూ అనతికాలంలోనే తన పనితనాన్ని గుర్తించి ఏఐసీసీలో పని చేసే అవకాశం కల్పించిందుకు ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్ గాంధీ, కొప్పుల రాజు, రాష్ట్ర నాయకులకు తదితరులకు ఆయన కతజ్ఞతలు తెలిపారు.

బంగ్లా ఎన్నికల్లో 'హసీనా' గెలుపు

288 పార్లమెంట్ స్థానాల్లో అధికార అవామీలీగ్ కూటమి జయకేతనం

- హసీనాకు 2,29,539 ఓట్లు... సమీప ప్రత్యర్థికి 123 ఓట్లు
- ఫలితాలను తిరస్కరించిన ప్రతిపక్షం

ఢాకా: బంగ్లాదేశ్ ఎన్నికల్లో ప్రధాని షేక్ హసీనా పార్టీ అవామీలీగ్ ఘన విజయం సాధించింది. అవామీ లీగ్ కూటమి 288 చోట్ల జయకేతనం ఎగురవేసింది. దీంతో, హసీనా రికార్డు స్థాయిలో నాలుగోసారి ప్రధాని పీఠాన్ని దక్కించుకున్నారు. ప్రతిపక్ష బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్పీ) కూటమి కేవలం 8 స్థానాలకే పరిమితమైందని ఎన్నికల సంఘం సెక్రెటరీ హెలాలుద్దీన్ అహ్మద్ తెలిపారు. బంగ్లాదేశ్‌లో మొత్తం 300 నియోజకవర్గాలున్నాయి. ఓ అభ్యర్థి మరణంతో ఒక స్థానంలో ఎన్నిక వాయిదా పడింది. దీంతో, 299 స్థానాలకు ఆదివారం ఎన్నికలు జరిగాయి. ఫలితాల్లో అధికార అవామీ లీగ్ పార్టీ 268 చోట్ల విజయం సాధించింది. అవామీ లీగ్ కూటమి పార్టీ అయిన జాతీయ పార్టీ 20చోట్ల గెలుపొందింది. స్వతంత్ర్య అభ్యర్థులు మూడు చోట్ల గెలుపొందారు. గోపాల్ గంజ్ స్థానం నుంచి పోటీ చేసిన ప్రధాని షేక్ హసీనాకు 2,29,539 ఓట్లు వచ్చాయి. ఆమెపై పోటీ చేసిన బీఎన్పీ అభ్యర్థి ఎస్ఎం జిలానీకి కేవలం 123 ఓట్లు మాత్రమే రావడం గమనార్హం. ఇస్లామి బంగ్లాదేశ్ ఆందోళన్ అభ్యర్థి ఎండీ మారూఫ్‌కు 71 ఓట్లు, మిగతా వారికి కేవలం 14 ఓట్లు వచ్చాయి. 2008లోనూ అవామీ పార్టీ మూడో వంతు మెజారిటీ సాధించింది. అవామీ విక్టరీతో ఖలీదాకు చెందిన బీఎన్పీ పార్టీ ఘోర పరాజయాన్ని చవిచూసింది.హసీనా మొదటిసారి 1996లో ప్రధాని అయ్యారు. ఆ తర్వాత మళ్లీ 2014లో ఆమె ప్రధాని పదవి చేపట్టారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఖలీదా జియా జైలుశిక్ష అనుభవిస్తున్నారు. దీంతో బీఎన్పీ పార్టీ దారుణంగా విఫలమైంది. 20 సీట్లు సాధించిన జతియా పార్టీ ఇప్పుడు పార్లమెంట్‌లో ప్రతిపక్ష హోదా దక్కించుకోనుంది. ప్రస్తుతం ఉన్న పార్లమెంట్‌లో ఆ పార్టీనే ప్రధాన ప్రతిపక్షంగా మారింది.



విజయం సాధించిన షేక్ హసీనా ఎవరు?

బంగ్లాదేశ్ పాలక పార్టీ అవామీ లీగ్ నాయకురాలు, ప్రధానమంత్రి షేక్ హసీనా వాజెద్ బంగ్లాదేశ్ జాతిపితగా పిలిచే షేక్ ముజిబుర్ రెహ్మాన్ కుమార్తె. హసీనా 2014లో మూడోసారి ప్రధాని పదవిని చేపట్టారు. ఆమెకు 71 సంవత్సరాలు. 1960ల్లో ఢాకా విశ్వవిద్యాలయంలో ఉన్నప్పుడే హసీనా రాజకీయాల్లో చురుగ్గా ఉండేవారు. 1968లో ప్రముఖ శాస్త్రవేత్త ఎంఏ వాజెద్ మియాను హసీనా వివాహం చేసుకున్నారు. ముజిబుర్ రెహ్మాన్ బంగ్లాదేశ్‌కు తొలి అధ్యక్షుడు. అధ్యక్ష పదవి చేపట్టిన కొన్ని నెలలకే 1975, ఆగస్టు15న ముజిబుర్ రెహ్మాన్ హత్యకు గురయ్యారు. ఆయనతోపాటు, హసీనా తల్లిని, ముగ్గురు సోదరులను పలువురు సైనికాధికారులు ఇంట్లోనే హత్య చేశారు. ఈ హత్యలు జరిగినప్పుడు ఆమె బంగ్లాదేశ్‌లో లేరు. అప్పట్లో హసీనా ఆరేండ్లు ప్రవాసంలో ఉన్నారు. ఆ సమయంలోనే అవామీ లీగ్ నాయకత్వ బాధ్యతలు చేపట్టారు. 1981లో ఆమె బంగ్లాదేశ్ తిరిగివచ్చాక రాజకీయాల్లో కీలక నాయకురాలయ్యారు. ఆ సమయంలో కొన్నిమార్లు గృహనిర్బంధానికి గురయ్యారు. 1990 డిసెంబర్‌లో ప్రజల ఒత్తిడికి తలొగ్గిన బంగ్లాదేశ్ చివరి సైనిక పాలకుడు లెఫ్టినెంట్ జనరల్ మొహమ్మద్ ఎర్షాద్ రాజీనామా చేశారు. 1991లో జరిగిన ఎన్నికల్లో షేక్ హసీనా పార్టీకి మెజారిటీ లభించలేదు. ఆమె ప్రత్యర్థి ఖలీదా జియా నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్పీ) గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత ఐదేండ్లకు 1996లో జరిగిన ఎన్నికల్లో అవామీ లీగ్ విజయం సాధించటంతో హసీనా తొలిసారి ప్రధానమంత్రి అయ్యారు.

హసీనా రాజకీయ ప్రస్థానం...

- **1996 జూన్ ఎన్నికల్లో అవామీ లీగ్ విజయం సాధించగా, హసీనా ప్రధానమంత్రి అయ్యారు.**
- **2001 అక్టోబరులో ఎన్నికల్లో ఖలీదా జియా నేతృత్వంలోని బీఎన్పీ, మూడు సంకీర్ణ భాగస్వామ్య పక్షాల చేతిలో అవామీ లీగ్ ఓడిపోయింది.**
- **2004 ఆగస్టులో దేశ రాజధాని ఢాకాలో అవామీ లీగ్ ర్యాలీపై గ్రెనేడ్ దాడి జరిగింది. ఈ ఘటనలో 22 మంది మృతి చెందారు. హసీనా ఈ ప్రమాదం నుంచి బయటపడ్డారు.**
- **2008 డిసెంబరులో సార్వత్రిక ఎన్నికల్లో 300 స్థానాలకుగానూ 250కి పైగా స్థానాల్లో హసీనా సారథ్యంలోని అవామీ లీగ్ జయకేతనం ఎగురవేసింది.**
- **2009 జనవరిలో ప్రధానిగా హసీనా ప్రమాణం.**
- **2014 జనవరిలో సార్వత్రిక ఎన్నికలను బహిష్కరించిన బీఎన్పీ. ఎన్నికల్లో అవామీ లీగ్ విజయం, మూడోసారి ప్రధానిగా హసీనా బాధ్యతల స్వీకారం.**
- **బీఎన్పీ అధినేత ఖలీదా జియా ప్రస్తుతం జైల్లో ఉన్నారు. అవినీతి అభియోగాల కారణంగా ఎన్నికల్లో పోటీచేయకుండా ఆమెపై అనర్హత ప్రకటించారు. ఖలీదాపై ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమైనవని ఆమె మద్దతుదారులు విమర్శిస్తున్నారు.**
- **బంగ్లా ఎన్నికల ఫలితాలను ప్రతిపక్ష బీఎన్పీ కూటమి తిరస్కరించింది. 'ఈ ఫలితాలను మేం అంగీకరించట్లేదు. తటస్థమైన ఆపద్ధర్మ ప్రభుత్వం నేతృత్వంలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి. చిట్టగాంగ్‌లోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద పోలింగ్ ప్రారంభం కాకముందే బ్యాలెట్ బాక్సులు నిండిపోయాయి. ఈ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా రిగ్గింగ్ జరిగింది. ఈ ఎన్నికలను రద్దు చేసి మరోసారి ఎన్నికలు నిర్వహించాలి' అని బీఎన్పీ కన్వీనర్ కమల్ హొస్సైన్ డిమాండ్ చేశారు. ఆదివారం బంగ్లాదేశ్ వ్యాప్తంగా సాధారణ ఎన్నికలు జరిగాయి. లింగ్‌లో పలు చోట్ల హింసాత్మక ఘటనలు చెలరేగాయి. ఈ అల్లర్లలో 17 మంది మృతి చెందారు. 200మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువ మంది అధికార పార్టీ కార్యకర్తలే ఉన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం భారీగా బలగాలు మోహరించాయి.**


ఫిలిప్పీన్స్‌లో భారీ వర్షాలు

- 68కి చేరిన మృతుల సంఖ్య

మనీలా : ఫిలిప్పీన్స్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతుండటంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వరదల్లో చిక్కుకొని మృతి చెందిన వారి సంఖ్య సోమవారం నాటికి 68కి చేరుకుందని అధికారులు తెలిపారు.12 మంది గాయపడ్డారు. వందలాది మంది గల్లంతయ్యారు. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగపడ్డాయి. రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. దీంతో, విద్యుత్ వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వరద ప్రవాహంలో వందలాది వాహనాలు కొట్టుకొనిపోయాయి. కాగా, ఫిలిప్పీన్స్‌లో ప్రతిఏడాది 20 తుఫానులు సంభవిస్తుంటాయి. భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటంతో ఇక్కడి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2013నవంబర్‌లో హయాన్ తుఫాను సంభవించడంతో 6300 మంది మృతి చెందారు. తుఫాను కారణంగా 40 లక్షల మంది నిరాశ్రయులయ్యారు.



బూటకంగా మారిన ఎన్నికలు



- బంగ్లా ప్రతిపక్షం విమర్శ

ఢాకా: అక్రమాలతోనే ఎన్నికల్లో బంగ్లా ప్రధాని షేక్‌హసీనా విజయం సాధించారని ప్రతిపక్ష జాతీయ ఒకీయ ఫ్రంట్ విమర్శించింది. ప్రతిపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్పీ) నేతృత్వంలోని ఈ ఫ్రంట్ నేత కమాల్ హుస్సేన్ సోమవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలను తాము తిరస్కరిస్తున్నామని ప్రకటించారు. హసీనా ప్రభుత్వాన్ని రద్దు చేసి తాత్కాలిక ప్రభుత్వ ఆధ్వర్యంలో పార్లమెంట్‌కు తాజాగా ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. అధికార పార్టీ కార్యకర్తలు ఈ ఎన్నికల్లో విస్తృత స్థాయిలో అక్రమాలకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. పోలింగ్ ఏజెంట్లను తరిమివేయటం, బ్యాలెట్‌ల రిగ్గింగ్, తమ మద్దతుదారులను బెదిరించటం వంటి అక్రమాలతో హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ విజయం సాధించిందన్నారు. అధికార పార్టీ శ్రేణులు రిగ్గింగ్‌కు పాల్పడటంతో దాదాపు 100 మందికి పైగా ప్రతిపక్ష అభ్యర్థులు ఎన్నికల బరి నుంచి తప్పుకున్నారని ఆయన వివరించారు. బంగ్లాదేశ్‌లో ఏకపక్ష ప్రభుత్వం వున్నంత కాలం స్వేచ్ఛగా, న్యాయంగా ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదన్న విషయాన్ని ఆదివారం నాటి ఎన్నికల ప్రక్రియ మరోసారి నిరూపించిందని ఈ మీడియా సమావేశంలో మాట్లాడిన బీఎన్పీ ప్రధాన కార్యదర్శి మీర్జా ఫక్రుల్ ఇస్లామ్ అలంగీర్ విమర్శించారు.


కొట్టిపారేసిన అవామీలీగ్

అయితే ప్రతిపక్షం చేసిన ఆరోపణలను హసీనా నేతృత్వంలోని అవామీలీగ్ కొట్టిపారేసింది. ఎన్నికల్లో గెలవలేని ప్రతిపక్షం తమపై తప్పుడు ఆరోపణలు చేస్తోందని అవామీ లీగ్ నేత అబ్దుర్‌రెహ్మాన్ మరో మీడియా సమావేశంలో మండిపడ్డారు. ఎన్నికల్లో గత ఎన్నికలన్నింటికన్నా తక్కువ స్థాయిలో హింస జరిగిందని ఆయన వివరించారు.

బలగాల ఉపసంహరణపై తర్జనభర్జన

వాషింగ్టన్ : సిరియా నుంచి అమెరికా బలగాల ఉపసంహరణపై తర్జనభర్జన పడుతున్నామని రిపబ్లికన్ పార్టీ సెనేటర్ గ్రాహమ్ లిండ్సే తెలిపారు. సిరియా నుంచి అమెరికా భద్రతా బలగాలను వెనక్కి పిలిపించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతవారం ఆదేశించిన సంగతి తెలిసిందే. కాగా, ట్రంప్ నిర్ణయం పట్ల తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అమెరికా రక్షణ మంత్రి జిమ్ మాట్టిస్ సహా పలువురు మంత్రులు క్యాబినెట్ నుంచి వైదొలిగారు. సిరియా నుంచి అమెరికా బలగాలు వెనక్కి వచ్చినట్టయితే ఐఎస్ సహా పలు ఉగ్రసంస్థలు పుంజుకునే ప్రమాదముందని గ్రాహమ్ లిండ్స్ అభిప్రాయపడ్డారు.

'ఖషోగ్గి' మృతదేహాన్ని ముక్కలు చేసి..



అంకారా: సౌది జర్నలిస్ట్ జమాల్ ఖషోగిని హత్య చేసిన తర్వాత మృతదేహాన్ని ముక్కలుగా నరికి వాటిని ఆయన ఇంటికి తరలిస్తున్న వీడియో ఒకటి ఇప్పుడు బయటకు వచ్చింది. టర్కీకి చెందిన సీ-టీవీ ఈ సీసీటీవీ ఫుటేజ్‌ను విడుదల చేసింది. ముగ్గురు వ్యక్తులు ఐదు సూట్‌కేసులు, నల్లటి కవర్లను పట్టుకొని ఖషోగ్గి ఇంట్లోకి వెళ్తున్న వీడియోను ఈ చానెల్ బయటపెట్టింది. ఆ సూట్‌కేసులు, కవర్లలో ఉన్నది ఖషోగి శరీర భాగాలేనని ఆ చానెల్ వెల్లడించింది. ఖషోగి ఇల్లు సౌదీ కాన్సులేట్‌కు దగ్గర్లోనే ఉంది. వాషింగ్టన్ పోస్ట్ పత్రికకు పనిచేస్తున్న ఖషోగ్గిని అక్టోబర్2న సౌదీ కాన్సులేట్‌లోనే దారుణంగా హత్య చేశారు. ఆ తర్వాత మృతదేహాన్ని ముక్కలుగా చేసి యాసిడ్‌లో కరిగించినట్లు వార్తలు వెలువడ్డాయి. అతని హత్య కోసమే 15 మంది సౌదీలు ఇస్తాంబుల్ వెళ్లారు. ఖషోగ్గి మృతదేహం కోసం టర్కీ అధికారులు సౌదీ కాన్సులేట్‌తోపాటు అతని ఇంట్లోనూ వెతికినా దొరకలేదు. నిజానికి సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మానే.. ఖషోగిని హత్య చేయించాడన్న ఆరోపణలు వచ్చినా.. సౌదీ మాత్రం ఖండించింది.

మోడీ పదవికి గండి?

మార్చాలంటూ కార్యకర్తల పట్టు


- విస్తృతస్థాయి సమావేశానికి ఒత్తిడి
- ఓటమిపై సీనియర్ల ఆగ్రహం
- బాధ్యత వహించాలని బహిరంగ వ్యాఖ్యలు
- బీజేపీకి దూరమవుతున్న మిత్రులు
- మహారాష్ట్రలో శివసేన చేతులెత్తేసినట్టే..

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి


ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోవడం నరేంద్రమోడీ పదవికి గండి పడేలా ఉంది. రాష్ట్రాల్లో ఓటమికీ, లోక్‌సభ ఎన్నికలకు సంబంధం లేదని 2019 ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థిగా మోడీనే ఉంటారని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ప్రకటించినా ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు మాత్రం అంగీకరించడం లేదు. 'ఇక చాలు మోడీ సేవలు కొత్త వ్యక్తిని తీసుకొస్తే మంచిది అంటూ' ఆర్ఎస్ఎస్‌కు సీనియర్ నేతలు, హిందూత్వసంస్థలు లేఖలు రాసినట్టు తెలిసింది. 10, 15 ఏండ్లుగా అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఓడిపోతే, మోడీ చరిష్మా ఏమైనట్టు అని ప్రశ్నిస్తున్నారు. గట్టి పట్టున్న రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఓడిపోతే, మిగతా రాష్ట్రాల్లో ఏ రకంగా ప్రజల మద్దతు కూడగట్టడం సాధ్యమవుతుందని నేతలు ఆందోళనగా ఉన్నారు. 2014 ఎన్నికలకు ముందు ప్రధాని అభ్యర్థిగా మోడీని ప్రకటించడం కోసం సమావేశం నిర్వహించినట్టుగా ఈ ఎన్నికల కోసం కూడా పార్టీ నేతలందరితో కలిపి విస్తృతస్థాయి సమావేశం పెట్టాలని అమిత్‌షాపై ఒత్తిడి పెంచుతున్నారు.

ఎన్నికల్లో ఓటమిపై సమీక్షించకుండా తప్పంతా రాష్ట్ర నాయకత్వంపై వేయడం తప్పించుకోవడమే అవుతుందని అభిప్రాయపడ్డారు. ఓటమికి బాధ్యత వహించాలని నితిన్‌గడ్కరీ లాంటి సీనియర్ నేతలు పరోక్షంగా వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ విధానాలే ప్రజా వ్యతిరేకంగా మారాయని, దీనికి ఇంకొకరిని నిందించడం సరికాదంటున్నారు. మోడీ ఏనాడూ పార్టీ నేతలకు అందుబాటులో ఉండలేదనీ, ఢిల్లీలో ఉన్న పార్టీ కార్యాలయానికి రాలేదని, అలాంటప్పుడు ఎన్నికల సమయంలో కార్యకర్తలకు ఎలాంటి భరోసా ఇవ్వాలని పలువురు ఎంపీలు వ్యాఖ్యానిస్తున్నారు. ఎన్డీఏ కూటమి నుంచి మిత్రులు ఒక్కొక్కరు దూరం కావడం బీజేపీ నేతల్లో భయం పట్టుకుంది. మహారాష్ట్రలో శివసేన దాదాపు దూరమైనట్టేనని తెలుస్తోంది. సంపూర్ణ అధికారం కోసం 2014 ఎన్నికల్లో తమను పట్టించుకోలేదనీ, ఇప్పుడు ఆ అధికారం దూరం కానుండడంతో తమను దగ్గర చేసుకునేందుకు బీజేపీ ఉవ్విళ్లూరుతున్నారని తన అధికార పత్రి సామ్నాలో శివసేన పేర్కొంది.

మహారాష్ట్రలో శివసేనతో కలిసి పోటీ చేస్తామని అమిత్‌షా ప్రకటించినా ఆ పార్టీ నేతలు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. పూర్తి అధికారం ఉన్నప్పుడు రామాలయం నిర్మాణం గురించి మాట్లాడని మోడీ, మళ్లీ గెలిపించడని ఎలా ఓట్లు అడుగుతారని ప్రశ్నిస్తు న్నారు. రామాలయం నిర్మాణం కోసమే బీజేపీకి మద్దతిచ్చామని, అదె లేనప్పుడు ఇంకెందుకని బ్రాహ్మణులు ఆర్ఎస్ఎస్‌కు తెగేసి చెప్పినట్టు తెలిసింది. అన్ని వైపుల నుంచి మూకు మ్మడి దాడితో ఆర్ఎస్ఎస్ కూడా పునరాలోచనలో పడిందన్న ప్రచారం జరుగుతున్నది.



(ఫైల్)



మిత్రులు దూరం...దూరం..

2019 ఎన్నికల్లో బీజేపీ ఓడిపోతుందన్న ప్రచారంతో ఎన్డీఏకి మిత్రులు ఒక్కొక్కరు దూరమవుతున్నారు. మహారాష్ట్రలో వెన్నుదన్నుగా నిలిచే శివసేన బీజేపీపై కారాలు మిరియాలు నూరుతున్నది. వచ్చే ఎన్నికల్లో కలిసే పోటీ చేసే ప్రసక్తే లేదన్నట్టు ఆ పార్టీ నేత ఉద్ధవ్ థాక్రే చెబుతున్నారు. నేషనల్ డెవలప్‌మెంట్ అలయెన్స్‌తో అధికారం పంచుకున్న సిక్కింలో మిత్రపక్ష పార్టీ సిక్కిం డెమోక్రటిక్ ఫోరం రాంరాం చెప్పడానికి సిద్ధమైంది. మోడీ చరిష్మా మసకబారిందని సిక్కిం డెమొక్రటిక్ ఫోరం ఎంపీ వ్యాఖ్యానించారు. రైతులను పట్టించుకోకుండా కార్పోరేట్ కంపెనీలకు సహకరించడం వల్లే ప్రజలు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. పంజాబ్ లో ఉన్న మిత్ర పక్షం కూడా ఇదే స్థితిలో ఉంది. తమిళనాడులో అన్నాడిఎంకే మద్దతు కోసం తహతహ లాడుతున్నా ఆ పార్టీ పట్టించుకోని పరిస్థితిలో ఉంది. బీహార్‌కు చెందిన ఆర్ఎస్ఎస్పీ తరపున కేంద్రమంత్రి ఉపేంద్ర కుష్వాహా ఎన్డీఏకు గుడ్‌బై చెప్పేశారు. యూపీకి చెందిన అప్నాదళ్(ఎస్)కు చెందిన కేంద్రమంత్రి అనుప్రియా పటేల్ కూడా బీజేపీతో తెగతెంపులు చేసుకోవాలనుకుంటున్నది. ఆమెకు యూపీమంత్రి రాజ్‌భర్ కూడా మద్దతు ఇవ్వటంతో..బీజేపీ అధిష్టానానికి మింగుడు పడటంలేదు. ఇక బీహార్

నితీశ్ కుమార్ పార్టీ, లోక్‌జన శక్తి పార్టీ (ఎల్‌జేపీ)ని పోకుండా జాగ్రత్తపడింది. ప్రతి రాష్ట్రంలోనూ బీజేపీకి గడ్డుకాలం ఎదురవుతుండటంతో.. ఆయా రాష్ట్రాల్లో చివరిదాకా మద్దతుగా ఎవరు నిలుస్తారా? అన్నది చెప్పడం కష్టమే.

నదుల ప్రక్షాళణకు ప్రణాళిక

సీఎస్ జోషి ఆదేశం

- ఎన్జీటీ ఉత్తర్వులతో కదిలిన యంత్రాంగం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో నదుల ప్రక్షాళణకు నిర్దుష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి ఆదేశించారు. నీటిపారుదల, కాలుష్య నియంత్రణ మండలి, జలమండలి, పురపాలక, పరిశ్రమల శాఖల అధికాలరులతో సోమవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో సీఎస్ మాట్లాడుతూ ఎన్జీటీ ఆదేశాల ప్రకారం జనవరి 15 లోగా నివేదిక తయారు చేయాలన్నారు. రాష్ట్రంలోని నదులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని క్రోడీకరించి జాతీయ పర్యావరణ ఇంజినీరింగ్ పరిశోధన సంస్థ (నీరి)కి ఐదవ తేదీ లోగా పంపాలని ఆదేశించారు. రాష్ట్ర వాటర్‌షెడ్ మ్యాప్ తయారు చేయాలని, దీర్ఘకాలిక ప్రాతిపదికన రాష్ట్రంలో పరిశుభ్రతకు సంబంధించి చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ ప్రదేశాల్లో నదుల కాలుష్యాన్ని అరి కట్టటానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో నీటి కాలు ష్యాన్ని అరికట్టటానికి రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చర్యలు తీసు కోవాలని, నదుల్లో నీటి పరిమాణంపై నీటిపారుదల శాఖ ఎప్పటికప్పుడు అధ్యయనం చేయాలని కోరారు. మురుగు నీటిని శుభ్రం చేసి నదుల్లోకి పంపే విధంగా నీటి శుద్ధి ప్లాంట్‌లను ఏర్పాటు చేయాలని కాలుష్య నియం త్రణ మండలిని జోషి ఆదేశించారు. 'నీరి' పంపిన ముసాయిదా నివేదికపై చర్చించటానికి మరోమారు సమావేశమవ్వాలని నిర్ణయించారు. ఈ సమా వేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, ముఖ్య కార్యదర్శులు అర్వింద్‌కుమార్, జయేశ్ రంజన్, మెట్రో వాటర్ వర్క్స్ ఎండీ దాన కిశోర్, కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, నీటిపారుదల శాఖ ఈఎన్సీ మురళీధరరావు తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని ఇద్దరు యువకులు మృతి

నవతెలంగాణ-జోగిపేట

ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతిచెందారు. సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం అన్నాసాగర్ కట్ట రోడ్డుపై సోమవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. జోగిపేట ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం బాచుపల్లికి చెందిన నరేందర్(22), ప్రభు (21)లు బైక్‌పై అన్నాసాగర్ కట్ట మీదుగా వెళ్తున్నారు. అదే సమయంలో రాంసానిపల్లి వైపు నుంచి జోగిపేటకు వెళ్తున్న సంగారెడ్డి డిపో బస్సు బైక్‌ను ఢీకొట్టింది. ఆ ఇద్దరు యువకులు బస్సు ముందు టైర్ల కింద పడటంతో నరేందర్ అక్కడికక్కడే మృతిచెందాడు. కొన ఊపిరితో ఉన్న ప్రభును జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి మరణించాడు. సమాచారం అందుకున్న సీఐ తిరుపతిరాజు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

మద్యం మత్తులో భార్యకు నిప్పు

- కిరోసిన్ పోసి నిప్పంటించిన భర్త

నవతెలంగాణ-బీర్కూర్

మద్యం మత్తులో తన భార్య ఒంటిపై కిరోసిన్ పోసి నిప్పంటించాడో భర్త. తీవ్ర గాయాలపాలైన ఆమె పరిస్థితి విషమించి మరణించింది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఎస్ఐ పూర్ణేశ్వర్ వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన మెరిగె లక్ష్మి (35) ఆమె భర్త అశోక్ మద్యానికి బానిసయ్యాడు. నిత్యం తాగొచ్చి లక్ష్మితో గొడవపడేవాడు. ఆదివారం రాత్రి కూడా మద్యం తాగివచ్చి భార్యతో అర్ధరాత్రి వరకూ గొడవపడ్డాడు. కుమారుడు అడ్డుపడినా నెట్టేసి భార్య ఒంటిపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. తీవ్ర గాయాలపాలైన ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. సీఐ మధుసూదన్ సిబ్బందితో కలిసి సోమవారం ఉదయం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అశోక్‌ను అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియాస్పత్రికి తరలించారు.

ఈవీఎంలు, రైతు బంధు పథకం..!

ఆ రెండే కాంగ్రెస్ కొంప ముంచాయి

- తక్కువ ఓట్లతో ఓడిపోయిన అభ్యర్థుల మనోగతం
- రాష్ట్రపతికి ఫిర్యాదు చేయాలని నిర్ణయం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎన్నికల్లో పార్టీ ఓడిపోవడానికి ఈవీఎంలు, రైతు బంధు పథకాలే కారణమంటూ తక్కువ ఓట్లతో ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులు అభిప్రాయపడ్డారు. ఈ రెండే కాంగ్రెస్ పార్టీని కొంపముంచాయని వివరించారు. ఈవీఎంలపై న్యాయపోరాటం చేయడంతోపాటు రాష్ట్రపతి, కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. సోమవారం హైదరాబాద్ గోల్కొండ హోటల్‌లో రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి రామచంద్రకుంతియా, టీపీసీసీ అధ్యక్షులు ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తక్కువ ఓట్లతో ఓడిపోయిన అభ్యర్థుల అభిప్రాయాలను తీసుకున్నారు.

వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఈవీఎంలపై న్యాయ పోరాటం చేయాలని నిర్ణయించారు. ముఖ్యంగా టీఆర్ఎస్ అధికార దుర్వినియోగం చేయడంతోపాటు ధన ప్రవాహన్ని పారించిందని ఓడిపోయిన అభ్యర్థులు కుంతియాకు వివరించారు. అనంతరం కుంతియా విలేకరులతో మాట్లాడుతూ పంచాయితీ ఎన్నికలపై చర్చించామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని విమర్శించారు. రాష్ట్రంలో 22 లక్షల ఓట్లు గల్లంతయ్యాయని, అందుకు ఎన్నికల ప్రధానాధికారి రజత్ కుమార్ క్షమాపణ కోరారని గుర్తు చేశారు. ఈసీ వ్యాఖ్యలు ఈవీఎంల అవకతవకలకు అద్దంపడుతున్నాయని ఆరోపించారు. ఈవీఎంల ట్యాపరింగ్ జరిగిందన్నారు. పోలింగ్, కౌంటింగ్ ఓట్లలో చాలా వ్యత్యాసం ఉందన్నారు. పోలింగ్ రోజు 4 గంటల తర్వాత భారీగా పోలింగ్ శాతం పెరిగిందని, దీనికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు.



పంచాయతీ, పార్లమెంటు ఎన్నికలే లక్ష్యం : ఉత్తమ్

వచ్చే పంచాయతీ ఎన్నికలు, రానున్న పార్లమెంటు ఎన్నికలే లక్ష్యంగా ఇక ముందు పని చేస్తామని టీపీసీసీ అధ్యక్షులు ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ధర్మపురి, ఇబ్రహీంపట్నం, కోదాడ వంటి నియోజకవర్గాల్లో పార్టీ తక్కువ ఓట్లతో ఓడిపోయిందని, ఆ నియోజకవర్గాలపై న్యాయపోరాటం చేస్తామన్నారు. పంచాయతీల్లో బీసీ రిజర్వేషన్లు తగ్గించి వారికి అన్యాయం చేసిందని ఆయన ఆరోపించారు.



శిరీష్, వరుణ్‌తేజ్, వెంకటేష్, గంటా శ్రీనివాసరావు, దేవిశ్రీ ప్రసాద్, అనిల్ రావిపూడి, దిల్‌రాజు, లక్ష్మణ్ తదితరులు

ప్రేక్షకులందరూ హ్యాపీగా నవ్వుకునే సినిమా

"సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సినిమా టైమ్‌లో మహేష్‌లో ఓ సోదరుడిని చూసుకున్నా, ఇప్పుడు వరుణ్ తేజ్‌లో మరో సోదరుడిని చూశా' అని వెంకటేష్ అన్నారు. వెంకటేష్, వరుణ్ తేజ్, తమన్నా, మెహరీన్ హీరోహీరోయిన్లుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర సినీ క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మించిన చిత్రం 'ఎఫ్2' (ఫన్ అండ్ ఫ్రస్టేషన్). దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్ర పాటల విడుదల కార్యక్రమం ఇటీవల వైజాగ్‌లో జరిగింది. అతిథిగా విచ్చేసిన ఆంధ్ర ప్రదేశ్ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆడియో సీడీలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'విశాఖ ఉత్సవం చివరి రోజున ఈ చిత్ర పాటల వేడుకను నిర్వహించడం ఆనందంగా ఉంది. ఈ కార్యక్రమంలో భాగమైన యూనిట్ సభ్యులకు, నిర్మాత దిల్‌రాజ్‌కి అభినందనలు. సినిమా పెద్ద విజయం సాధించాలి' అని అన్నారు.

'నా తొలి సినిమా 'కలియుగ పాండవులు' నుంచి 'స్వర్ణకమలం', 'సుందరకాండ', 'మల్లీశ్వరి', 'గురు' వంటి చిత్రాల ఫంక్షన్లు వైజాగ్‌లోనే చేశాం. వైజాగ్ ఉత్సవంలో మా చిత్ర పాటలను విడుదల చేయడం సంతోషంగా ఉంది. అనిల్ రావిపూడి వండర్‌ఫుల్ స్క్రిప్ట్ రాశాడు. అనిల్ నా గత చిత్రాలన్నింటినీ చూసి వాటిన్నింటి కంటే రెచ్చిపోయేలా ఈ సినిమాలో నాతో యాక్ట్ చేయించాడు. సినిమా చిత్రీకరణ సమయంలో చాలా బాగా ఎంజాయ్ చేశాం. దేవిశ్రీ ప్రసాద్ వండర్‌ఫుల్ మ్యూజిక్ అందించాడు. 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' తర్వాత దిల్‌రాజుతో కలిసి చేస్తున్న చిత్రమిది. సంక్రాంతి సందర్భంగా మా సినిమాతోపాటు బాలయ్యబాబు, రజనీకాంత్, చరణ్ సినిమాలున్నాయి. వారికి నా అభినందనలు. అన్ని సినిమాలు బాగా ఆడాలి. తెలుగు ఇండస్ట్రీ బాగుండాలి.

- వెంకటేష్

వరుణ్ తేజ్ చెబుతూ, 'దేవిశ్రీ ప్రసాద్‌తో తొలిసారి పనిచేశాను. దర్శకుడు అనిల్ ధైర్యం చేసి నాకు మంచి పాత్ర ఇచ్చాడు. అందరికి నచ్చుతుందనుకుంటున్నా. వెంకటేష్‌తో పనిచేయడం గౌరవంగా భావిస్తున్నా. ఆయన ఫ్రెండ్‌లా, గైడ్‌లా నన్ను ప్రోత్సహించారు. జనవరి 12న అల్లుళ్ళుగా వస్తున్నాం. అందరికి నచ్చే చిత్రమవుతుంది' అని అన్నారు. 'ఈ చిత్ర కథను వైజాగ్‌లోనే డిస్కస్ చేసి రాసుకున్నాం. మా ఫన్ అండ్ ఫ్రస్టేషన్ ఏంటో ఈ బీచ్‌కి తెలుసు. వెంకటేష్‌తో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా. ఆయన చేయని మేనరిజమ్స్, ఎక్స్‌ప్రెషన్స్ లేవు. ఆయన కామెడీ టైమింగ్‌ని తోడు కోవాలే గానీ, ఎంత కావాలో అంత దొరుకుతుంది. సినిమా చూస్తే వెంకటేష్ మనల్ని 'అబ్బాయిగారు', 'ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు', 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' చిత్రాల టైమ్‌కి తీసుకెళ్ళిపోతారు. అంత కామెడీ ఎనర్జీ సినిమాలో ఉంటుంది. వరుణ్ తేజ్ తొలిసారి కామెడీ జోనర్ సినిమా చేస్తున్నాడు. ఈ సంక్రాంతికి ఫ్యామిలీతో రండి ఆనందంగా నవ్వుకుని వెళతారు' అని దర్శకుడు తెలిపారు.

నిర్మాత దిల్‌రాజు చెబుతూ, '2017లో సంక్రాంతికి మూడు సినిమాలు విడుదలైనప్పుడు పెద్ద కాంపిటీషన్‌గా ఫీలయ్యాం. మూడూ ఆడాయి. ఇప్పుడు మళ్ళీ మూడు సినిమాలు విడుదలవుతున్నాయి. 'ఎన్టీఆర్' బయోపిక్, రామ్‌చరణ్ 'వినయ విధేయ రామ', మా సినిమా ఈ సంక్రాంతికి వస్తున్నాయి. ఈ మూడూ పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నా. వెంకటేష్, వరుణ్ తేజ్ నిర్మాతల హీరోలు. వెంటనే మరో మంచి స్క్రిప్ట్ వస్తే ఈ ఇద్దరితో సినిమా చేయాలనిపించింది. చిరంజీవి నుంచి మంచి లక్షణాలు నేర్చుకుని కొత్త కొత్త సినిమాలు చేస్తూ వరుణ్‌తేజ్ మంచి హీరోగా ఎదుగుతున్నాడు. ఈ సినిమాతో తను ఫ్యామిలీ ఆడియెన్స్‌కి మరింత దగ్గరవుతాడు. ఆయన మా పవర్ స్టార్. అనిల్ రావిపూడి ఈ కథ చెబుతున్నంతసేపు నవ్వుతూనే ఉన్నా. ప్రతి భార్యాభర్తల మధ్య ఫన్, ఫ్రస్టేషన్ ఉంటుంది. ఈ స్క్రిప్ట్ చెప్పినప్పుడు మా బ్యానర్‌లో మరో సూపర్ హిట్ రాబోతుందని తెలుసు. దానికి తగ్గట్టు హీరో, హీరోయిన్లు కుదిరారు. ఫ్యామిలీతో వచ్చే ఆడియెన్స్ రెండు గంటలపాటు నవ్వుకుంటారు. అందుకే 'సంక్రాంతి అల్లుళు వస్తున్నారు' అనే మరో ట్యాగ్ యాడ్ చేశాడు దర్శకుడు. వెంకీ ఆంధ్ర అల్లుడైతే, వరుణ్ తెలంగాణ అల్లుడు. దర్శకుడు అనిల్ మా బ్యానర్‌లో హ్యాట్రిక్ హిట్ కొట్టబోతున్నాడు' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవిశ్రీ ప్రసాద్, శిరీష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

నవచిత్రం

హ్యాట్రిక్ హిట్‌కి రంగం సిద్ధమైంది



అల్లు అర్జున్, త్రివిక్రమ్, అల్లు అరవింద్, ఎస్.రాధాకృష్ణ (చినబాబు)

'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి' వంటి హిట్ చిత్రాల తర్వాత అల్లు అర్జున్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ముచ్చటగా మూడోసారి సినిమా రాబోతోంది. ఈ చిత్రాన్ని హారికా అండ్ హాసినీ క్రియేషన్స్, గీతా ఆర్ట్స్ పతాకాలపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు), అల్లు అరవింద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. "జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి'వంటి విజయవంతమైన చిత్రాలతో అల్లు అర్జున్, త్రివిక్రమ్ కాంబినేషన్‌కి మంచి క్రేజ్ ఉంది. ఈ కాంబినేషన్‌లో మరో సినిమా రూపుదిద్దుకోవడం ఆనందంగా ఉంది. ఈ సినిమాపై ఇటు సినీ వాణిజ్య రంగాలలోనూ, అటు ప్రేక్షక వర్గాల్లోనూ అంచనాలు ఉన్నత స్థాయిలో ఉన్నాయి. ఇది అల్లు అర్జున్ నటించబోతున్న 19వ చిత్రం. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ వర్క్ పూర్తయ్యింది. సినిమాకి సంబంధించిన ఇతర తారాగణం, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే మరో ప్రకటనలో తెలియజేస్తాం. ఈ జనవరిలోనే సినిమా ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు' అని నిర్మాత ఎస్.రాధాకృష్ణ తెలిపారు.



శ్రద్ధా కపూర్

సమ్మర్ స్పెషల్‌గా వస్తున్న మహర్షి



'మహర్షి' చిత్రంలో మహేష్‌బాబు

మహేష్‌బాబు నటిస్తున్న తాజా చిత్రం 'మహర్షి'. పూజా హెగ్డే కథానాయికగా వంశీపైడిపల్లి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, వైజయంతి మూవీస్, పీవీపీ సినిమా పతాకాలపై నిర్మితమవుతోంది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తాజాగా ఈ చిత్రానికి సంబంధించి సెకండ్ లుక్‌ని సోమవారం చిత్ర బృందం విడుదల చేసింది. 'మహేష్ నటిస్తున్న 25వ చిత్రమిది. భారీ బడ్జెట్‌తో గ్రాండియర్‌గా నిర్మిస్తున్నారు. కామెడీ కింగ్, హీరో అల్లరి నరేష్ ఇందులో ఓ కీలక పాత్ర పోషిస్తుండటం విశేషం. భారీ తారాగణం నటిస్తోన్న ఈ సినిమా హై టెక్నికల్ వ్యాల్యూస్‌తో రూపొందుతుంది. షూటింగ్ కూడా భారీ స్థాయిలో జరుగుతుంది. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో చేస్తున్న షెడ్యూల్ పూర్తయ్యింది. ఈ నెల రెండో వారం నుంచి మార్చి వరకు జరిగే షెడ్యూల్‌తో చిత్రీకరణ మొత్తం పూర్తవుతుంది. సమ్మర్ స్పెషల్‌గా ఏప్రిల్‌లో సినిమాని ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు' అని చిత్రయూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, సినిమాటోగ్రఫీ: కె.యు.మోహనన్.

పాత్రకే వన్నె తెచ్చారు

నందమూరి తారక రామారావు జీవితం ఆధారంగా 'ఎన్టీఆర్' బయోపిక్ రూపొందుతుంది. ఎన్టీఆర్ పాత్రలో నందమూరి బాలకృష్ణ నటిస్తున్నారు. క్రిష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎన్‌బీకే ఫిల్మ్స్, వారాహి చలన చిత్రం, విబ్రీ మీడియా పతాకంపై బాలకృష్ణ నిర్మిస్తున్నారు. బసవతారకం పాత్రలో బాలీవుడ్ నటి విద్యా బాలన్ నటిస్తున్నారు. నేడు(సోమవారం) విద్యాబాలన్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్ర బృందం తెలియజేస్తూ, 'బసవతారకం పాత్రలో విద్యా బాలన్ ఒదిగిపోయారు. తనదైన నటనతో పాత్రకే వన్నె తెచ్చారు. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కి మంచి స్పందన లభిస్తుంది. ఇప్పటికే ఇది పది మిలియన్ల వ్యూస్‌ని సంపాదించింది. ఇక ఎన్టీఆర్‌గా బాలకృష్ణ పరకాయ ప్రవేశం చేసిన తీరుకి అద్భుత స్పందన లభిస్తుంది. విభిన్న గెటప్స్‌లో ఆయన అలరిస్తున్నారు. ఈ సినిమా రెండు భాగాలుగా వస్తుంది. సంక్రాంతి కానుకగా జనవరి 9న 'ఎన్టీఆర్ – కథానాయకుడు', ఫిబ్రవరి 7న 'ఎన్టీఆర్– మహానాయకుడు'ని విడుదల చేస్తున్నాం. సినిమాలో రానా, కళ్యాణ్‌రామ్, నిత్యా మీనన్, రకుల్ ప్రీత్ సింగ్, సుమంత్, ప్రకాష్‌రాజ్, మురళీశర్మ, నరేష్, కైకాల సత్యనారాయణ కీలక పాత్రలో నటిస్తున్నారు. కీరవాణి సంగీతం సినిమాకు మరో బలం. ఇప్పటికే విడుదలైన పాటలు శ్రోతలను విశేషంగా అలరిస్తున్నాయి. సినిమా సైతం అబ్బురపరుస్తుంది' అని తెలిపింది.



విద్యాబాలన్

ఏబీసీడీ 3లో కత్రినాకి బదులుగా..

బాలీవుడ్‌లో సక్సెస్‌ఫుల్ డాన్స్ ప్రధాన చిత్రం 'ఏబీసీడీ'. సిరీస్‌లో భాగంగా రెండు సినిమాలు వచ్చి విజయం సాధించాయి. త్వరలో మూడో సినిమా 'ఏబీసీడీ 3' తెరకెక్కబోతోంది. వరుణ్ ధావన్, కత్రినా కైఫ్ జంటగా ఈ సినిమాను రూపొందించాలని దర్శకుడు రెమో డి సౌజా ప్లాన్ చేశారు. ఈ చిత్రంలో నటించేందుకు కత్రినా సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే సల్మాన్‌ఖాన్‌తో నటిస్తున్న 'భారత్' సినిమా కారణంగా ఈ చిత్రానికి డేట్స్ సర్దుబాటు చేయలేక కత్రినా ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారు. దీంతో కత్రినా స్థానంలో శ్రద్ధాకపూర్‌ని ఫైనలైజ్ చేశారు. 'ఏబీసీడీ 2'లో వరుణ్ ధావన్, శ్రద్ధా కపూర్ జోడీగా నటించారు. సిల్వర్ స్క్రీన్ మీద వీరిద్దరి కెమిస్ట్రీ బాగా కుదిరి ప్రేక్షకుల్ని ఫిదా చేసింది. దీంతో మరోసారి ఈ జోడీతోనే మ్యాజిక్ చేయాలని భావించిన చిత్ర బృందం శ్రద్ధాని ఎంపిక చేసుకుందట. ఈ నెలలోనే అమృత్‌సర్‌లో సినిమా షూటింగ్‌ని ప్రారంభించి లండన్, ముంబయిల్లో కూడా చిత్రీకరించేందుకు ప్లాన్ చేస్తున్నారు. భూషణ్‌కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని నవంబర్‌లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మరోసారి డాన్స్ నేపథ్య చిత్రంలో భాగం కావడాన్ని న్యూ ఇయర్ గిఫ్ట్‌గా శ్రద్ధా భావిస్తున్నారట. ప్రస్తుతం ప్రభాస్ సరసన త్రిభాషా చిత్రం 'సాహో'లో నటిస్తోంది. దీంతోపాటు బాలీవుడ్‌లో 'చిచ్చోర్', సైనా నెహ్వాల్ బయోపిక్‌లో నటిస్తూ శ్రద్ధా బిజీగా ఉంది.



అలియా భట్

నేటితరం ప్రేమ కథ..



ఈశ్వర్, టుయా చక్రవర్తి

ఈశ్వర్, టుయా చక్రవర్తి, అంకిత మహారాణా హీరోహీరోయిన్లుగా పరిచయం అవుతూ ఆర్.రఘురాజ్ దర్శకత్వంలో ఓం శ్రీ చక్ర క్రియేషన్స్ పతాకంపై దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మిస్తున్న చిత్రం '4 లెటర్స్'. 'కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే' అనేది ట్యాగ్‌లైన్. ఈ చిత్రం గురించి నిర్మాతలు మాట్లాడుతూ, 'ఈ సినిమా ద్వారా ఈశ్వర్‌ని హీరోగా పరిచయం చేయడం ఆనందంగా ఉంది. సత్యానంద్ దగ్గర శిక్షణ తీసుకున్నాడు. సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేశాడు. కొత్త హీరోలా కాకుండా అనుభవం ఉన్న హీరోలా నటించాడు. 'కలుసుకోవాలని' అనే బ్యూటిఫుల్, క్యూట్ లవ్ స్టోరీని తెరకెక్కించి అందరి ప్రశంసలందుకున్న రఘురాజ్ మా చిత్రాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దుతున్నాడు. కన్నడ, తమిళ చిత్రాలకు దర్శకత్వం వహిస్తూ బిజీగా మారిన ఆయన చాలా గ్యాప్ తర్వాత తెలుగులో చేస్తున్న చిత్రమిది. అన్ని అంశాలతో, కమర్షియల్ హంగులతో యూత్ సహా అన్ని వర్గాలను ఆకట్టుకునే ఎంటర్‌టైనర్ ఇది. చిత్రీకరణ పూర్తయ్యింది. నిర్మాణంలో సీనియర్ ప్రొడక్షన్ కంట్రోలర్ సి.భాస్కర రాజు సహకారం మరువలేనిది. త్వరలోనే పాటలు, సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం' అని అన్నారు. 'నేటి ట్రెండ్‌కి తగ్గట్టు తెరకెక్కించాను. నేటితరం ప్రేమ కథా చిత్రమిది. అందుకే 'కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే' అనే ఉపశీర్షిక పెట్టాం. ప్రేమ, పెళ్ళి విషయాలలో నేటితరం యువత ఆలోచనలు, అభిప్రాయాలు, వాస్తవాలు ఏంటనే విషయాలను సహజత్వానికి దగ్గరగా ఉండేలా చిత్రీకరించాం. చిత్ర కథ, కథనాలు, సంభాషణలు అన్ని వర్గాల ప్రేక్షకులని ఆకట్టుకునేలా సాగడంతోపాటు ఆలోచన రేకెత్తించేలా ఉంటాయి. హీరో ఈశ్వర్‌కి మంచి భవిష్యత్ ఉంది. హీరోయిన్లు బాగా నటించారు. హైదరాబాద్‌లో టాకీపార్ట్‌ని, బ్యాంకాక్‌లో సాంగ్స్‌ని చిత్రీకరించాం' అని దర్శకుడు తెలిపారు.

ఆ ప్రేమే నడిపిస్తోంది..

'సినిమాపై నాకున్న ప్రేమే నన్ను ముందుకు నడిపిస్తోంది. వచ్చే ఏడాది మరింత ఉత్సాహంతో పనిచేస్తాను' అని అంటోంది అలియా భట్. గతేడాది 'రాజీ' చిత్రంలో నటించి మంచి విజయాన్ని, తన నటనకు మంచి ప్రశంసలనూ అందుకుంది. అలాగే 'వెల్‌కమ్ టూ న్యూయార్క్', 'జీరో' చిత్రాల్లో గెస్ట్ పాత్రల్లో మెరిసింది. ప్రస్తుతం ఆమె నటిస్తున్న 'కళంక్' చిత్రంలోని తన పార్ట్ చిత్రీకరణ ఇటీవల హైదరాబాద్‌లో పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా 2018 ఛాలెంజింగ్‌గా సాగిందంటూ అలియా ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ పెట్టింది. "కళంక్' చిత్రీకరణతోపాటు, 2018 కూడా పూర్తయ్యింది. ఇది నా లైఫ్‌లో అత్యంత సవాలుతో కూడిన ఫేజ్. ఏడాదంతా పని..పని..పని అంటూ బిజీగా గడిపాను. ఒకానొక సమయంలో ఇలా చేసుకుంటూ పోతే ఎక్కువ రోజులు పనిచేయలేనని అర్థమైంది. కానీ సినిమాపై ఉన్న ప్రేమే నన్ను ఇలా నడిపిస్తుందనుకుంటున్నా. ప్రతి సారి నాలో ఎనర్జీ, ఉత్సాహం వచ్చింది. ఈ ఏడాది నేను చాలా నేర్చుకున్నా. వచ్చే ఏడాది హాలీడే టైమ్ అని భావించడం లేదు. ఇప్పుడే నా కెరీర్ ఆరంభమైంది. మరింత ఉత్సాహంతో, మరింత ఎనర్జీతో పనిచేస్తా' అని పేర్కొంది. అలియా పెట్టిన ఈ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ప్రస్తుతం 'కళంక్'తోపాటు 'గల్లీబాయ్', 'బ్రహ్మాస్త్ర' చిత్రాల్లో అలియా నటిస్తోంది.

న్యూ ఇయర్ గిఫ్ట్



నాని

నాని, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా 'జెర్సీ' చిత్రంలో నటిస్తున్నారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీడీవీ ప్రసాద్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ని సోమవారం రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందం తెలియజేస్తూ, 'క్రికెట్ నేపథ్యంలో సాగే చిత్రమిది. ఇందులో క్రికెటర్ అర్జున్ పాత్రలో నాని నటిస్తున్నాడు. ఇదొక అర్జున్‌కి సంబంధించిన అద్భుతమైన కథ. నాని, శ్రద్ధా శ్రీనాథ్ మధ్య కెమిస్ట్రీ బాగా పండుతుంది. దర్శకుడు గౌతమ్ సినిమాను అత్యద్భుతంగా తీర్చిదిద్దుతున్నాడు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సినిమాను ఏప్రిల్ 19న విడుదల చేయనున్నాం. సమ్మర్ స్పెషల్‌గా నిలుస్తుంది' అని చిత్ర బృందం తెలిపింది. సత్యరాజ్, రోనిత్ కర్మ, బ్రహ్మాజీ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్: అనిరుధ్ రవిచంద్రన్, కెమెరా: షాను, ఆర్ట్: అవినాష్ కొల్లా, ఎడిటర్: నవీన్ నూలి.

పెళ్ళి సందడి

త్వరలోనే షురూ..!



విశాల్

గతేడాది కథానాయికల పెళ్ళిళ్ళ జోరు సాగింది. ఈ ఏడాది హీరోల పెళ్ళిళ్ళు జరిగే అవకాశాల కనిపిస్తున్నాయి. అందులో భాగంగా విశాల్ పెళ్ళికి సన్నాహాలు ప్రారంభమయ్యాయట. త్వరలోనే ఆయన పెళ్ళి పీటలెక్కబోతున్నట్టు తెలుస్తోంది. అనీశాతో విశాల్ వివాహం జరుగబోతున్నట్టు టాక్. ఈ విషయాన్ని విశాల్ తండ్రి, నిర్మాత జీకే రెడ్డి తెలిపినట్టు కోలీవుడ్ మీడియా కోడై కూస్తోంది. త్వరలోనే వీరి నిశ్చితార్థం హైదరాబాద్‌లో జరుగనున్నట్టు సమాచారం. విశాల్ హీరోగానే కాకుండా తమిళ నడిగర్ సంఘం అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఆయన నడిఘర్ సంఘానికి సొంతంగా ఓ భవనాన్ని నిర్మించిన తర్వాతే పెళ్ళి చేసుకుంటానని ఇటీవల మీడియాతో తెలిపారు. అయితే ఇప్పుడు పెళ్ళికి సంబంధించి ఒత్తిడి తెస్తున్నారట. ముందుగా ఎంగేజ్‌మెంట్ కుదుర్చుకుని, తర్వాత టైమ్ తీసుకుని పెళ్ళి చేయాలని విశాల్ కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. ఇదిలా ఉంటే మొన్నటి వరకు విశాల్, నటి వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రేమలో ఉన్నట్టు, వీరు పెళ్ళి చేసుకోబోతున్నట్టు గతంలో పలు వార్తలు వినిపించాయి. అయితే ఇటీవల వరలక్ష్మి ఈ వార్తలకి ఫుల్‌స్టాప్ పెట్టారు. గతేడాది 'అభిమన్యుడు', 'పందెంకోడి 2' చిత్రాలతో అలరించిన విశాల్ ప్రసుతం 'అయోగ్య'తోపాటు సుందర్.సి దర్శకత్వంలో తెరకెక్కబోయే ఓ సినిమాలో నటించబోతున్నారు. 'అయోగ్య' తెలుగులో విడుదలై విశేష ఆదరణ పొందిన 'టెంపర్' చిత్రానికి రీమేక్.

పంట కాలనీలు
కచ్చితంగా ఏర్పాటు చేయాలి..

రైతులు నియంత్రిత విధానంలో పండించాలి

- వాతావరణానికి అనుగుణంగా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు
- అందుకోసం కార్యాచరణ రూపొందించండి : ఉన్నతాధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశాలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రాన్ని కచ్చితంగా పంట కాలనీలుగా విభజించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. రైతులు ఏయే పంటలు వేయడానికి అలవాటు పడ్డారో అర్థం చేసుకోవాలని సూచించారు. ఒకేసారి వాళ్లమీద అధికారిక అభిప్రాయాలను రుద్దకుండా అంచలంచెలుగా పంట కాలనీలపై వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. రైతులు నియంత్రిత విధానంలో పంటలను పండిచేలా చూడాలని.. ప్రతీ భూమిలో ఏ విత్తనం నాటుతున్నారనే విషయాన్ని వ్యవసాయశాఖకు తెలపాలని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ అనేది ఒక సామూహిక ప్రయత్నమని తెలిపారు. వాతావరణానికి అనుగుణంగా ఇలాంటి పరిశ్రమలను ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళా బృందాలతోపాటు పలువురిని ఇందులో భాగస్వాములను చేయాలని అన్నారు. ఇందుకు సంబంధించి ఒక కార్యచరణను రూపొందించాలని ఆయన ఉన్నతాధికారులను ఆదేశించారు.

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ, మహిళా సంఘా లను అందులో భాగస్వాములను చేయటం, వ్యవసాయో త్పత్తుల ఎగుమతులు తదితరాంశాలపై సోమవారం సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రగతి భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు రాజీవ్‌శర్మ, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో అధికారులు నర్సింగరావు, భూపాల్‌రెడ్డి, స్మితా సబర్వాల్ తదితరులు పాల్గొన్నారు. రైతలందరూ ఒకే రకమైన పంట వేస్తే సమస్యలు తలెత్తుతాయని సీఎం ఈ సందర్భంగా అన్నారు. అందువల్ల పంట మార్పిడిపై వారికి అవగా హన కల్పించాలని చెప్పారు. రైతులకున్న కొన్ని సాంప్రదాయబద్ధమైన అలవాట్లలో మార్పులు తేవాలి.. ఒకే రకమైన పంట వేస్తే జరిగే లాభ నష్టాల మీద చర్చ జరగాలని తెలిపారు. ముల్కనూరు గ్రామంలో సహకార పద్ధతిలో రైతులను సంఘటితపరచటం ద్వారా గొప్ప ఫలితాలను సాధించారని గుర్తుచేశారు. ఈ అనుభవాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఇలాంటి అంశాలపై వ్యవసాయ, ఆర్థిక శాస్త్రవేత్త అశోక్ గులాటితో తాను చర్చించానని చెప్పారు. రాష్ట్రానికి విచ్చేసి వర్క్‌షాప్ నిర్వహించాలంటూ ఆయన్ను తాను ఆహ్వానించానని తెలిపారు.త్వరలోనే ఆయన మన రాష్ట్రానికి వస్తారని చెప్పారు.

ఎలాంటి వ్యవసాయ ఉత్పత్తినైనా ప్రాసెస్ చేస్తే దాని ధర పెరుగుతుందని సీఎం ఈ సందర్భంగా చెప్పారు. అందువల్ల రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమను ప్రారంభించాలని సూచించారు. ఇలాంటి ఆలోచనలకు కార్యరూపమిచ్చి అమలు పరచాలని అన్నారు. అయితే ఏ ప్రాంతంలో ఎన్ని రకాల పరిశ్రమలు, యూనిట్లను స్థాపించాలనే విషయంపై అధ్యయనం చేయాలని సూచించారు. ఈ మొత్తం ప్రక్రియలో ఐకేపీ, మహిళా సంఘాలను భాగస్వాములను చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వపరంగా ఫుడ్ ప్రాసెసింగ్‌లో అమలు పరుస్తున్న కార్యక్రమాలను అధ్యయనం చేయాలని ఆయన ఆదేశించారు. అలాగే అంతర్జాతీయ స్థాయిలోని ప్రాసెసింగ్ పరిశ్రమలపై కూడా అధ్యయనం నిర్వహించాలని సూచించారు. ఇందుకోసం ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్లి రావొచ్చని అన్నారు. కల్తీ విత్తనాలను పూర్తిగా నిషేధించాలని చెప్పారు. విత్తనాలను విరివిగా అందుబాటులో ఉంచాలని, అవసరమైన ఎరువులు, క్రిమిసంహారక మందులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. నాటు, కలుపుతీసే యంత్రాలు, పసుపు రైతులకు ఇవ్వాల్సిన యంత్రాల విషయంలో తగిన కార్యాచరణ రూపొందించాలని సీఎం ఆదేశించారు.

ఎంసెట్ నిర్వహణ బాధ్యత ఏ వర్సిటీకి?

- మాకు ఇవ్వాలని ఉస్మానియా ప్రయత్నం
- జేఎన్టీయూహెచ్‌కే కేటాయించాలని ఆదేశాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎంసెట్ నిర్వహణ బాధ్యత ఏ విశ్వవిద్యాలయానికి ఇవ్వాలన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గత కొన్నేండ్లుగా జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (జేఎన్టీయూహెచ్) ఎంసెట్ నిర్వహణ బాధ్యతను చేపడుతున్న విషయం తెలిసిందే. ఎంసెట్ నిర్వహణ బాధ్యతను జేఎన్టీయూహెచ్‌కే కేటాయించాలని ప్రభుత్వ ఆదేశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఎంసెట్ నిర్వహణ బాధ్యతను తమకు ఇవ్వాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) కోరుతున్నది. త్వరలోనే ఓయూ వీసీ ఎస్ రామచంద్రం ఉన్నత విద్యామండలి చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డికి లేఖ రాయనున్నారు. ఇంకోవైపు ఈనెల 3న విశ్వవిద్యాలయాల వీసీల సమావేశం జరుగుతున్నది. ఆ సమావేశంలోనూ ఎంసెట్ నిర్వహణ బాధ్యతను తమకు ఇవ్వాలని ఓయూ వీసీ కోరే అవకాశమున్నది. ఈ నేపథ్యంలో అదే రోజు ఎంసెట్ నిర్వహణ బాధ్యత ఏ విశ్వవిద్యాలయానికి అప్పగించాలనే దానిపై నిర్ణయం తీసుకునే సూచనలున్నాయి.

ఒకవేళ రెండు వర్సిటీలూ పోటీపడితే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించే అవకాశమున్నది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని బట్టి ఏ విశ్వవిద్యాలయానికి ఇవ్వాలో స్పష్టత రానుంది. ఉస్మానియా వర్సిటీ నుంచి విజ్ఞప్తి వస్తే పరిశీలిస్తామని ఉన్నత విద్యామండలి చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి తనను కలిసిన విలేకరులతో చెప్పారు.

నాలుగు ప్రవేశ పరీక్షలకు కొత్త కన్వీనర్లు

రాష్ట్రంలో నాలుగు ప్రవేశ పరీక్షలకు కొత్త కన్వీనర్లను నియమించనున్నారు. ఎడ్‌సెట్, పీజీఈసెట్, లాసెట్, ఐసెట్‌లకు కొత్త కన్వీనర్లను ఉన్నత విద్యామండలి నియమించనుంది. రాష్ట్రంలో వృత్తి విద్యాకోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన రాతపరీక్షలు మేలో జరిగే అవకాశమున్నది. జాతీయ స్థాయిలో ప్రవేశ, పోటీ పరీక్షలు, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రలో నిర్వహించే ప్రవేశ పరీక్షల తేదీలను పరిశీలించి తెలంగాణలో నిర్వహించే ప్రవేశ పరీక్షల తేదీలను ఖరారు చేయనున్నారు. పీఈసెట్ మాత్రమే మ్యానువల్ పద్ధతిలో, ఇతర ప్రవేశ పరీక్షలన్నీ ఆన్‌లైన్ పద్ధతిలో జరుగుతాయి.

బొగ్గుగనుల్లో ఆపరేషన్ షురూ..

షిల్లాంగ్ : మేఘాలయలోని జయంతియా హిల్స్ బొగ్గు గనుల్లో చిక్కుకుపోయిన 15 మంది మైనర్ బాలురను వెలికితీసేందుకు నావికాదళం, ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు సంయుక్తంగా సహాయక చర్యలు ప్రారంభించాయి. రిమోట్ కంట్రోల్ ద్వారా నీటిలో గాలింపు చేపట్టే వాహనాన్ని (యుడబ్ల్యుఆర్ఒవి)ఉపయోగించి సోమవారం ఉదయం గనిలోకి నావికాదళం ప్రవేశించిందని, అయితే గాలింపు చర్యలను చేపట్టేందుకు వీలుగా నీటి మట్టాన్ని 30 మీటర్ల మేర తగ్గించాలని నావికాదళం కోరిందని స్థానిక అధికారి ఒకరు వెల్లడించారు. మరోవైపు సహాయ చర్యల నిమిత్తం మానవ వనరులతో పాటు యంత్రాలు వంటి ఏర్పాట్లను ఎన్‌డిఆర్ఎఫ్ సమీక్షిస్తోంది. ఒడిశాకు చెందిన అగ్నిమాపక దళం కూడా తన సేవలను కొనసాగిస్తుంది.

శంషాబాద్‌లో దారుణం

చిన్నారి హత్య

- బంధువులే చంపేశారని తల్లిదండ్రుల అనుమానం



నవతెలంగాణ - శంషాబాద్

రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో దారుణం జరిగింది. అభం శుభం తెలియని చిన్నారిని గుర్తు తెలియని వ్యక్తులు అతి దారుణంగా హత్య చేశారు. సీఐ వెంకటేష్ వివరాల ప్రకారం... మండల పరిధిలోని పాలమాకుల గ్రామానికి చెందిన చిన్నబాబు, నిర్మల కుమారుడు మద్దూరి దినేష్ (9) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం సైకిల్‌తో ఆడుకుంటూ ఉన్న దినేష్ అదృశ్యమయ్యాడు. తల్లిదండ్రులు, బంధువులు కలిసి ఊరంతా వెతికారు. ఆచూకీ లభ్యం కాలేదు. అనంతరం శంషాబాద్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, కుటుంబ సభ్యులు కలిసి బాలున్ని వెతుకుతుండగా రాత్రి 10.30 సమయంలో తిమ్మాపూర్ సమీపంలోని రైస్‌మిల్లు దగ్గరలో ఉన్న చెట్ల పొదల్లో చిన్నారి మృతదేహం కలిపించింది. మృతుని ఒంటిపై గల బట్టలు చినిగిపోయి ఉన్నాయి. శరీరంపై బలమైన గాయాలున్నాయి. సైకిల్ కూడా పక్కనే పడి ఉంది. పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీంలతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎలాంటి ఆధారాలూ లభించలేదు. బంధువులే తమ కుమారున్ని హత్య చేసి చెట్ల పొదల్లో పడేశారని తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

మోసాల్లో బ్యాం'కింగ్'

(మొదటిపేజీ తరువాయి)

మోసాలతో పోల్చితే.. ఒక్క ఏడాదిలోనే ఈ తరహా మోసాలు 72 శాతం పెరగడం విశేషం. ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, ఆయన బంధువు మెహుల్ ఛోక్సీ తదితరులు కలిసి పంజాబ్ నేషన్ బ్యాంకుకు (పీఎన్‌బీ)రూ.13వేల కోట్లు మోసం చేసిన విషయం తెలిసిందే. 2017-18లో బ్యాంకింగ్‌లో ఇదే అతిపెద్ద మోసంగా నమోదయ్యింది. పీఎన్‌బీ కుంభకోణం వల్లే మోసాల విలువ భారీగా పెరిగిందని ఆర్బీఐ తన రిపోర్టులో విశ్లేషించింది.

పెరిగిన మోసాల కేసులు

2016-17 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ రంగంలో 5,076 మోసం కేసులు చోటు చేసుకున్నాయి. 2017-18లో ఈ సంఖ్య 5,917కు పెరిగింది. కాగా అత్యధికంగా లక్ష రూపాయలకు మించి నమోదైన కేసుల్లో 93 శాతం కేసులు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనే నమోదు కావడం గమనార్హం. క్రితం నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో బ్యాంకింగ్‌లో మోసాలు నాలుగు రెట్లు పెరిగాయి. 2013-14లో రూ.10,170 కోట్ల విలువ చేసే మోసాలు చోటు చేసుకున్నాయి. 2017-18లో ఈ మోసాలు రూ.41వేల కోట్లకు చేరడం ఆందోళనకరం. 2017-18లో 2,059 సైబర్ మోసాల వల్ల బ్యాంకులు రూ.109.6 కోట్లు నష్టపోయాయి. ఇంతక్రితం ఏడాదిలో 1,372 కేసుల్లో రూ.42.3 కోట్లు పోగొట్టుకున్నాయి. మొత్తం మోసాల్లో



రూ.50 కోట్ల పైబడినవి 80 శాతంగా ఉండటం గమనార్హం. మొత్తం మోసాల్లో 90 శాతం రుణాలుగా జారీ చేసినవి కావడం ఆందోళనకరమని ఆర్బీఐ రిపోర్టు తెలిపింది. క్రితం శుక్రవారం ఆర్బీఐ వెల్లడించిన 'ట్రెండ్స్ అండ్ ప్రోగ్రెసెస్ ఆఫ్ బ్యాంకింగ్ 2017-18' నివేదిక ప్రకారం 2018 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 11.2 శాతానికి పెరిగి.. దాదాపు రూ.10.39 లక్షల కోట్లకు ఎగిశాయి. అంతకు ముందు ఏడాది బ్యాంకుల జీఎన్‌పీఏ 9.3 శాతంగా నమోదయ్యింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పెరిగిన జీఎన్‌పీఏల మొత్తంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల వాటా రూ.8.95 లక్షల కోట్లుగా ఉందని.. ఇది 14.6 శాతానికి సమానమని ఆర్బీఐ తన నివేదికలో తెలిపింది.

వలసలకు తలుపులు బంద్

(మొదటిపేజీ తరువాయి)

మందికి పైగా వలసవాసులు మధ్యధరా సముద్ర ప్రాంతంలో నీట మునిగి చనిపోయారు. ఇందులో అధికశాతం మంది ఉత్తరాఫ్రికా, మధ్యప్రాచ్య దేశాలకు చెందినవారే. 2018లో 1,07,000 మంది పేదలు మధ్యధరా సముద్రాన్ని దాటారని, 2017తో సంఖ్య 1,64,000తో పోలిస్తే ఇది కొద్ది తక్కువేనని ఐఓఎం వివరించింది.

వలసలను అడ్డుకునేందుకు 2020 నాటికి 10 వేల మంది సైనికులను సమకూర్చాలని ఇయు దేశాలు నిర్ణయించాయి. వలస కూలీలు ఎవరికీ భారం కారని, వారు ఆయా దేశాల ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధికి తోడ్పడతారనిఐరాస, మానవ హక్కుల సంఘం పేర్కొంది

హెచ్ఎమ్‌డీఏ పరిధిలో ఎక్కువ చెట్లను పెంచాలి..

- ముఖ్యమంత్రి కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హెచ్ఎమ్‌డీఏ పరిధిలో పెద్ద ఎత్తున పచ్చదనం పెంపు కార్యక్రమాన్ని చేపట్టాలని ముఖ్యమంత్రి కేసీఆర్.. హెచ్ఎమ్‌డీఏ కమిషనర్ జనార్ధన్‌రెడ్డిని ఆదేశించారు. సోమవారం ప్రగతి భవన్‌లో నిర్వహించిన సమీక్ష సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. దేశంలోని ఇతర నగరాల మాదిరిగా హైదరాబాద్ కూడా కాంక్రీట్ జంగిల్ కాకూడదని అన్నారు. ఇక్కడ నివసించే వారు ప్రశాంతంగా జీవించడంతో పాటు భవిష్యత్ తరాలు సంతోషంగా జీవించేలా పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని సూచించారు. హెచ్ఎమ్‌డీఏ పరిధిలో వీలైనంత ఎక్కువ పచ్చదనం ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వాకర్స్ క్లబ్‌లు ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతలు వారికే అప్పగించాలని సూచించారు.

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మరింత ముందుకు పోవాలని ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని పేర్కొన్నారు.

ఉగ్రవాదిలా కనిపిస్తున్నావ్...

- ముస్లిం విద్యార్థిపై జేఎన్‌యూ ప్రొఫెసర్ వివాదాస్పద వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: ప్రసిద్ధ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఓ ముస్లిం విద్యార్థిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పది బాంబు పేలుళ్లకు పాల్పడిన ఉగ్రవాదిలా కనిపిస్తున్నావ్ అంటూ జేఎన్‌యూ స్టూడెంట్ యూనియన్ జనరల్ సెక్రెటరీ ఎజాజ్ అహ్మద్‌ను ఉద్దేశిస్తూ ప్రొఫెసర్ అమితా సింగ్ వ్యాఖ్యానించారు. డిసెంబర్ 26న వర్సిటీ ప్రాంగణంలోని ఓ క్యాంటిన్‌లో స్నేహితులతో ఎజాజ్ టీ తాగుతుండగా అమితా సింగ్ వారిపై ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ విషయమై ఎజాజ్ మాట్లాడుతూ.. ఆమె అహంకారపూరితంగా మా ఐడీ కార్డులు చూపించమని అడిగారని, తమ సామాజిక, మత అంశాలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని తెలిపారు. అయితే వర్సిటీలో ఒక కార్యకర్తగా, విద్యార్థుల ప్రతినిధిగా తాను ఆమెకు తెలిసినా, రెచ్చగొట్టే ఉద్దేశంతోనే గుర్తింపును అడిగిందని అన్నారు. మతపరమైన, ద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారంటూ తెలిపారు. 'పది బాంబు పేలుళ్లకు పాల్పడినవారిలా కనిపిస్తున్నావు. అందుకే నీ పేరు చెప్పడం లేదని' ప్రొఫెసర్ అన్నట్టు వివరించారు. సదరు ప్రొఫెసర్‌పై చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి ఫిర్యాదు చేశారని తెలిపారు. కాగా, జేఎన్‌యూ టీచర్స్ అసోసియేషన్.. ఎజాజ్‌కు సంఘీభావం ప్రకటించింది.

సోషల్ మీడియా స్కాన్...

(మొదటిపేజీ తరువాయి)

గుర్తించడం కోసం ఈ సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తారు.

ప్రస్తుతం యూరోపియన్ దేశాల్లో ఫోటో డీఎన్ఏపై చర్చ జరుగుతోంది. ఫోటో డీఎన్ఏను వినియోగించకుండా ట్విట్టర్,మైక్రోసాఫ్ట్,యూట్యూబ్,ఫేస్‌బుక్‌లాంటి సోషల్ మీడియా కంపెనీలపై ఈయూ దేశాలు నిషేధం విధించాయి. చిన్నారులపై నేరాలకు పాల్పడేవారిని గుర్తించడం కోసం కోట్లాది ఫోటోలను స్కాన్ చేయడానికి ఆ దేశాల్లో అనుమతి లేదు. నేరాలతో సంబంధంలేనివారి ఫోటోలను స్కాన్ చేయడం వ్యకిగత గోప్యత హక్కుకు భంగం కలిగించడమేనని ఆ దేశాలు భావిస్తున్నాయి. ఉగ్రవాదుల విషయంలోనూ ఫోటో డీఎన్ఏను వినియోగించేందుకు ఆ దేశాల్లో అనుమతి లేదు.

నేరస్మృతిలోని సెక్షన్ 91 ప్రకారం సోషల్ మీడియా సంస్థలకు సీబీఐ ఈ నెలలో ఓ నోటీస్ జారీ చేసింది. కొన్ని ఫోటోలను జత చేసి ఫోటో డీఎన్ఏ ద్వారా స్కానింగ్ చేయాలని కోరింది. తమ దర్యాప్తులో భాగంగా అనుమానితులను గుర్తించడం అత్యవసరమైనందున స్కానింగ్ చేయాలంటూ ఆ సంస్థలను కోరింది. ఈ ప్రక్రియ కోసం నేరాలతో సంబంధంలేనివారి ఫోటోలను కూడా స్కాన్ చేయాల్సి ఉంటుంది. ఇది పౌరుల ప్రాథమిక హక్కయిన ప్రయివసీని ఉల్లంఘించడమేనని న్యాయ నిపుణులు స్పష్టం చేశారు. ఈ ఏడాది ప్రారంభంలోనే ప్రయివసీని ప్రాథమిక హక్కుగా తేల్చి చెబుతూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై తమ ప్రశ్నలకు సమాధానాలు కావాలంటూ సీబీఐ అధికార ప్రతినిధిని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కోరగా నిరాకరించారు. చిన్నారుల పట్ల అసభ్యతకు సంబంధించిన కేసుల్లో మినహాయించి సాధారణ నేరాలకు ఈ సాంకేతికతను వినియోగించుకోవడమంటే ఉద్దేశించిన ప్రయోజనాన్ని దుర్వినియోగం చేయడమేనని ఇంటర్‌నెట్ ఫ్రీడం ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అపార్‌గుప్తా స్పష్టం చేశారు.

ఇక.. రెండు హైకోర్టులు

(మొదటిపేజీ తరువాయి)

వీడ్కోలు చెప్పారు. హైదరాబాద్‌తోనూ, ఇక్కడి హైకోర్టుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న కొందరు న్యాయమూర్తులు భావోద్వేగాలకు లోనయ్యారు. ఏపీ హైకోర్టుకు కేటాయించిన న్యాయాధికారులు, సిబ్బందిని తరలించేందుకు అమరావతి నుంచి నాలుగు ప్రత్యేక బస్సులు వచ్చాయి. వీటిలో వారంతా వెళ్లేప్పుడు తెలంగాణ హైకోర్టు న్యాయవాధికారులు, సిబ్బంది వీడ్కోలు చెప్పారు. ఏపీ హైకోర్టుకు న్యాయమూర్తులు, లాయర్లు తరలివెళ్లిపోతుండటంతో ఉమ్మడి హైకోర్టు వద్ద వాతావరణం హడావిడి నెలకొంది, రాష్ట్రాలు విడిపోయినా అన్నదమ్ముల్లా కలిసి ఉందామని సిబ్బంది చెప్పుకున్నారు. అమరావతి వస్తే తప్పకుండా మా ఇంటికి రండి అని ఏపీ ఉద్యోగులు అంటే.. హైదరాబాద్ వచ్చినప్పుడు కలుద్దామని తెలంగాణ సిబ్బంది అనుకున్నారు. ఒకరినొకరు హదయాలను హత్తుకుని భావోద్వేగ వాతావరణంలో ఏపీ సిబ్బందికి వీడ్కోలు పలికారు. కొంతమంది కన్నీరు పెట్టుకున్నారు. వీడ్కోలు కార్యక్రమంతో హైకోర్టు ప్రాంగణం కోలాహలంగా మారింది. సోమవారం సాయంత్రానికి ఏపీ చేరుకున్న న్యాయమూర్తులకు విజయవాడలోని ఓ హోటల్లో బస ఏర్పాట్లు చేశారు. జనవరి 1 నుంచి అమరావతిలో ఏపీ సీఎం క్యాంపు కార్యాలయంలో హైకోర్టు ప్రారంభం అవుతుంది. మంగళవారం ఉదయం 8.30 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్ తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఆ తర్వాత గవర్నర్ హెలికాప్టర్‌లో విజయవాడ వెళ్లి ఉదయం 10.30 గంటలకు ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. రెండు రాష్ట్రాలకు ప్రధాన న్యాయమూర్లుతోసహా 14 మంది చొప్పున న్యాయమూర్తులతో తెలుగు రాష్ట్రాలకు విడివిడిగా హైకోర్టులు ఏర్పడతాయి. న్యాయమూర్తులతో ఆయా రాష్ట్రాల హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు ప్రమాణం చేయిస్తారు. హైదరాబాద్‌లోని హైకోర్టు భవన ప్రధాన ద్వారం వద్ద ఆ కార్యక్రమం నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. రెండు రాష్ట్రాల్లో జరిగే ఈ కార్యక్రమాలకు ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, చంద్రబాబునాయుడులు హాజరుకానున్నారు. ఇందు కోసం భారీ ఏర్పాట్లు, ప్రత్యేక అలంకరణలు చేస్తున్నారు.

పిటీషన్ కొట్టివేత

ఏపీలో భవన నిర్మాణం పూర్తయ్యేవరకు హైకోర్టు విభజనను నిలిపివేయాలంటూ దాఖలైన అత్యవసర వ్యాజ్యాన్ని సోమవారం హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసింది. కనీసం వారం రోజుల వ్యవధి కూడా లేకుండా రెండు రోజుల ముందు నిర్ణయించి ఏపీ హైకోర్టును విభజించడం అన్యాయమని, కొంత గడువు ఇచ్చిన తర్వాత విభజన చేయాలని కోరుతూ న్యాయవాది పీవీ కృష్ణయ్య దాఖలు చేసిన వ్యాజ్యాన్ని సోమవారం సాయంత్రం కోర్టు సమయం దాటిపోయినా కూడా న్యాయమూర్తులు జస్టిస్ రామసుబ్రమణియన్, జస్టిస్ కేశవరావులతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. హైకోర్టు విభజనను వాయిదా వేయాలని కోరేందుకు పిటిషనర్ తగిన ఆధారాలు చూపలేదని, విభజన నిర్ణయాన్ని వాయిదా వేయాలనే అంశంలో జోక్యం చేసుకోబోమని ధర్మాసనం ప్రకటించింది. ఎప్పుడు విభజన చేసినా బాలారిష్టాలు ఉంటాయని, కొద్ది రోజులు వాయిదా వేసిన తర్వాత కూడా ఇంకో సమస్య చెబుతారని, హైకోర్టు విభజన వాయిదా వేయబోమని తేల్చి చెప్పింది. ఇదిలా ఉండగా, ఇదే అంశంపై దాఖలైన హౌస్ మోషన్ పిటిషన్‌పై సత్వరమే విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం నిరాకరించింది. ఏపి హైకోర్టు న్యాయవాదుల సంఘం పిటిషన్ వేసింది. సుప్రీంకోర్టు రిజిస్టర్ వద్ద దాఖలైన ఈ పిటిషన్‌పై జనవరి 2న విచారణ చేపట్టనున్నట్టు సుప్రీంకోర్టు పేర్కొంది.


రెండేండ్లదాక మీడియాతో మాట్లాడను

రేవంత్‌రెడ్డి సంచలన నిర్ణయం

- ఇన్ని రోజులు మీ కోసం మాట్లాడాను
- ఇప్పుడు నా కోసమే మాట్లాడను

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పదునైన విమర్శలతో టీఆర్ఎస్‌ను ఇరుకున పెడుతున్న టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు ఎను ముల రేవంత్‌రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని గోల్కొండ హోటల్‌లో జరిగిన సమన్వయ కమిటి సమావేశానికి హజరైన ఆయన సంచలన ప్రకటన చేశారు. రెండేండ్లదాక మీడియా ముందు మాట్లాడనని వెల్లడించారు. ఇన్ని రోజులు ప్రజల కోసం మాట్లాడానని, ఇప్పుడు నా కోసం మాట్లాడటం లేదని చెప్పారు. కొడంగల్ నియోజకవర్గంలో ప్రత్యర్థి టీఆర్ఎస్ నేత పట్నం నరేందర్‌రెడ్డి చేతిలో ఆయన ఓటమిపాలయ్యారు. ఎన్నికల ఫలితాల రోజు మీడియాతో మాట్లాడిన రేవంత్‌రెడ్డి...ఫలితాలొచ్చి 19 రోజులు గడుస్తున్నా



ఆయన మీడియా ముందుకు రాలేదు. పార్టీ కార్యాలయానికి అలా వచ్చి ఇలా వెళ్లిపోయారు. నిత్యం ఏదో సమస్యపై మీడియాతో మాట్లాడి ప్రత్యర్థి పార్టీపై నిప్పులు చెరిగేవారు.దీంతో ఆయన ఏం మాట్లాడినా మీడియాకు పండుగే. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులపై ఆయన పదునైన వ్యాఖ్యలతో విమర్శలు గుప్పించారు. ఆయన మీడియా ముందుకు వస్తున్నారంటే దానికి తగ్గ ప్రిపరేషన్‌తో వచ్చేవారు. రాష్ట్ర విభజన తర్వాత ఆయనకు టీడీపీ కీలకమైన పదవి కట్టబెట్టింది. తెలంగాణ రాష్ట్రంలో సైకిల్‌కు దిక్కులేదన్న పరిస్థితి నుంచి తన దూకుడుతో టీడీపీకి మంచిరోజులొచ్చాయన్న స్థాయికి తీసుకొచ్చారు. అయినప్పటికి తెలంగాణలో టీడీపీకి భవిష్యతు లేదని గ్రహించిన ఆయన కాంగ్రెస్ గూటికి చేరారు. టీడీపీకి చెందిన కీలకమైన సుమారు 30 మంది నేతలతో కలిసి ఆయన ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆతర్వాత కాంగ్రెస్ పార్టీలో సైతం తనదైన ముద్ర వేసుకునేందుకు ప్రయత్నించారు. ముందస్తు ఎన్నికలు రావడంతో ఆయనకు ఎన్నికల ప్రచార కమిటీ చైర్మెన్ పదవి ఇస్తారని వార్తలొచ్చాయి. ఆ పదవి రాకపోగా టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్ష పదవి వరించింది. దీంతో కాంగ్రెస్ పార్టీలోనూ కీలక నేతగా మారారు. మాస్‌పాలోయింగ్ ఉన్న రేవంత్ ఎన్నికల సందర్భంగా ఎక్కడికెళ్లినా జనం బాగా వచ్చారు. కేసీఆర్, కేటీఆర్‌కు రేవంత్‌రెడ్డి మాత్రమే సరైన కౌంటర్ ఇస్తారన్న చర్చ పార్టీలో జరిగింది. కొడంగల్ నియోజకవర్గంలో ఉహించని విధంగా ఆయన ఓడిపోయారు. దీంతో ఆయన కలత చెందినట్టు తెలిసింది. మీడియాకు సైతం దూరంగా ఉంటున్నారు. ఇంకా రెండేండ్లపాటు కూడా తన కోసం మీడియాతో మాట్లాడనని ప్రకటించారు.

సోహ్రాబుద్దీన్ హత్య కేసును దర్యాప్తు చేసిందెవరు? : జైట్లీ

న్యూఢిల్లీ : సోహ్రాబుద్దీన్ హత్య కేసును దర్యాప్తు ఎవరు? రాహుల్ ప్రశ్నించి ఉంటే సరైన సమాధానం లభించివుండేదని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ వ్యాఖ్యానించారు. ఈ కేసులో కోర్టు తీర్పును తప్పుపడుతూ, 'సోహ్రాబుద్దీన్‌ను ఎవరూ హత్య చేయలేదని' అని వ్యంగ్యంగా రాహుల్ వ్యాఖ్యానించడంపై జైట్లీ స్పందించారు. దీనికి బదులుగా ' సోహ్రాబుద్దీన్ హత్య కేసును దర్యాప్తు ఎవరు? అని ప్రశ్నిస్తే తగిన సమాచారం తెలిసేదని' జైట్లీ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు.

గతవారంలో 2005 సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసులో 22 మంది నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ సిబిఐ ప్రత్యేక కోర్టు తీర్పు ఇవ్వడంపై రాహుల్ గాంధీపై విధంగా స్పందించిన సంగతి తెలిసిందే.. దీనికి జైట్లీ కౌంటర్ వేశారు. అలాగే 'దర్యాప్తు సంస్థల స్వేచ్ఛ గురించి ఆందోళన వ్యక్తం చేసే వారు తాము అధికారంలో ఉండగా సిబిఐని తమ స్వప్రయోజనాలకు ఏ విధంగా వాడుకున్నారో గుర్తుకు తెచ్చుకోవాలని అన్నారు. సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును రాజకీయం చేస్తున్నారని 2013లో అప్పటి ప్రధాని మన్మోహన్‌కు తాను లేఖ రాసినట్లు కూడా జైట్లీ గుర్తుచేశారు.

నో జీన్స్...

(మొదటిపేజీ తరువాయి)

మేం అనుమతించడంలేదు. మహిళలు సల్వార్ సూట్, లేదా చీర కట్టుకొని రావాలి. జీన్స్, ట్రౌసర్లను మేం నిషేధించాం. నిర్ణయం చేసి రెండు నెలలైనప్పటికీ.. సుమారు నెల రోజుల నుంచి కఠినంగా అమలుచేస్తున్నాం' అని మహాబలేశ్వరం ఆలయం అధికారి హాలప్ప చెప్పారు. హంపీలోని విరూపాక్ష గుడిలో కూడా ఇలాంటి నిబంధనలే అమలులో వున్నాయి.

హసీనాకు మోడీ అభినందనలు

న్యూఢిల్లీ : బంగ్లాదేశ్ ప్రధానిగా ఎన్నికైన షేక్ హసీనాకు ప్రధాని మోడీ సోమవారం అభినందనలు తెలిపారు. తాజాగా జరిగిన పార్లమెంటు ఎన్నికలలో హసీనా నేతృత్వంలోని అలివీ లీగ్ పార్టీ 298 సీట్లకు గాను 287 సీట్లను సాధించి హసీనా విజయాన్ని పొందారు. వరుసగా నాలుగోసారి ప్రధానిగా గెలుపొందిన హసీనాను మోడీ అభినందిస్తూ బంగ్లాదేశ్‌తో కలిసి పనిచేసేందుకు భారత్ సిద్ధంగా ఉందని అన్నారు. దేశంలో చేపట్టిన అభివృద్ధికి, అద్భుతమైన నాయకత్వానికి లభించిన విజయంగా మోడీ పేర్కొన్నట్లు ప్రధాని కార్యాలయం కార్యదర్శి తెలిపారు. కాగా, ఇరు దేశాల మధ్య సత్సంబంధాలు కొనసాగుతాయన్న విశ్వాసాన్ని బంగ్లా విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి వ్యక్తం చేశారు. రెండు దేశాల మధ్య గత ఐదేళ్లలో 19 అభివృద్ధి ప్రాజెక్టులను ఇరుదేశాల నేతలు సంయుక్తంగా ప్రారంభించారు. ఐటి, అంతరిక్షం, ఎలక్ట్రానిక్స్, సైబర్ సెక్యూరిటీ, అణు విద్యుత్‌తో పాటు ఇతర అంశాలకు సంబంధించి 90 ద్వైపాక్షిక ఒప్పందాలు కుదిరాయి.

చంద్రబాబూ.. ఇకనైనా అబద్ధాలు ఆపు...

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏపీ సీఎం చంద్రబాబు ఇప్పటికైనా అబద్ధాలు మాట్లాడటం మానుకోవాలని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బాబు ఓటమి ఖాయమని అన్నారు. అందువల్లే ఇప్పట్నుంచే ఆయన సాకులు వెతుక్కుంటున్నారని ఎద్దేవా చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ లేవనెత్తిన ప్రశ్నలకు ఏపీ సీఎం సమాధానం చెప్పకుండా ఏవేవో మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎన్టీఆర్‌ను గద్దె దించటంలో కేసీఆర్ సూత్రధారి అయితే ఆయన ఆ రోజే సీఎం అయ్యేవారుకదా..? అని ప్రశ్నించారు. బాబును ఎదుర్కొనేందుకు ముగ్గురు మోడీలు అవసరం లేదు.. ఏపీ ప్రజలు చాలునని అన్నారు. మోడీతోనూ, బీజేపీతోనూ టీఆర్ఎస్‌కు ఎప్పుడూ సంబంధాల్లేవని చెప్పారు. కేవలం రాజ్యాంగబద్ధమైన సంబంధమే కేంద్రంతో ఉందని స్పష్టం చేశారు.



అవినీతి పరుడు : ఎమ్మెల్సీ భానుప్రసాద్

చంద్రబాబులాంటి అవినీతిపరుడు దేశంలో మరెక్కడా లేరని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ టి.భానుప్రసాద్ ఆరోపించారు. సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు పేరుతో తన బంధువులు, భజన బృందాలతో అక్కడ భూములను కొనిపించారని తెలిపారు. హైటెక్ సిటీ అభివృద్ధి వెనుక కుట్ర కోణాన్ని ఓ హార్వర్డ్ వర్సిటీ విద్యార్థిని తన పరిశోధనా పత్రంలో నిరూపించారని విమర్శించారు. పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్... బీసీలపట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని టీఆర్ఎస్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య విమర్శించారు.


సెన్సెక్స్ ▼ 08 36,068 | నిఫ్టీ ▲ 02 10,862

డాలరుకు రూపాయి విలువ 69.79


బంగారం(10.గ్రా) రూ. 31,422


వెండి (కేజీ) రూ. 38,789


కోడిగుడ్లు (వందకి)			
హైదరాబాద్	433	విజయవాడ	441
ఒక్కగుడ్డుకు	4.70	చెన్నై	455
వరంగల్	433	ముంబయి	484



16 నెలల కనిష్టానికి కీలక రంగాల వృద్ధి



న్యూఢిల్లీ: దేశం వెలిగిపోతోందని మోడీ సర్కారు ప్రకటనలు చేస్తున్నప్పటికీ.. ఆర్థిక వ్యవస్థలో మందగమన పరిస్థితులు కొనసాగు తూనే ఉన్నాయి. తాజాగా విడుదలైన ఎనిమిది కీలక రంగాల వృద్ధి ఈ విషయాన్ని మరోమారు నిరూపితం చేసింది. నవంబరు మాసంలో ఆర్థిక వ్యవస్థలోని ఎనిమిది కీలక రంగాల వృద్ధి 3.5 శాతానికి పడిపోయి.. 16 నెలల కనిష్టానికి చేరింది. 2017 జులైలో కీలక రంగాలలో కనిష్ఠంగా 2.9 శాతం వృద్ధి నమోదు అయింది. ఆ తరువాత మళ్లీ ఈ రంగాల వృద్ధి ఇంత కనిష్టానికి చేరడం ఇదే ప్రప్రథమం. బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, చమురు శుద్ధి ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, విద్యుత్తు రంగాల సమిష్టి వృద్ధి గత ఆర్థిక సంవత్సరంలో 6.9 శాతంగా నమోదు అయింది. అయితే ఈ ఏడాది నవంబరులో ముడి చమురు, ఎరువుల రంగాల్లో వరుసగా 3.5, 8.1 శాతం ప్రతికూల వృద్ధి నమోదు కావడం విశేషం. ఈ నేపథ్యంలోనే ఆర్థిక రంగంలోని ఎనిమిది కీలక రంగాల వృద్ధి 16 నెలల కనిష్టానికి చేరినట్టుగా ప్రభుత్వ గణాంకాల ద్వారా తెలుస్తోంది.

హైయర్ నుంచి 'పెద్ద' వాషింగ్ మెషిన్



న్యూఢిల్లీ: ప్రపంచ హోమ్ అప్లియాన్సెస్, కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ రంగ దిగ్గజ సంస్థ హైయర్ అత్యధిక సామర్థ్యంతో కూడిన సరికొత్త టాప్‌లోడ్ వాషింగ్ మెషిన్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. 'హెచ్‌డబ్ల్యుఎం 100-678ఎన్‌జెడ్‌ఫీ' సిరీస్‌లో 10 కేజీ సామర్థ్యంతో ఈ వాషింగ్ మెషిన్‌ను అందుబాటులోకి తెచ్చినట్టు సంస్థ తెలిపింది. 360 డిగ్రీల వాటర్ ఫాల్ టెక్నాలజీతో దీనిని అభివృద్ధి చేసినట్టుగా సంస్థ తెలిపింది. దీనికి తోడు పెద్ద డిస్ప్లే, మేటి యూజర్ నియం త్రణ, డైరెక్ట్ మోటార్ ఇన్వెర్టర్ మోటర్ ఈ మెషిన్ ప్రత్యేకతలని కంపెనీ తెలిపింది. లాండ్రీ అవసరాలను దృష్టిలో పెట్టుకొని దీనిని రూపొందించి నట్టుగా సంస్థ తెలిపింది. మేటి మోటార్, ఓషెన్ వేవ్‌డ్రమ్, అత్యాధు నిక టెక్నాలజీ కారణంగా ఈ మిషన్ వాడకంతో 30శాతం మేర సమయం, విద్యుత్తు ఆదా అవుతుందని హైయర్ ఇండియా సంస్థ అధ్యక్షుడు ఎరిక్ బ్రగాన్జా తెలిపారు. ఈ సరికొత్త వాషింగ్ మెషిన్ ధరను కంపెనీ రూ.43,750గా నిర్ణయించింది. మేటి కస్టమర్ సర్వీస్ ఎక్స్‌పీరియన్స్‌తో పాటు ఈ మెషన్ మోటర్‌పై లైఫ్‌టైమ్ వారంటీని అందిస్తున్నట్టుగా సంస్థ తెలిపింది.

యాక్సిస్‌లో ముగిసిన శిఖా ప్రస్థానం



న్యూఢిల్లీ: యాక్సిస్ బ్యాంక్ అధినేత పదవి నుంచి శిఖా శర్మ తప్పుకున్నారు. సోమవారం బ్యాంక్ వేళలు ముగిసిన తదుపరి నుంచి ఆమె పదవీ విరమణ అమలులోకి వచ్చినట్టుగా యాక్సిస్ బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. బ్యాంక్ కొత్త సీఈవో, ఎండీగా అమితాబ్ చౌదరీ నియామకం మంగళవారం నుంచి అమలులోకి వస్తుందని బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. గత సెప్టెంబరులోనే శిఖా శర్మ వారసుడిగా అమితాబ్‌ను బ్యాంక్ ఎంపిక చేసిన విషయం తెలిసిందే.

పేదరిక నిర్మూలనకే ఆర్బీఐ నిధులు..

'లోటు'ను పూడ్చుకొనేందుకు కాదు..: జైట్లీ

- అదనపు వ్యయ ప్రతిపాదనకు లోక్‌సభ 'సై'

న్యూఢిల్లీ: భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) వద్ద మిగులు నిధులను తమ ఖాతాలోకి వేసుకోవాలని చూస్తోన్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అందుకు తాజాగా సరికొత్త కారణాన్ని తెరపైకి తీసుకు వచ్చింది. ద్రవ్యలోటు పెరిగి పోయి ఎన్నికల ఏడాది ప్రజాకర్షక పథాకలను తెచ్చేందుకు సరైన నిధులు లేక ఇబ్బంది పడుతున్న సర్కారు ఆర్బీఐ నిధులపై కన్నేసిన సంగతి తెలిసిందే. ఇందుకు తగ్గట్టుగా ప్రయత్నాలను కూడా ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ప్రతి పక్షాలతో సహా.. సర్వత్రా విమర్శలు పెరిగిపోవడంతో సర్కా రు తాజాగా రూటు మార్చినట్టుగా కనిపిస్తోంది. పెరిగిపో తున్న ద్రవ్యలోటు పూడ్చుకొనేందుకు తాము ఆర్బీఐ నిధుల ను కోరడం లేదని.. దేశంలో పేదరిక నిర్మూలన కార్యక్ర మాల్లో వేగం పెంచేందుకే తాము ఆ సొమ్ము కోరుతు న్నట్టుగా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సోమవారం లోక్‌సభకు అధికారికంగా తెలిపారు. దీనికి తోడు నిధుల కొరత ఎదు ర్కొంటున్న బ్యాంకులకు మరింత మూలధన సాయం అందించేందుకు



కూడా ఆర్బీఐ నిధులు అవసరమని భావిస్తు న్నట్టుగా ఆయన వివరించారు. ప్రభుత్వం అదనపు వ్యయం కోసం లోక్‌సభలో ప్రవేశపెట్టిన 'అదనపు వ్యయానికి నిధుల' అభ్యర్థనపై ఆయన వివరణనిస్తూ వివిధ అంశాలపై సర్కారు విధానాలను వెల్లడించారు. కేంద్రంలోని మోడీ సర్కారు ద్రవ్యలోటును నియంత్రణలో ఉంచే విషయంలో మేటి పని తీరుతో ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. ఆర్బీఐ ఎకనామిక్ క్యాపిటల్ ఫ్రేమ్‌వర్క్‌పై (ఈసీఎఫ్) జైట్లీ వివర ణనూ ప్రపంచంలో చాలా కేంద్ర బ్యాంకులు 8 శాతం రిజర్వులను మాత్రమే కలిగి ఉంటాయని.. కొన్ని దేశాల పెద్ద బ్యాంకులు 14 శాతం వరకు నిధులను కలిగి ఉన్నాయని ఆయన అన్నారు. కానీ దేశంలోని ఆర్బీఐ మాత్రం ఇందుకు భిన్నంగా అత్యధికంగా దాదాపు 28% నిధులతో రిజర్వును కొనసాగిస్తోందని ఆయన అన్నారు. అయితే పెద్ద బ్యాంక్ వద్ద ఎంత మొత్తంలో నిధులు ఉండాలన్న విషయంపై నిపుణుల కమిటీ అధ్యయనం జరిపి నిర్ణయం తీసుకుంటుం దని ఆయన అన్నారు. అవసరానికి మించిన ఆర్బీఐ నిధులను పేదరిక నిర్మూలణ పథకాలను వేగవంతం చేసేందుకు, బ్యాంకులకు మూలధన సాయం అందంచేం దుకు వినియో గించనున్నట్టుగా ఆయన తెలిపారు. ఆర్థిక మంత్రి వివరణ అనంతరం దిగువ సభ ప్రభుత్వం ప్రతిపాది ంచిన రూ.86 వేల కోట్ల 'అదనపు వ్యయానికి నిధులు' ప్రతిపాదనకు సమ్మతి తెలిపింది. గడిచిన నాలుగేండ్ల కాలంలో తమ సర్కారు ద్రవ్యలోటు, ద్రవ్యోల్బణం, కరెంటు ఖాతాల నియంత్రణలో మేటిగా పని చేస్తూ వస్తోందని అన్నారు. పన్ను పరిధిని పెంచేందుకు గాను జీఎస్టీ ఎంతగానో సహాయపడుతోందని ఆయన తెలిపారు.

2018కి నష్టాలతో వీడ్కోలు..!

ముంబయి: 2018 చివరి రోజున దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలతో ముగించాయి. 2018 చివరి రోజు సోమవారం మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో బీఎస్ఈ సెన్సెక్స్ 8 పాయింట్లు తగ్గి 36,068 వద్ద నమోదయ్యింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 2 పాయింట్లు లాభపడి 10,862 వద్ద ముగిసింది. ఉదయం 36,239 వద్ద ప్రారంభమైన సెన్సెక్స్ ఆసియా మార్కెట్ల సానుకూల సంకేతాలతో సెన్సెక్స్ 36,285 పాయింట్ల గరిష్ట స్థాయిని తాకింది. అనంతరం అమ్మకాల ఒత్తిడితో రోజంతా ఒత్తిడికి గురై.. ఓ దశలో 36,034 కనిష్ట స్థాయిని తాకింది. సెన్సెక్స్‌లో టాటా స్టీల్ 1.59 శాతం, వేదాంత 1.48 శాతం, సన్ ఫార్మా 1.42 శాతం, టాటా మోటార్స్ 1.05 శాతం, ఇండుస్‌ఇండ్ బ్యాంకు 1.04 శాతం చొప్పున అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు భారతీ ఎయిర్‌టెల్ 1.04 శాతం, యాక్సిస్ బ్యాంకు 0.87 శాతం, హీరో మోటో కార్ప్ 0.78 శాతం, ఎన్‌టీపీసీ 0.77 శాతం, కోల్ ఇండియా 0.66 శాతం చొప్పున అధికంగా నష్ట పోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. 2018లో స్థూలంగా సెన్సెక్స్ 5.91 శాతం పెరిగింది. ఇదే బాటలో నిఫ్టీ 3.15 పాయింట్లు రాణించింది. నిఫ్టీలో బ్యాంకింగ్ స్టాక్ అత్యధికంగా 6.25 శాతం పెరిగింది. బిఎస్‌ఇలో మిడ్‌క్యాప్ 13.38 శాతం, స్మాల్‌క్యాప్ 23.53 శాతం చొప్పున నష్టపోయాయి. ఈ నేపథ్యంలో మదుపరులు దాదాపు రూ.7.25 లక్షల కోట్ల మేర సంపదను కోల్పోయారు.

కొత్త ఏడాదిలో ఒడిదుడుకులే..!

కొత్త సంవత్సరాది 2019లో దేశీయ మార్కెట్లు ఒడిదుడుకులకు గురయ్యే అవకాశం ఉందని నిపుణులు



పేర్కొంటున్నారు. ముఖ్యంగా వచ్చే నాలుగైదు నెలల్లో జరుగనున్న సాధారణ ఎన్నికలు, అంతర్జాతీయంగా చమురు ధరలు, ప్రపంచ దేశాల మధ్య చోటు చేసుకుంటున్న వాణిజ్య యుద్ధ భయాలు తదితర అంశాలు భారత మార్కెట్లపై కీలక ప్రభావం చూపించే అవకాశాలున్నాయి. 2019 ప్రథమార్థంలో ముఖ్యంగా బడ్జెట్, లోకసభ ఎన్నికల ఫలితాలు ప్రభావం చూపించనున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆ తర్వాత ఎన్నికల ఫలితాలపై మదుపర్లు దృష్టి సారించే అవకాశం ఉంది. సార్వత్రిక ఎన్నికలతో పాటు అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితులు కూడా మార్కెట్లను ప్రభావితం చేయనున్నట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అభిప్రాయపడ్డారు. అదే విధంగా అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ కూడా ప్రభావం చూపనుందన్నారు.

మానసిక వ్యాధులకు.. మహత్తర చికిత్స..

- నల్లగొండలో 'సమీక్షన్యూరోసైకియాట్రిక్'..
- 40 పడకల అధునాతన ఆసుపత్రి ఏర్పాటు
- మూఢనమ్మకాలు పారద్రోలడమే లక్ష్యం: మానసిక వైద్య నిపుణులు డాక్టర్ శివరామకృష్ణ



నవతెలంగాణ-క్లాక్‌టవర్

మానసిక వ్యాధులతో బాధపడుతున్న ప్రజలకు మేటి చికిత్సా సేవలను అందించేందుకు గాను నల్లగొండలో అత్యాధునిక ఆసుపత్రి అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ మానసిక వైద్యులు శివరామకృష్ణ నల్లగొండలో 'సమీక్ష న్యూరోసైకియాట్రిక్' పేరుతో ఈ ఆస్పత్రిని అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఐదంతస్థుల భారీ భవనంలో 40 పడకలతో ఈ ఆస్పత్రిని అందుబాటులోకి తెచ్చినట్టుగా ఆయన సోమవారం వివరించారు. నూతన సంవత్సరం మొదలుకొని అధునాతన వైద్యసేవలు ప్రారంభిస్తున్నట్టుగా ఆయన తెలిపారు. నల్లగొండ ఉమ్మడి జిల్లాలో సుమారు నలభై లక్షల మంది జనాభాకు ఇలాంటి ఆస్పత్రి అవసరమని భావించాననీ, అందుకే మానసిక వ్యాధులతో బాధపడుతున్న వారు చికిత్సా సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా జిల్లా కేంద్రంలోనే చికిత్స పొందేలా చొరవ తీసుకొని 'సమీక్ష న్యూరోసైకియాట్రిక్' ఆసుపత్రిని అందుబాటులోకి తెచ్చినట్టుగా ఆయన వివరించారు. శాస్త్ర సాంకేతికత మేటిగా అభివృద్ధి చెందిన ఆధునిక కాలంలోనూ.. ప్రజలను నేటికీ మూఢనమ్మకాలు పట్టిపీడిస్తున్నాయనీ, అందుకే మానసిక జబ్బులకు చరమగీతం పాడాలని నల్లగొండలో సకల సౌకర్యాలతో సమీక్ష న్యూరోసైకియాట్రిక్ ఆస్పత్రిని ప్రారంభించామని మానసిక వైద్యులు శివరామకృష్ణ వివరించారు.

అధునాతన సౌకర్యాలు ప్రత్యేకం..

ఆస్పత్రిలో ఎమర్జెన్సీ కేసుల కోసం 2 క్యాజువాలిటీ గదులు, ఏడు పడకలతో పురుషుల వార్డు, 6 పడకల స్త్రీల వార్డు, 2 పడకల చిన్నపిల్లల వార్డు, తీవ్రంగా గొడవ చేసేవారికి ప్రత్యేకంగా 3 సెక్లూషన్ గదులు, 6 మంచాల వార్డుతో పాటు 3 స్పెషల్ రూములు అందుబాటులో ఉన్నాయన్నారు. పరిస్థితి తీవ్రంగా ఉన్నవారి కోసం ఎలక్ట్రో కన్వెల్షన్ థెరపీ (షాక్ ట్రీట్మెంట్), ఐదు పడకల ఐసీయూ సదుపాయం ఉన్నదని తెలిపారు. ఇన్ పేషెంట్స్ కోసం డైనింగ్ హాలు, వారి ఆహ్లాదం కోసం రిక్రియేషన్ గదిలో లైబ్రరీ, టీవీ, వార్తా పత్రికలు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. పేషెంట్ల భద్రత కోసం యాంటీ స్కిడ్ టైల్స్, వారి ఆత్మహత్య నివారణ కోసం యాంటీ సూసైడ్ విండో గ్రిల్స్, గోడలకు ఫిక్స్ చేసిన ఫ్యాన్లు, పగలని గ్లాసుతో చేయబడిన కిటికీ అద్దాలు అమర్చామన్నారు. పేషంట్ల భద్రత కోసం 70 సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. త్వరలో స్వచ్ఛంద సంస్థను నెలకొల్పి గ్రామాల్లో అవగాహనా సదస్సులు, క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

పేదలకు ఎన్నారైల దుప్పట్ల పంపిణీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

టీఆర్ఎస్ యూకే ఎన్నారై శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో పేదలకు దుప్పట్లను, పండ్లను సోమవారం పంపిణీ చేశారు. యూకే అధ్యక్షులు అశోక్ గౌడ్ మాట్లాడుతూ తన మిత్రులు ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా పేదలకు ఎన్నారై తెరాస ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేస్తునందుకు కృత్ఞతలు తెలిపారు, ఈ సంవత్సరం టీఆర్‌యస్ ఎన్నారై విభాగం వ్యవస్థాపకులు అనిల్ కూర్మాచలంతో కలిసి రోడ్ల పక్కన ఉండేవాళ్లకు దుప్పట్లను అందజేయటం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నారైలు ప్రవీణ్ పంతులు, సుభాష్ కుమార్, హైదరాబాదీలు సయిద్ అస్లాం అలీ , యాసీన్, మాధవ్ యాదవ్, వెంకటేష్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

అమెరికా కొత్త రక్షణ మంత్రిగా షనాహన్


వాషింగ్టన్: అమెరికా తాత్కాలిక రక్షణ మంత్రిగా పాట్రిక్ షనాహన్ నియమితులయ్యారు. ఆయన మంగళవారం నాడు బాధ్యతలు స్వీకరిస్తారని అధ్యక్ష భవనం వైట్‌హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుత రక్షణ మంత్రి జిమ్ మాటిస్ రాజీనామా నేపథ్యంలో రక్షణశాఖ ఉప మంత్రిగా వున్న షనాహన్‌కు పదోన్నతి కల్పించినట్లు పేర్కొంది. అధ్యక్షుడు ట్రంప్ వ్యవహార శైలితో దీర్ఘకాలంగా కొనసాగుతున్న విభేదాల నేపథ్యంలో మాటిస్ తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ట్రంప్ హయాంలో విదేశాంగ విధానంలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్న కీలక సమయంలో షనాహన్ అమెరికా రక్షణ మంత్రిగా బాధ్యతలు స్వీకరించటం విశేషం. సిరియా నుంచి పూర్తి స్థాయిలో సేనలను ఉపసంహరించాలని, ఆఫ్ఘనిస్తాన్ నుండి 50 శాతం మేర సేనలను ఉపసంహరించాలని అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ట్రంప్ అనూహ్య రీతిలో తన నిర్ణయాలను ప్రకటిస్తుండటంతో అమెరికన్ ప్రజా ప్రతినిధులు, అంతర్జాతీయ మిత్రులు ఏ క్షణం ఏ నిర్ణయం వెలువడుతుందోనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

సీఎం ప్రత్యేక కార్యదర్శులుగా కొనసాగింపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ప్రత్యేక కార్యదర్శులుగా పి. రాజశేఖర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డిలను కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను సోమవారం జారీ చేసింది. సీఎం ముఖ్యకార్యదర్శిగా నర్సింగ్‌రావు కొనసాగుతారు. ముఖ్యమంత్రి కార్యదర్శిగా స్మితాసబర్వాల్, సందీప్‌కుమార్ సుల్తానియా ఉండనున్నారు. సీఎం అదనపు కార్యదర్శిగా మాణిక్‌రాజ్ కొనసాగనున్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం : అత్యవసర సమావేశంలో పుతిన్



మాస్కో : రష్యాలో మాగ్నిటోగోర్స్క్ నగరంలోని 10 అంతస్థుల భవనం సోమవారం కూలిపోయింది. ఈ ఘటనలో నలుగురు మృతిచెందారు. వందలాది మంది భవన శిథిలాల కింద చిక్కుకున్నారు. ఈనేపథ్యంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అత్యవసర సమావేశం నిర్వహించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలు వేగవంతం చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. కాగా, మాగ్నిటోగోర్స్క్ నగ రం రాజధాని మాస్కో నుంచి 1400 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

ప్రాథమిక హక్కుల్లో చైల్డ్ కేర్

మహిళా కార్మికుల డిమాండ్

కేర్ సెంటర్ల వల్ల ఆదాయాలు పెరిగాయి

- పౌష్టికాహారం, అక్షరాస్యతల్లో మెరుగుదల: అధ్యయనంలో వెల్లడి





న్యూఢిల్లీ: దేశంలోని చిన్నారుల్లో పౌష్టికాహార లోపంపై ఏటేటా గణాంకాలు ఇవ్వడమే తప్ప తగిన నివారణా చర్యలు చేపట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవు తున్నాయి. తమ పసి బిడ్డల ఆలనాపాలనా చూసుకోవాల్సిన సమయంలో పేద మహిళలు కుటుంబ పోషణ కోసం పొలాల్లోనో, పారిశ్రామికవాడల్లోనూ ఉండాల్సి వస్తోంది. పొద్దున్నే సద్దిమూటలు కట్టుకొని పనికి వెళ్లే శ్రామిక మహిళల సంఖ్య కోట్లల్లో ఉన్నది. వీరిలో 90 శాతంమంది అసంఘటిత రంగాల్లో పని చేస్తుండటం వల్ల తమ చిన్నారు లను వెంట తీసుకువెళ్లే పరిస్థితి ఉండదు. అంతేకాదు సంఘటిత రంగాల్లోనూ మహిళలకుండే మాతృత్వ సెలవులు తక్కువే. దీంతో, అటు ఉద్యోగాలు చేసే మధ్య తరగతి, కార్మికులుగా పని చేసే పేద మహిళలూ తమ చిన్నారులకు బాల్యదశలోనే దూరంగా ఉండాల్సిన పరిస్థితి. దీనికి పరిష్కారమెల్లా పని స్థలాల్లో చైల్డ్ కేర్ సౌకర్యాలు కల్పించడమేనని సామాజికవేత్తలు సూచిస్తున్నారు. దీంతో మహిళల ఆదాయం పెరుగుతుందని వారు చెబుతున్నారు. చిన్నారుల్లో పౌష్టికాహార లోపానికి ప్రధాన కారణం పేదరికమేనన్నది గమనార్హం.

సవితాబెన్ గుజరాత్‌లోని ఓ గ్రామంలో పొగాకు పరిశ్రమలో కార్మికురాలు. ఆమెకు ఐదేండ్లలోపు చిన్నారులు ఇద్దరున్నారు. ప్రతిరోజూ ఉదయమే ఆమె పనికి వెళ్తారు. తన చిన్నారులను స్వయం ఉద్యోగిత మహిళా సంఘం(సేవా) నిర్వహించే కేర్ సెంటర్‌లో వదిలేస్తారు. సుమన్‌బెన్,శారదాబెన్ అనే రైతు మహిళలు ఈ కేర్ సెంటర్‌లో సేవలందిస్తున్నారు. 'గతంలో నాలాంటి రైతు మహిళలు వ్యవసాయ క్షేత్రాల్లో ఓ చీరను రెండు చెట్లకు కట్టి అందులో చిన్నారులను పడుకోబెట్టేవారం. అప్పుడప్పుడూ ఆ చిన్నారులు దొర్లి కింద పడిపోయి ఏడ్చేవారు. దూరాన క్షేత్రాల్లో ఉన్న తమకు ఆ ఏడుపు కేకలు కూడా వినిపించేవి కావు. ఇప్పుడు మా చిన్నారులకు తగిన రక్షణ ఉన్నది. మేం రెండు షిఫ్టులు ప్రశాంతంగా పని చేయగలుగుతున్నాం' అంటూ సవితాబెన్ తన అనుభవాల్ని చెప్పారు. ఆ రాష్ట్రం లోని 15 లక్షల కార్మికుల కోసం సేవా సేవలం దిస్తోంది. సేవా నిర్వహిస్తున్న ఈ చైల్డ్ కేర్ సెంటర్లకు అవసరమైన నిధుల్లో 20 శాతం స్వచ్ఛంద సంస్థల నుంచే సేకరిస్తున్నామని వారు తెలిపారు. కార్మిక మహిళల హక్కుల కోసం సేవాతోపాటు మొత్తం 300 సంస్థలు ఫోర్సెస్ పేరుతో ఐక్య కూటమిగా పని చేస్తు న్నాయి. పేద మహిళలను జాతీయస్థాయిలో సంఘటితం చేసి చిన్నారుల భద్రతను ప్రాథమిక హక్కుల్లో చేర్చాలన్న డిమాండ్‌పై ప్రచారం చేయనున్నాయి. చైల్డ్ కేర్‌ను ప్రాథ మిక హక్కుల్లో చేర్చడం ద్వారా అందుకు తగిన వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై పడుతుంది. 1970 ప్రారంభంలోనే చైల్డ్ కేర్ వసతుల కల్పనకు సేవా శ్రీకారం చుట్టింది. సేవా పని చేసిన ప్రాంతాల్లో కార్మికుల చిన్నారుల పరిస్థితి మెరుగ్గా ఉన్నట్టు అక్కడి కార్మిక నేతలు చెబుతు న్నారు. ఆ ప్రాంతాల్లోని చిన్నారులు ఆరోగ్యంగా ఉండట మేగాక వారంతా హైస్కూల్ విద్యను పూర్తి చేసినట్టు తెలిపారు. విద్యాహక్కు చట్టం కింద పలువురు చిన్నారులు ప్రయివేట్ పాఠశాలల్లోనూ చదువుకోగలిగారు. చాలామంది కాలేజీ చదువులు పూర్తి చేసి హెల్త్‌కేర్, ఐటీ రంగాల్లోనూ ఉద్యోగాలు సాధించారు. 50 శాతం మహిళల ఆదాయం పెరిగింది. గతంలో ఇంట్లో ఉండి తమ తోబుట్టువుల సంర క్షణ చూసిన పెద్ద పిల్లల్లో 70 శాతంమంది ఇప్పుడు బడికి వెళ్లి చదువుకోగలుగుతున్నారు. దేశంలోని మిగతా చోట్ల మహిళా కార్మికుల సంఖ్య తగ్గుతుండగా, చైల్డ్‌కేర్ సౌకర్యా లున్నచోట పెరుగుతున్నట్టు అధ్యయనంలో తేలింది. చైల్డ్ కేర్ సెంటర్ల వల్ల మరో ప్రయోజనం కూడా ఉన్నట్టు నిర్వా హకులు తెలిపారు. చిన్నారులకు ఆరోగ్య సేవలను(టీకాలు, వగైరా) ఒకేచోట అందించేందుకు వీలవుతోందని నిర్వా హకులు తెలిపారు. దీంతో, ఏఎన్ఎంల(మహిళా ఆరోగ్య కార్యకర్తల) పని సులభమవుతోందన్నారు. చైల్డ్ కేర్ సెంటర్ల వల్ల మహిళా కార్మికుల ఆదాయాలు పెరగడమేగాక, వారి పిల్లలు ఉన్నత చదువులవైపు వెళ్లేందుకు అవకాశాలు కల్పించాయని సేవా అనుభవాలతో స్పష్టమవుతోంది.

రేడియోగ్రాఫర్ పోస్టుల మెరిట్ జాబితా విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖలో ప్రకటించిన రేడియోగ్రాఫర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల మెరిట్ జాబి తాను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) సోమవారం విడుదల చేసింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ ఓ ప్రకటన విడుదల చేశారు. కోర్టు ఆదేశాల మేరకే మెరిట్ జాబితాను ప్రకటించామని తెలి పారు. రేడియో గ్రాఫర్ పోస్టులకు 1101 మంది దరఖాస్తు చేశారనీ, వారిలో 940 మంది మెరిట్ జాబితాలో ఉన్నారని పేర్కొన్నారు. పారామెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ పోస్టులకు 233 మంది దరఖాస్తు చేస్తే, 88 మంది మెరిట్ జాబితాలో ఉన్నారని తెలిపారు. ఫార్మాసిస్ గ్రేడ్-2 పోస్టులకు 17,126 మంది దరఖాస్తు చేయగా, 11,954 మంది మెరిట్ జాబితాలో చోటు సంపాదించారని పేర్కొన్నారు.

గిరిజన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు నలుగురు ఎంపిక

గిరిజన సంక్షేమ శాఖలో హాస్టళ్ల సంక్షేమ ఆఫీసర్ పోస్టులకు నలుగురు ఎంపికయ్యారని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ వివరాలు



టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని పేర్కొన్నారు.

గురుకుల లైబ్రరియన్ పోస్టుల ఫలితాలు విడుదల

రాష్ట్రంలో బీసీ, గిరిజన సంక్షేమ గురకులాల్లో ప్రకటించిన లైబ్రరియన్ పోస్టుల ఫలితాలను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ సోమవారం ప్రకటన విడుదల చేశారు. లైబ్రరియన్ పోస్టులకు మెయిన్ రాతపరీక్ష 2018, మే 12న జరిగిందని తెలిపారు. ఇంటర్వ్యూలు 2018 డిసెంబర్ 19, 20 తేదీల్లో జరిగాయని పేర్కొన్నారు. లైబ్రరియన్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు.

432 మంది పోలీసులకు నూతన సంవత్సర పతకాలు

- రాష్ట్ర అవతరణ దినోత్సవాన ప్రధానం




నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి- హైదరాబాద్

నూతన సంవత్సరం 2019ని పురస్కరించుకుని విధి నిర్వహణలో విశిష్ట సేవలందించిన 432 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి పోలీసు పతకాలను ప్రకటించింది. ఇందులో అత్యుత్తమ సేవలందించిన 16 మందికి శౌర్య పతకాలు, 17 మందికి మహోన్నత సేవ పతకాలు ప్రకటించారు. మిగతావారికి కఠిన సేవా పతకాలు, ఉత్తమ సేవా పతకాలు, సేవా పతకాలు ప్రకటించారు. పతకాలు పొందిన వారిలో చాలా వరకు గ్రేహౌండ్స్, బెటాలియన్స్, ఆక్టోపస్, నిఘా విభాగానికి చెందిన అధికారులు, సిబ్బంది ఉన్నారు. వీరికి రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2న ఈ పతకాలను బహుకరించనున్నారు.

13 నుంచి15 వరకు స్వీట్ ఫెస్టివల్

- పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్‌కు అనుబంధంగా జనవరి13 నుండి 15 వరకు (మూడు రోజులు) సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో 'ఇంటర్నేషనల్ స్వీట్ ఫెస్టివల్'ను నిర్వహిస్తున్నామని పర్యాటక, సాంస్కృతికశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. బేగంపేటలోని పర్యాటక భవన్‌లో సోమవారం ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలో నివసిస్తున్న వివిధ రాష్ట్రాల, దేశాలకు చెందిన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. గతేడాది నిర్వహించిన ఇంటర్నేషనల్ స్వీట్ ఫెస్టివల్‌లో వెయ్యి రకాల స్వీట్స్‌ను ప్రదర్శించామని ఈ సందర్భంగా బుర్రా తెలిపారు. ఈ ఫెస్టివల్‌లో వివిధ రాష్ట్రాలతోపాటు 15 దేశాల నుండి ప్రతినిధులు వారి సాంప్రదాయ స్వీట్స్‌తో హాజరయ్యారని తెలిపారు. సుమారు 8 లక్షల మంది సందర్శకులు పాల్గొన్నారని చెప్పారు. వెయ్యి రకాల స్వీట్స్, వివిధ రకాల పతంగులను ఒకే వేదికపై చూడటానికి సందర్శకులు రావడం ఆనంద దాయకమని తెలిపారు. ఈ సంవత్సరం నిర్వహించే స్వీట్ ఫెస్టివల్‌లో సుమారు 20 దేశాల ప్రతినిధులు స్వీట్ స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నారని చెప్పారు. సుమారు 10 లక్షల మంది సందర్శకులు వచ్చే అవకాశం ఉందని.. వారికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు.

భారత దేశంలోనే కాక ప్రపంచం మొత్తం మీద చూసినప్పుడు ప్రాచీన రాజులు, చక్రవర్తులందరిలోనూ మొదటి స్థానంలో నిలిచేవాడు అశోకుడు. యుద్ధంలో విజయం సాధించిన తర్వాత విజయగర్వంతో సింహనాదాలు చేసే రాజుల గురించి తెలుసు. కాని తాను సాధించిన విజయం చూసి దు:ఖంతో కుంగిపోయినవాడు మాత్రం అశోకుడే. యుద్ధంలో లక్షలాదిమంది చనిపోవడం, క్షతగాత్రులవ్వడం, బందీలుగా చిక్కడం తలచుకొని... వారి బంధువులు, స్నేహితులు ఎంతగా బాధపడ్డారో కదా అని విలపించినవాడు అశోకుడు. యుద్ధ విజయం కంటే దమ్మ (బౌద్ధ ధర్మ) విజయమే అత్యున్నతమైనదని ఆయన భావించాడు. మౌర్య సామ్రాజ్య పట్టాభిషిక్తుడైన ఎనిమిదేండ్లకు కళింగ (ఒరిస్సా) రాజ్యాన్ని జయించిన తర్వాత కలిగిన పరివర్తనతో అశోకుడు అనేక శాసనాలు వేయించాడు. అందులో ఓ రాతిపై కాందహార్‌లో వేయించిన (మేజర్ రాక్ ఎడిక్ట్ 13) శాసనం ఒకటి. ప్రస్తుతం ఆఫ్ఘనిస్థాన్‌లో ఉన్న ఈ శాసనం గ్రీకు, అరామిక్ భాషలో ఉన్నది. 14వ శాసనంతో పాటు 13వ శాసనం కూడా ఈ రెండు భాషల్లో జారీచేశాడు అశోకుడు. అశోకుని మానసిక పరివర్తనను, అతడి కాలపు నాటి సమాజం, ఇరుగుపొరుగు రాజులు, అతడు జయించిన రాజుల సమాచారం ఉన్న క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దానికి చెందిన పదమూడవ రాతి శాసనం తెలుగు అనువాదం 'జాతర' పాఠకుల కోసం...



సాంచిలోని రామగ్రామ స్థూపం సందర్శనకు వెలుతున్న అశోకుని శిల్పం

యుద్ధం తెచ్చిన పరివర్తనతో...



అశోకుని 13వ శిలాశాసనం

రాజా దేవానాంపియ పట్టాభిషేకం తర్వాత 8వ ఏట కళింగపై విజయం సాధించాడు. వంద వేలకు ఒకటిన్నర రెట్లు ఎక్కువ మందిని బందీలుగా తీసుకెళ్లారు. వంద వేల మంది నరికివేయబడ్డారు (యుద్ధంలో), మరియు దాదాపు అంతమంది మరణించారు. కళింగులు లొంగిపోయిన తర్వాత దేవానాంపియలలో దమ్మ కోసం పోరాడాలన్న, దమ్మను సాధించాలన్న, దమ్మను బోధించాలన్న కొత్త దృష్టి తలెత్తింది. కళింగులను జయించినందుకు అతడిలో పశ్చాత్తాపం మొదలయింది. ఓడనివారిని ఓడించడమంటే సంహారం, మరణం, జనాన్ని (బందీలుగా) తరలించుకుపోవడం. ఇది బాధాకరం. తీవ్రమైన విషయం అని దేవానాం పియ భావించాడు. అంతకంటే తీవ్రమైన అంశం: అక్కడ నివసించేవారు బ్రాహ్మణులు, సమనులు (శమణులు), ఇతర తెగలు (పాసండులు), గృహస్తులు. వారిలో తమవారి పట్ల విధేయత, తల్లిదండ్రుల పట్ల విధేయత (కనిపిస్తూ) ఉంది; అక్కడ జీవించేవారిలో స్థితిమంతులు ఉన్నారు. వారు పెద్దల పట్ల విధేయత, స్నేహితులపట్ల, పరిచయస్తులు, సహచరులు, బంధువుల పట్ల; చివరకు బానిసలు, సేవకుల పట్ల దయ, దృఢమైన అనుబంధం కలిగి ఉన్నారు. అలాంటివారు గాయపడ్డారు, చంపబడ్డారు, ఆప్తుల నుంచి ఎడబాటుకు గురిచేయబడ్డారు. లేదా, ఒకవేళ వారు అన్ని సువిధాలు (సువిహితినం) కలిగినవారై, స్నేహితుల, పరిచయస్తుల, సహచరుల, బంధువుల పట్ల నిరంతర (తరగని) అభిమానం గలవారైఉండి, ఆ ప్రియమైన వారిని దురదృష్టం వెంటాడటం వల్ల వారు కూడా బాధకు లోనయ్యారు. మనుషులందరికీ ఇది దురదృష్టం; దేవానాంపియకు ఇది తీవ్రమైన విషయం.

బ్రాహ్మణులు, సమనులు అనే వర్గాలు లేని యోనుల (గ్రీకుల) భూభాగం తప్ప మరే ఇతర భూభాగం (జనపదం) లేదు, ఏ ఇతర భూభాగం (జనపద) మనుషులు ఏదో ఒక వర్గంతో సంబంధం లేని ప్రాంతం లేదు, (ముందు) ప్రస్తావించిన వర్గాల పేర్లు తప్ప. అందువల్ల కళింగులు లొంగిపోయినప్పుడు, అంతమందిలో కేవలం వందో వంతు వెయ్యోవంతు మందే మరణించినా, ఊచకోతకు గురైనా, (బందీలుగా) తీసుకుపోబడినా, దేవానాంపియకు అది చాలా తీవ్రమైన విషయమే.

ఇవ్వాళ, ఎవరైనా ఒక హానికర కృత్యానికి పాల్పడితే, దేవానాంపియ అతడిని, క్షమించగలిగినవాడైతే, క్షమించాలని కోరుకుంటున్నాడు. దేవానాంపియ రాజ్యంలోని అడవి (అటవి) (జనులను) కూడా, సమాధాన పరచాలని ధ్యానానికి పురికొల్పాలని కోరుతున్నాడు. వారికి దేవానాంపియ పశ్చాత్తాంపం, బలం (కూడా) వివరించడం ద్వారా వారిని సిగ్గుపడేలా చేయవచ్చు. హతులు కాకుండా కాపాడవచ్చు. అన్ని ప్రాణుల పట్ల అహింస, స్వీయ నిగ్రహం, తటస్థభావం, ఆనందం ఉండాలని దేవానాంపియ కోరుకుంటాడు. ఇది (సాధించడం) ప్రధాన విజయంగా– ధమ్మవిజయంగా దేవానాంపియ భావిస్తాడు.

ఇక్కడ (తన భూభాగంలో), ఆరువందల యోజనాల (లీగులు) దూరాన ఎక్కడైతే ఆంటియోకస్ అనే యోన (గ్రీకు) రాజు, ఆ ఆంటియోకస్ ఎగువన గల నలుగురు రాజులు టాలమీ, ఆంటగోనస్, మగాస్, అలెగ్జాండర్‌లు ఉన్నారో ఆ (రాజవంశీక) ఇరుగుపొరుగులందరిలో, అలాగే ఇతర (దిగువ) దిక్కులో (ఉన్నటువంటి) చోట, పాండి యలతో పాటు తంబపమ్ని వరకూ గల భూభాగాలలో దేవానాంపియ దీన్ని, మరోసారి, జయించాడు.

అదేవిధంగా, ఇక్కడ రాజు పాలిత ప్రాంతాల్లోనూ యోన–కాంబోజ, నాభక–నాభపంతీ, భోజ–పితినిక మరియు ఆంధ్ర–పరింద ఇలా ప్రతి రాజ్యంలో దేవానాంపియ దమ్మబోధలు ఆచరిస్తుండేవారు. దేవానాంపియ దూతలు వెళ్లని ప్రాంతాల్లోనూ ఆయన దమ్మ ఆజ్ఞలు బోధనల గురించి విని దమ్మకు నిబద్ధులై ఉండేవారు. అలా సాధించిన విజయం అత్యున్నత విజయం. ఇటువంటి అత్యున్నత విజయం ఆనందాన్నిస్తుంది– ఈ ఆనందం దమ్మ పోరాటం ఫలితంగా వచ్చినటువంటిది. కానీ ఈ ఆనందం (దానికది) చిన్నవిషయమే. కానీ ఈ మహాపుణ్యం మించి ప్రపంచంలో లభించేదేమిటనే దేవానాంపియ ఆలోచిస్తాడు.

నా కుమారులు, మనుమలు మరొక కొత్త విజయం గురించి ఆలోచించక పోవచ్చునని భావించి, ఈ ప్రయోజనం ఆశించి ఈ దమ్మ శాసనం రాయబడింది. ఒక కొత్త విజయం వారిని ఆనందపరిచేట్లయితే సాధుత్వంతో, చిన్నపాటి శిక్షలతో సంతృప్తి పడాలి, విజయం అంటే, అది ఈ ప్రపంచంలో ఈ ప్రపంచం ఆవల కూడా, దమ్మ విజయమై ఉండాలి. ఈ ప్రపంచంలో ఈ ప్రపంచం వెలుపల కూడా శ్రమలో పొందే సంతృప్తే వారి ఆనందం కావాలి.

-జాతర డెస్క్



ఆంటియోకస్



అంటగోనస్

దీవనార్తి నుంచి భాగోతాల వరకు...



వివిధ పాత్రల్లో కొంకుల్ల సంతోష్

గోత్రాలవారు వంశపారంపర్యంగా మున్నూరు కాపులనే కాకుండా పాకనాటి, మోటాటి, గోనె కాపు, పంటి రెడ్డి, సీమకాపు చిట్టెపు, చౌదరి, కమ్మ కాపు, సద్గుణాటి, రెడ్డి గాండ్ల అనే మిగతా కాపులకు గోత్రాలు చెప్పి గోత్ర కట్నం స్వీకరిస్తారు. వీరితో పాటుగా వెలమల గోత్రాలను కీర్తించి కూడా గోత్ర కట్నం స్వీకరించడం జరుగుతుంది. అయితే ప్రస్తుతం కళాకారులు రెడ్డి, మున్నూరు కాపు, గోనె కాపు, చౌదరి కాపు, రెడ్డి గాండ్లను మాత్రమే ఆశ్రయించి తమకు కట్టడి ఉన్న గ్రామాలకు వెళ్లి గోత్రాలను కీర్తించి ప్రతిఫలం పొందుతున్నారు. అయితే మున్నూరు కాపు వారికి ఒకే గోత్రం ఉండగా, మిగతా కాపులకు 116 గోత్రాలు ఉంటాయని వాటన్నింటిని భద్రపరుస్తూ కీర్తిస్తూ వస్తున్నామని వారంటున్నారు.

'రాచవలంభు హరిశ్చంద్రాదిఫలంబభు రాంగ రాంగ మీకు వైభోగ ఫలంభు,మెత్తని వర భూములు మేలని ధనాలు చాలు గట్టిన సవాలక్ష గుర్రాలు,యాడికాడిక పూదోటలు మంచి ఎకరాన బావులు మడ విడ చిత్రాలు,మామిడి వనం తరాలు భూమేలే రెడ్డి రాజా భూపాలాదిగనుండమా శాలోకాది, మన్మథ... జై యాభవ, దిగ్విజయాభవ...

అంటూ గోత్రాలవారు చౌదరి మరియు రెడ్డి వారి దగ్గరికి వెళ్ళినప్పుడు దీవించి కీర్తిస్తారు.

అలాగే వెలమలను

"కంచెల పద్మరాజుండమ గజ గొండ పరుశరామముండమ సోమ కుల పరశురాముండమ, అమరిం చిన దుర్గంభు...77 సింహాస నాలు, 77 రచ్చలు గలుగు రాజులు జై భవ, విజయీ భవ దిగ్విజయీభవ

అంటూ దీవిస్తారు.

కాలక్రమంలో దీవనలతో పాటు కథలు చెప్పి తాము ఆశ్రయించిన కులాలవారిని మెప్పించడం ప్రారంభించారు. వీరనాలు, ఉపంగం వాద్యాలు ఉపయోగించి మహాభారతం లోని 18 పర్వాలను కథా గాన రూపంలో ప్రదర్శించేవారు. ఈ రకంగా కూడా సరైన ఆదరణ లేకపోవడంతో ప్రస్తుతం భాగోతాల రూపంలో ప్రదర్శనలిస్తూ ఆదరణ పొందుతున్నారు. ప్రదర్శనలో పదిమంది వరకు కళాకారులు ఉంటారు. ఆరోజు ప్రదర్శించే కథను బట్టి కళాకారులు ఆయా పాత్రల వేషాలను వారే స్వయంగా వేసుకుంటారు. కథలోని స్త్రీ పాత్రలను మగవారు ధరిస్తారు. భాగోతాన్ని ఆద్యంతం ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా రసవత్తరంగా ప్రదర్శిస్తారు. ప్రదర్శనలో బఫూన్ పాత్ర కీలకంగా ఉంటుంది. రంగస్థలం మీదికి వచ్చిన పాత్రను పరిచయం చేయడం, ప్రేక్షకులకు కలిగే సందేహాలను, తానే అడిగి నివృత్తి చేయడం, హాస్యాన్ని పండించడం ప్రధానంగా చేస్తాడు. ప్రదర్శనకు పవిత్రతను ఆపాదించడం కోసం కళాకారులు పూజాది కార్యక్రమాలు నిర్వహించి ప్రేక్షకులను కూడా భాగస్వాములను చేస్తారు. భాగోతం రాత్రి సమయంలో ఆడినట్లయితే మొదటి రోజు విరామం తీసుకొని ఆ మరుసటి రోజు తిరిగి ఆడతారు. ఈ రకంగా కళాకారులు ఒక్కో గ్రామంలో పది నుండి పదిహేను రోజులు ప్రదర్శిస్తారు. వీరు ప్రదర్శించే భాగోతాలలో మహాభారతం, భాగవతం, రామా యణం కథలతో పాటుగా ఇతర కథలు ఉంటాయి. వీటిలో ద్రౌపదీ స్వయంవరం, కిరాతార్జునీయం, కీచకవధ, భద్రసేన, డాంగినేయం, ధర్మాంగద, సుభద్ర విలాసం, సతీ సావిత్రి, భక్త మార్కండేయ, సుందరాకాండ, వాలి సుగ్రీవ, బాలనాగమ్మ, భూకైలాసం వంటి కథలు సుమారుగా 30 వరకు భాగోతాల రూపంలో ఆడతారు. త్యాగం తీసుకొని ఆడే భాగోతాలు కాకుండా కాపు వారి ఇండ్లలో ఎవరైనా చనిపోయిన సందర్భంలో కూడా భాగోతాలు ఆడతారు. చనిపోయిన వారి జ్ఞాపకార్థం గాకూడా కాపు వారు దానమిస్తారు.

తాళపత్ర ప్రతులు

తమకు వంశపారంపర్యంగా సంక్రమించిన తాళపత్ర ప్రతులు తమ పూర్వీకులే, కాపుల వంశవృక్షాన్ని రాశారని కళాకారులు చెప్తారు. వాటిమీద కట్టడి గ్రామాల్లోని కాపుల ప్రతి కుటుంబం యొక్క వంశక్రమం, పూర్వీకుల పేర్లు సుమారుగా 30 తంతెల వరకు రాయబడి ఉంటాయి. అందుకే గోత్రాల ఎల్లయ్య దగ్గర ఉన్న తాళపత్ర ప్రతులు నాలుగు వందల సంవత్సరాల కింది వని చెప్పటం జరిగింది. కళాకారులు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి గ్రామాలకు వెళ్ళగానే, ఆ గ్రామంలోని కాపు వారికి కలిగిన పురుష సంతానాన్ని, కుటుంబాల సంఖ్యను రాసుకుంటారు. ఒకప్పుడు తాటికమ్మ లమీద కొన్ని సంవత్సరాలు రాసుకోగా, ఆ తర్వాత దస్త్రాల మీద కొన్ని సంవత్సరాలు రాసుకున్నారు. ప్రస్తుతం నేటితరం పుస్తకాలలో రాసుకుంటూ భద్రపరుస్తున్నారు. ఈ తాళపత్ర ప్రతులను కళాకారులు స్థిరాస్తి గా భావించి గౌరవంగా చూసుకుంటారు. అలాగే వీరి దగ్గర ఉండే రాగి పత్రాల మీద మున్నూరు కాపు వారిని గోత్రాలవారు అర్థించే హక్కు (మీ రాశి) ఉందని రాసి ఉంటుంది. ఈ రాగి పత్రాలను కూడా కళాకారులు పవిత్రంగా చూసుకొంటారు.

నేటి స్థితి

కళాకారులు తెలంగాణలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చిలాపూర్, సైదాపూర్, బూడిద పల్లి వెంకటేశ్వర పల్లి, రేగులపల్లె, హుస్నాబాద్లోను; ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాజిపల్లి, జైపూర్, బెజ్జాల, గెరక పల్లిలోను; సిద్దిపేట జిల్లా ఇబ్రహీం నగర్ లోను; నిజామాబాద్ పట్టణ కేంద్రంలోను; ఆర్మూర్, మంతిని, బోధన్, భీంగల్, రాగుట్ల లోను; రంగారెడ్డి లోను స్థిరపడి 12 బృందాలుగా ఏర్పడి కట్టడి గ్రామాల్లో ప్రదర్శనలిస్తూ మనుగడ సాగిస్తున్నారు. వీరు ఇంటిపేర్లలో కొంక్యాల, తిపిరిశెట్టి, బత్తిని, చిందం నరెడ్ల, తాళ్ల, చిలుకానీ, గందెశ్రీ, ఇటిక్యాల, మేళ్ల, మడికొండ, పడిగె, కుమ్మరి ఉన్నాయి. వీరి గోత్రం కూడా కాపు వారికి ఉండే పస్పునూల గోత్రమే ఉంటుంది. కానీ ఒకరికొకరు సంబంధాలు ఇచ్చిపుచ్చుకునే సంప్రదాయం లేదు. కేవలం కంచం పొత్తు మాత్రమే ఉంటుంది.

ఈ కళాకారులకు మహారాష్ట్రలోని బల్లార్షా చుట్టూ ప్రాంతాల్లో కూడా కట్టడి గ్రామాలు ఉన్నాయి. అక్కడికి కూడా వెళ్లి వారి గోత్రాలను కీర్తించి వస్తారు. అలాగే తెలంగాణలో భూపాలపల్లి జిల్లా కాటారం ప్రాంతంలోనే ఉండే రెడ్డి గాండ్ల దగ్గరికి వెళ్లి కూడా వారి గోత్రాలను కీర్తించి ప్రతిఫలం పొందటం జరుగు తుంది. ఇట్లా కళాకారులు తమకు వంశాను క్రమంగా సంక్రమిం చిన గ్రామాలకు వెళ్లి తమ సాంస్కృతిక నేపథ్యాన్ని అనుసరిస్తూ, తమ సంస్క తిని నిలుపుకునే ప్రయత్నం చేస్తూవస్తున్నారు. గోత్రాల కళాకారులు గత చరిత్రను వర్తమానంలో కీర్తిస్తూ, వర్తమాన చరిత్రను భవిష్యత్తు తరాలకు అందించే విధంగా వంశవృక్షాలను భద్రపరుస్తూ వస్తున్నారు, అంతేగాక వారి పూర్వీకులను మననం చేస్తూ, వారిని పరిపరివిధాలుగా కీర్తిస్తూ, వారి సంస్కృతిని సజీవంగా నిలుపుతున్నారు. ఇదే క్రమంలో కళాకారులు ఇతిహాసాలను నాటకాల రూపంలో ప్రదర్శిస్తూ



రాగి శాసనం

వినోదాన్ని కలిగిస్తూ మనుగడ సాగిస్తున్నారు. అయితే వారు తమ సంస్కృతీ పరంపరను వర్తమానంలో కొనసాగించడానికి అనేక అవరోధాలను ఎదిరిస్తూ వస్తున్నారు. కళాకారులకు ప్రదర్శనలు లేకుంటే ఖాళీగా ఉండే పరిస్థితి నెలకొని ఉంది. వీరు వృత్తి గాయకులుగా, సంప్రదాయ కళాకారులుగా, ఆశ్రిత గాయకులుగా బతుకుతు న్నందువల్ల ప్రభుత్వం ఆదుకోవాలని కోరుకుంటున్నారు.

– డా.బాసని సురేష్
9989417299

జ్యోతి నృత్యం

తెలుగు రాష్ట్రాల్లో రకరకాల నృత్యాలు ఉన్నాయి. ఇందులో కొన్ని ఆదివా సీలకే సొంతమైతే కొన్ని మైదాన ప్రాంతవాసులు చేస్తారు. మైదాన వాసులు చేసే నృత్యాలలో జ్యోతి నృత్యం ఒకటి. కాకపోతే ఇది మన ప్రాంతంలో అంతగా ప్రాచుర్యంలో లేదు. జ్యోతుల బోనాలు, ముద్దలు పెట్టడం, జ్యోతి ఆడటం వంటిపేర్లతో ఈ నృత్యాన్ని పిలుస్తారు. అయితే రాయల సీమలో ఇది చాలా పేరెన్నికగన్న నృత్యం. జ్యోతి నృత్యాన్ని రాయల సీమలో కులాచారంలో భాగంగా ప్రదర్శిస్తారు. అంటే ఇది ఒక ఆరాధనా నృత్యమన్నమాట. 'నేత' (సాలె) కులస్తులు చౌడమ్మ దేవతకు జ్యోతి నృత్యం ప్రదర్శనతో బలిస్తారు. బోనం పెడతారు. ఏడాదికొకసారి ఈ నృత్యాన్ని ప్రదర్శిస్తారు. అనంతపురం జిల్లా తాడిమర్రి మండలంలోని పెద్దకోట్ల చౌడమ్మకు నేత కులంవారు జ్యోతినృత్యంతో జాతర చేస్తారు. కర్నూలు జిల్లా నంద్యాల, కడపజిల్లా సింహాద్రిపురం, అనంతపురం జిల్లా ధర్మవరంలో అత్యంత ఉత్సాహంగా ఈ నృత్యాన్ని చేస్తారు. గ్రామం బయట జ్యోతిని తయారుచేస్తారు. నియమ నిష్టలతో ఆరాధించి అనుభవమున్నవారు నెత్తిన ఎత్తుకుంటారు. బియ్యం బెల్లం కలిపిన పిండి ముద్దచేసి నెయ్యితో జ్యోతిని తయారుచేస్తారు. జ్యోతి ఉన్న పాత్రను ఒకరు నెత్తిన పెట్టుకుంటారు. అతని చుట్టూ తాళాలతో, చేతుల చప్పట్లతో శివుని మీద, చౌడమ్మ మీద రకరకాల పాటలు పాడతారు. తాళానికి అనుగుణంగా జ్యోతి ఆడతారు. జ్యోతిని నెత్తిమీద పెట్టుకున్న వారు రెండు చేతులను వదిలి రకరకాల అడుగులు వేయడం ప్రత్యేకం. అట్లా గ్రామం వెలుపల నుంచి అన్ని ఇండ్ల దగ్గరకు వెళ్ళిన తరువాత చౌడమ్మ గుడి దగ్గరకి వచ్చి జ్యోతిని అర్పిస్తారు. చౌడమ్మ గుడిదగ్గర బోనాలు పెట్టి బలివ్వడం ఆచారం. బలిలో ముఖ్యంగా కోళ్లు, పొట్టేళ్లు, గొర్రెలు ఉంటాయి. అందరూ బంధుమిత్రులతో కలిసి సంబరాలు జరుపుకుంటారు. అట్లా చేస్తే గ్రామాన్ని, తమ కులాన్ని చౌడమ్మ దేవత కాపాడుతుందని వారి నమ్మకం. నృత్యప్రదర్శనలో పొరపాటున జ్యోతి కిందపడిపోతే అపశకునంగా భావిస్తారు. ఆ ఏడాది గ్రామానికి కీడు కలుగుతుందని, చౌడమ్మకు కోపం వస్తుందని వారి నమ్మకం. జ్యోతి నృత్యంలో ఒకరు పాడుతుంటే మిఇలినవారు వంత పాడుతారు. జ్యోతిని ఎత్తుకున్న కళాకారుడు ఆడుతూ ఉంటాడు.

ఈ జ్యోతి నృత్యం మన భారతీయుల పండుగలతో నృత్యానికి ఉన్న సంబంధాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నది. ఆట, పాట లేని పండుగలకు మన సంస్కృతుల్లో స్థానం లేదు. ఏ కులం వారైనా పాటలు, నృత్యాలతో పండుగ చేసుకోవడం సాధారణ దృశ్యం. అయితే కొన్ని నృత్య పద్ధతులు, పాటలు కొన్ని కులాలు, వర్గాలకు మాత్రమే పరిమితమై ఉంటాయి. అటువంటి వాటిల్లో జ్యోతి డాన్స్ ఒకటి.



ప్రపంచకప్ పండుగ

నవతెలంగాణ క్రీడా విభాగం

2018 క్రీడలకు ఎంతో బిజీగా గడిచింది. ఫిఫా ప్రపంచకప్, వింటర్ ఒలింపిక్స్, కామన్‌వెల్త్ గేమ్స్, ఆసియా క్రీడలతో ఏడాది ఆసాంతం క్రీడల పండుగగానే సాగింది. ఆసియా అథ్లెట్లు మరింత బిజీగా గడిపారు!. మల్టీస్పోర్ట్స్ ఈవెంట్స్‌తో మినీ ఒలింపిక్స్ ఏడాదిని తలపించింది. స్పోర్ట్స్ లవర్స్ ఏడాది కొనసాగింపుగా, ఆ స్థాయిలో కొత్త ఏడాది సిద్ధం కాలేదు!. కానీ క్రికెట్ ప్రియులకు మాత్రం 2019 పండుగ వాతావరణాన్ని తీసుకు రానున్నది. ఎందుకంటే, ప్రపంచ క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే వన్డే వరల్డ్‌కప్ ఈ ఏడాదే జరుగనున్నది. ఇంగ్లాండ్, వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) 2019 ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇస్తోంది. వేసవిలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ ముగిసీ, ముగియగానే వరల్డ్‌కప్ సందడి మొదలవ్వనున్నది.

ఇది వరల్డ్‌కప్ ఏడాది

పరుగుల యంత్రాన్ని తలపిస్తోన్న సూపర్ స్టార్ విరాట్ కోహ్లి 2018లో సచిన్ టెండూల్కర్ వేగవంతమైన పది వేల పరుగుల రికార్డును బద్దలు కొట్టాడు. బ్యాట్స్‌మన్‌గా దిగ్గజ హోదా పొందేసిన విరాట్, నాయకుడిగా వన్డే వరల్డ్‌కప్‌తో లెజెండ్ అవ్వాలని ఆశ పడుతున్నాడు. 2019 విరాట్ కోహ్లికి అత్యంత ప్రతిష్టాత్మక ఏడాది కానున్నది. వరల్డ్ నం.1 హోదాలో ఆతిథ్య ఇంగ్లాండ్ తొలి ప్రపంచకప్‌పై కన్నేయగా, వరల్డ్‌కప్‌ను మూడోసారి భారత్‌కు తీసుకొచ్చేందుకు కోహ్లి ఏం చేస్తాడనేది ఆసక్తికరం. క్రికెటేతర క్రీడల్లో ఈ ఏడాది మెగా ఈవెంట్లు ఏమీ లేవు. ఏడాదిలో వచ్చే ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లోనే సత్తా చాటాల్సి ఉంటుంది. కానీ టోక్యో 2020 ఒలింపిక్స్‌పై కన్నేసిన భారత స్టార్స్.. అందుకు అర్హత సాధించేందుకు ఈ ఏడాది పెద్ద టోర్నీల్లో సత్తా చాటాల్సిన అవసరం ఉన్నది. మెగా టోర్నీలు లేకపోయినా ఒలింపిక్స్ అర్హత మార్క్ పోటీ తీవ్రతను పెంచనున్నది. ఒలింపిక్స్‌లో పతకాలు తీసుకురాగల సత్తా ఉన్న హిమ దాస్, నీరజ్ చోప్రా, మను భాకర్, మోనిక బత్రా, స్వప్న బర్మన్ వంటి అథ్లెట్ల ప్రదర్శన ఈ ఏడాది ఆసక్తిదాయకం కానున్నాయి!.

ఐసీసీ టీ20 జట్టు సారథి హర్మన్‌ప్రీత్

- వన్డే, టీ20 జట్లలో స్మృతీ, పూనమ్
- 2018 జట్లను ప్రకటించిన ఐసీసీ



దుబాయ్ : భారత జట్టును టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్స్‌కు చేర్చిన హర్మన్‌ప్రీత్ కౌర్‌ను ఐసీసీ ఈ ఏడాది టీ20 సారథిగా ఎంచుకున్నది. ఇంగ్లాండ్‌తో సెమీఫైనల్లో దిగ్గజ క్రీడాకారిణి మిథాలీ రాజ్‌ను పక్కన పెట్టడంపై విమర్శలు ఎదుర్కొన్నా.. అత్యుత్తమ నాయకత్వ లక్షణాలు సహా బ్యాట్స్‌వుమెన్‌గా తిరుగులేని ఫామ్‌తో హర్మన్‌ప్రీత్ కౌర్ ఐసీసీ కెప్టెన్‌గా గౌరవం దక్కించుకున్నది. సోమవారం ఐసీసీ మహిళల 2018 వన్డే, టీ20 జట్లను ప్రకటించింది. యువ సంచలనం స్మృతీ మంధాన వన్డే, టీ20 జట్లలో చోటు చేసుకోగా, స్పిన్నర్ పూనమ్ యాదవ్ సైతం వన్డే, టీ20 జట్లలో చోటు దక్కించుకున్నది. హర్మన్‌ప్రీత్ కౌర్‌కు వన్డే జట్టులో చోటు లభించలేదు. మిథాలీ రాజ్ ఏ జట్టులోనూ చోటు చేసుకోక పోవటం గమనార్హం. వన్డే జట్టుకు న్యూజిలాండ్ స్టార్ సుజీ బేట్స్ సారథిగా ఎంపికైంది.

ఐసీసీ వన్డే జట్టు : స్మృతీ మంధాన (భారత్), టామీ బ్యూమోంట్ (ఇంగ్లాండ్), సుజీ బేట్స్ (న్యూజిలాండ్, కెప్టెన్), డేన్ వాన్ నికెర్క్ (దక్షిణాఫ్రికా), సోఫీ డివైన్ (న్యూజిలాండ్), అలసా హీలే (ఆస్ట్రేలియా, వికెట్ కీపర్), మరిజానె కాప్ (దక్షిణాఫ్రికా), డాటిన్ (వెస్టిండీస్), సనా మిర్ (పాకిస్తాన్), సోఫీ ఎకెల్‌స్టోన్ (ఇంగ్లాండ్), పూనమ్ యాదవ్ (భారత్).

ఐసీసీ టీ20 జట్టు : స్మృతీ మంధాన (భారత్), అలిసా హీలే (ఆస్ట్రేలియా, వికెట్ కీపర్), సుజీ బేట్స్ (న్యూజిలాండ్), హర్మన్‌ప్రీత్ కౌర్ (భారత్, కెప్టెన్), నటాలీ సీవర్ (ఇంగ్లాండ్), ఎలిసీ పెర్రీ (ఆస్ట్రేలియా), అష్లె గార్డెనర్ (ఆస్ట్రేలియా), కాస్పరెక్ (న్యూజిలాండ్), మెగన్ స్కట్ (ఆస్ట్రేలియా), రుమాన అహ్మద్ (బంగ్లాదేశ్), పూనమ్ యాదవ్ (భారత్).


ఫైనల్లో బెంగళూర్

కోచి : ప్రొ కబడ్డీ లీగ్ తొలి ఫైనల్స్ బెర్త్ బెంగళూర్ బుల్స్ వశమైంది. గ్రూప్ దశలో దుమ్మురేపిన గుజరాత్‌పై 41-29తో ఘన విజయం సాధించిన బెంగళూర్ టైటిల్ పోరుకు చేరుకున్నది. బుల్స్ రైడర్ పవన్ 13 పాయింట్లు తీసుకురాగా, డిఫెండర్ మహేందర్ సింగ్ 6 ట్యాకిల్స్‌తో రాణించాడు. సచిన్ (10) రాణించినా గుజరాత్ మెప్పించలేదు. క్వాలిఫయర్ 2తో ఫైనల్స్‌కు చేరేందుకు గుజరాత్‌కు మరో అవకాశం ఉంది.



స్మృతీ మంధాన క్రికెటర్ ఆఫ్ ది ఇయర్

దుబాయ్ : భారత మహిళల క్రికెట్ యువ సంచలనం, అపార క్రికెట్ ప్రతిభావంతురాలు స్మృతీ మంధాన మరో ఘనత సాధించింది. దిగ్గజ సీమర్ జులన్ గోస్వామి తర్వాత ఐసీసీ పురస్కారం దక్కించుకున్న రెండో భారత క్రికెటర్‌గా నిలిచింది. 2018లో 66.90 సగటుతో వన్డేల్లో రెచ్చిపోయిన మంధాన, టీ20ల్లో 130.67 స్ట్రయిక్ రేట్‌తో పరుగులు పిండుకున్నది. 12 వన్డేల్లో 669 పరుగులు చేసిన మంధాన, 25 టీ20ల్లో 622 పరుగులు పిండుకున్నది. రెండు ఫార్మాట్లలోనూ అత్యుత్తమ ప్రదర్శన చేసిన స్మృతీ 'ఉమెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్' సహా ఉమెన్ వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును సొంతం చేసుకున్నది. టీ20 ప్రపంచకప్‌లో ఐదు మ్యాచుల్లో 178 పరుగులు చేసిన మంధాన, భారత్ సెమీఫైనల్స్‌కు చేరటంలో ప్రముఖ పాత్ర పోషించింది. 2007లో జులన్ గోస్వామి ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు దక్కించుకోగా, ఆ తర్వాత ఐసీసీ అవార్డు అందుకోబోతున్న భారత క్రికెటర్ స్మృతీ మంధాననే కావటం విశేషం. ' నేను భారత్‌కు ఆడటం మొదలు పెట్టినప్పుడు, ఇటువంటి అవార్డులు సాధిస్తానని అస్సలు అనుకోలేదు. ఐసీసీ అవార్డు దక్కటం ఎంతో సంతోషంగా ఉంది. మెరుగైన ప్రదర్శనకు గుర్తింపు లభించినప్పుడు, మరింత కష్టపడేందుకు ప్రేరణ ఇస్తుంది' అని మంధాన ఆనందం వ్యక్తం చేసింది.

















Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.